Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక


www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 168 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 9 జూలై 2023 | ఆదివారం | పేజీలు : 4

## గృహిణులకు ప్రతినెలా రూ.1000 పథకం

చెన్నై : గృహిణులకు ప్రతినెలా రూ.1000 చెల్లించే పథకాన్ని అమలు చేయడానికి ప్రత్యేక శిబిరాల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన జరిగిన అధికారుల సమావేశం లో నిర్ణయించారు. ప్రతి రేషన్‌షాపు వద్ద నిర్ణీత తేదీల్లో ప్రత్యేక శిబిరాలు జరిపి కార్డుదారుల్లో సభ్యులుగా ఉన్న గృహిణులను రప్పించి వారి ఆధార్, బ్యాంక్ ఖాతాలు తదితర వివరాలను పొందిన తర్వాతే ఎంపిక చేస్తారు. 21 యేళ్లు పైబడిన గృహిణులే ఈ పథకానికి అర్హులుగా ప్రకటించాలని కూడా ఈ సమావేశంలో సీఎం సూచించారు. ఈ పథకాన్ని సెప్టెంబర్ 15 నుంచి అమలు చేయనుండడంతో ఆగస్టుకల్లా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఇక రేషన్ కార్డులో చూపిన చిరునామాలలోనే గృహిణులు నివశిస్తుండాలని, వారి వార్షికాదాయం కూడా నిర్దేశిత పరిమాణంలో ఉండాలని, ఈ నిబంధనలన్నీ అధికారులు తప్పకుండా అమలు చేయాలని ఆదేశించారు.

# కనీవినీ ఎరుగని రీతిలో కేసీఆర్ అవినీతి




వరంగల్: దేశాభివృద్ధిలో తెలుగువారి ప్రతిభ కీలకంగా మారిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దేశానికి ఇది స్వర్ణ యుగమని చెప్పారు. వరంగల్ పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన విజయ సంకల్పసభ వేదికగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. హనుమకొండలో రూ.6,109 కోట్ల విలువైన పనులకు ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు. రూ.521 కోట్లతో రైలు వ్యాగన్ల కర్మాగార నిర్మాణానికి, రూ.2,147 కోట్లతో జగిత్యాల-కరీంనగర్-వరంగల్ జాతీయరహదారి పనులకు, రూ.3,441 కోట్లతో మంచిర్యాల-వరంగల్ జాతీయరహదారి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం తెలుగులో ప్రసంగం ప్రారంభించిన ప్రధాని తెలంగాణ ప్రజలందరికీ అభినందనలు తెలిపారు. ఏ" తెలంగాణ ఏర్పడి 9 ఏళ్లు పూర్తయింది. దేశాభివృద్ధిలో తెలంగాణది కీలక పాత్ర. అభివృద్ధిలోనూ తెలంగాణది ప్రధాన భూమిక. రూ.6వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభించుకుంటున్నాం. దేశాభివృద్ధి కోసం శరవేగంగా పనులు పూర్తి చేస్తున్నాం. అనేక కారిడార్లను పూర్తి చేసుకుంటున్నాం. హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేలు, ఇండస్ట్రియల్-ఎకనామిక్ కారిడార్లు ఏర్పాటు చేస్తున్నాం. తెలంగాణలో ముఖ్య చారిత్రక, ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రాలున్నాయి. కరీంనగర్ గ్రానైట్ పరిశ్రమకు కేంద్రం సహకారం అందిస్తుంది. రైల్వే ఉత్పత్తుల విషయంలో రికార్డులు సృష్టిస్తున్నాం. తెలంగాణలో రైల్వే రహదారుల కనెక్టివిటీ పెంచుతున్నాం" అని ప్రధాని మోదీ అన్నారు.

**కేసీఆర్ ప్రభుత్వం అత్యంత అవినీతి ప్రభుత్వం :** అభివృద్ధి పనులకు శంకుస్థాపన అనంతరం పార్టీ నేతలు మాట్లాడారు. ఆ తర్వాత మరోసారి మోదీ ప్రసంగించారు. భద్రకాళి, సమ్మక్క, సారలమ్మ, రుద్రమదేవీలను ప్రధాని స్మరించుకున్నారు. సమ్మక్క- సారలమ్మ పౌరుషానికి ప్రతీకలని చెప్పారు. రాణి రుద్రమ పరాక్రమానికి చిరునామా అయిన వరంగల్‌కు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర ప్రభుత్వంపై మోదీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు." కేసీఆర్ ప్రభుత్వం అవినీతిని పెంచి పోషిస్తోంది. అత్యంత అవినీతి ప్రభుత్వం. కేసీఆర్ సర్కారు అవినీతి దిల్లీ వరకూ పాకింది. కేంద్రం ఎన్నో అభివృద్ధి పనులు చేపడుతుంటే.. మరి రాష్ట్రం ఏం చేస్తోంది. అభివృద్ధి కోసం కొన్ని రాష్ట్రాలు కలిసి పని చేస్తుంటాయి. తొలిసారి అవినీతి కోసం రెండు రాష్ట్రాలు కలిసి పని చేయడం దౌర్భాగ్యం. ఇలాంటి అవినీతి చూసేందుకేనా.. యువత ఆత్మబలిదానాలు చేసింది" అంటూ మండిపడ్డారు. కేంద్రప్రభుత్వాన్ని విమర్శించడమే కేసీఆర్ సర్కారు పనిగా పెట్టుకుందని మోదీ విమర్శించారు. ఇలాంటి కుటుంబ పాలనలో రాష్ట్రం చిక్కుకుంటుందని ప్రజలు అనుకోలేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అవినీతి పాలనను దేశమంతా చూసిందని, కేసీఆర్ అవినీతి పాలనను చూస్తోందని అన్నారు. ఈ రెండు పార్టీలను పత్తాలేకుండా చేస్తామన్నారు. " కేసీఆర్ ప్రభుత్వం.. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసింది. యువతను మోసం చేసింది. లక్షలాది ఉద్యోగాలు కల్పిస్తామని హామీలు ఇచ్చి కేసీఆర్ మోసం చేశారు. టీఎస్‌పీఎస్సీ స్కామ్ ద్వారా కేసీఆర్ ప్రభుత్వం యువతను మోసం చేసింది. తెలంగాణ వర్సిటీలో 3 వేల అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాఠశాలల్లో వేల సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పోస్టులు భర్తీ చేయకుండా విద్యార్థులకు ద్రోహం చేశారు." అని మోదీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై సర్పంచ్‌లందరూ ఆగ్రహంతో ఉన్నారని మోదీ అన్నారు. గ్రామపంచాయతీలకు కేంద్రం నేరుగా నిధులిస్తోందని, గత 9 ఏళ్లలో కేంద్రం రూ. లక్ష కోట్లకుపైగా నిధులిచ్చిందని చెప్పారు.

మద్దతు ధర ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చామన్నారు. " తెలంగాణకు మెగా టెక్స్‌టైల్ పార్క్ ఇచ్చాం. ఎస్సీలు, ఎస్టీలు, పేదలను కేసీఆర్ ప్రభుత్వం మోసం చేసింది. ఆదివాసీ గ్రామాలకు ఎలాంటి మౌలిక సౌకర్యాలు కల్పించట్లేదు. మేం ఆదివాసీ ప్రాంతాల్లో ఆరులైన్ల రహదారులు వేస్తున్నాం. కేంద్రం ఇన్ని చేస్తుంటే.. మరి రాష్ట్రం ఏం చేస్తోంది?" అని మోదీ ప్రశ్నించారు.




## మోదీ బెదిరింపులు, ఉడత ఊపులకు భయపడే ప్రసక్తే లేదు: కేటీఆర్

**ప్రధాని మోదీ వరంగల్ పర్యటనలో భారాస ప్రభుత్వంపై చేసిన విమర్శలపై మంత్రులు తీవ్రంగా మండిపడ్డారు. విభజన చట్టంలో కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని పేర్కొంటే.. ప్రధాని మోదీ వ్యాగన్ రిపేర్ షాప్‌నకు శంకుస్థాపన చేయడం తెలంగాణ ప్రజలను అవమానించడమేనని మంత్రి కేటీఆర్ విమర్శించారు. గుజరాత్‌కి ప్రధాని రూ.20 వేల కోట్లతో లోకోమోటివ్ ఫ్యాక్టరీ ఇచ్చారని.. తెలంగాణలో మాత్రం రూ.520 కోట్లతో వ్యాగన్ రిపేర్ షాప్ పెట్టడం దారుణమని కేటీఆర్ ఆక్షేపించారు. మోదీ ఊకదంపుడుకు భయపడే ప్రసక్తే లేదన్నారు.**



హైదరాబాద్ : వచ్చే సంవత్సరంలో జరగబోతున్న లోక్ సభ ఎన్నికలపైనే ఎక్కువగా కేసీయార్ దృష్టిపెట్టినట్లు సమాచారం. లోక్ సభ మాత్రమే ఏమిటి ? అసెంబ్లీ సీట్లు గెలిచి మళ్ళీ అధికారంలోకి రావాలని ఆలోచించటంలేదా అనే కంగారుపడకండి. లోక్ సభ సీట్లమీద కేసీయార్ దృష్టిపెట్టింది ఏపీ విషయంలో. ఏపీలోని 25 లోక్ సభ స్థానాలున్నాయి కదా వీటిల్లో బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపితే ఎలాగుంటుందనే విషయాన్ని ఆలోచించమని ఏపీ బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ తదితర సీనియర్లకు చెప్పారట. అంటే దీన్నిబట్టి కేసీయార్ ఆలోచన

## ఎంపీ సీట్లమీదే దృష్టిపెట్టారా ?

ఎలాగుందంటే లోక్ సభ సీట్లో మ్యాగ్జిమమ్ గెలవగలిగితే బీజేపీ గెలుపును అడ్డుకోవచ్చని అర్ధమవుతోంది. అందుకనే తెలంగాణాతో పాటు మహారాష్ట్రలో కూడా ఎంపీ సీట్లపైనే ఎక్కువ టార్గెట్ చేస్తున్నది. వీటికి అదనంగా ఏపీ కూడా తోడైందంతే. తెలంగాణా అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలయ్యేలోగానే ఏపీలో వీలైనన్ని బహిరంగసభలు నిర్వహించాలని కేసీయార్ ప్లాన్ చేస్తున్నారు. మొదటిసభ కృష్ణా-గుంటూరు ప్రాంతంలో నిర్వహించమని చెప్పారట. తర్వాత కోస్తా ప్రాంతం రాయలసీమ ఉత్తరాంధ్రలో మూడు బహిరంగసభలు నిర్వహించాలని తోటకు చెప్పారట. నరేంద్రమోడీ ప్రభుత్వంపై ఏపీ జనాల్లో బాగా వ్యతిరేకత ఉందన్న విషయం కేసీయార్ కు అర్ధమైందట. వైసీపీ టీడీపీ జనసేనల్లో ఏదికూడా కేంద్రప్రభుత్వాన్ని లేదా బీజేపీని ఎదిరించేంత సీనున్న పార్టీలు కావన్నది కేసీయార్ ఆలోచన. అందుకనే ప్రజల్లోని మంటను అడ్వాంటేజ్ తీసుకుని బీఆర్ఎస్ చొచ్చుకుపోవాలని అనుకుంటున్నారట. అందుకనే నాలుగు ప్రాంతాల్లో బహిరంగసభలు నిర్వహించటం ద్వారా జనాల్లో బీఆర్ఎస్ బలమైన ముద్ర వేయాలన్నది కేసీయార్ వ్యూహంగా తెలుస్తోంది. ఇందుకోసం ఒకేసారి అసెంబ్లీ పార్లమెంటు స్థానాల్లో పోటీచేసి ఇబ్బందులు పడేబదులు పరిమిత సంఖ్యలోనే టార్గెట్ ఫిక్స్ చేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని అనుకుంటున్నారు. అందుకనే మహారాష్ట్రలో కూడా ఐదుజిల్లాల్లోని పార్లమెంటు సీట్లపైనే ఎక్కువ దృష్టిపెట్టారు.

ఏపీలో కూడా ప్రత్యేకహోదా విశాఖ రైల్వేజోన్ పోలవరం ప్రాజెక్టు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ లాంటి అంశాలనే ఎక్కువగా టచ్ చేయాలని కూడా ప్లాన్ చేశారట. ఈ అంశాలను పదేపదే ప్రస్తావించటం ద్వారా అటు బీజేపీతో పాటు ఇటు మూడుపార్టీలను ఇరుకున పెట్టినట్లుంటుందన్నది కేసీయార్ వ్యూహమట. మరి చివరకు ఏమవుతుందో చూడాల్సిందే.

# వంటకు ధరల మంట!

## కొండెక్కి కూర్చున్న కూరగాయలు
## 87 శాతం కుటుంబాలు సతమతం



హైదరాబాద్ : నెలన్నర క్రితం కిలో టమాటా రూ.20! చూస్తూచూస్తుండగానే దాని రేటు సెంచరీ దాటేసి రూ.140 దగ్గర తచ్చట్లాడుతోంది! మిర్చి రేటూ దాని ఘాటుకు దీటుగా పెరుగుతోంది!! దొండకాయ, క్యాప్సికం, అల్లం-వెల్లుల్లి.. ఒక్కటనేమిటి అన్నింటి రేట్లూ పెరిగిపోయాయి. కూరలు లేకపోతే పోయే.. పచ్చడితో తిందామంటే.. సన్నరకాల సాగు తగ్గి, డిమాండ్ పెరిగి బియ్యం ధరలూ అమాంతం ఆకాశాన్నంటడంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. గత ఏడాది ఇదే సీజన్‌లో రాష్ట్రంలో సన్నబియ్యం ధర క్వింటాకు రూ.5 వేలు ఉండగా.. ఇప్పుడది రూ.6 వేలు పలుకుతోంది. కొన్ని రకాలైతే నెలరోజుల వ్యవధిలోనే క్వింటాలుకు రూ.800 నుంచి రూ.1000 వరకూ ధరలు పెరిగాయి. బియ్యం ధరలు పెరగడానికి చాలా కారణాలున్నాయి. దొడ్డు ధాన్యం కొనుగోలు చేయబోమని గత వానాకాలం సీజన్‌లో ప్రకటించిన ప్రభుత్వం చివర్లో కొనుగోలు చేయడం.. ఈ ఏడాది ఎన్నికల సీజన్ కావడంతో దొడ్డు ధాన్యంపై నిషేధం ఎత్తివేయడంతో రైతులు దానివైపే మొగ్గుచూపడంతో సన్నబియ్యం సాగు తగ్గిపోయింది. డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడం బియ్యం ధరల పెరుగుదలకు ప్రధాన కారణం. 2021-22 యాసంగిలో రాష్ట్రంలో 50.39 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం దిగుబడి రాగా.. 2022-23లో 62.15 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాల్సి వచ్చింది. సన్న రకం ధాన్యం సాగు చేయాలంటే పురుగు మందు ఎక్కువసార్లు పిచికారీ చేయాల్సి ఉంటుంది. పెట్టుబడులు ఎక్కువ అవుతాయి. అదే దొడ్డు ధాన్యం అయితే రోగాలకు తట్టుకుని నిలబడుతుంది. అధిక దిగుబడి వస్తుంది. రైతు ఎక్కువగా శ్రమించాల్సిన పని ఉండదు. వీటన్నింటి నేపథ్యంలో.. రైతులంతా దొడ్డు ధాన్యం వైపు మొగ్గుచూపడంతో సన్న ధాన్యం దిగుబడి తగ్గింది. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలోని నల్లగొండ, నిజామాబాద్ జిల్లాలో కొంత భాగం మాత్రమే సన్న రకం ధాన్యం సాగైంది. దీనికి తోడు సరిహద్దు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడులో వాతావరణం అనుకూలించక సన్న ధాన్యం దిగుబడి పూర్తిగా తగ్గిపోవడంతో మన బియ్యానికి అమాంతంగా డిమాండ్ పెరిగింది. బియ్యం ధరల పెరుగుదలకు ఇది మరొక కారణం. మన రాష్ట్రంలో ఉమ్మడి నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల్లో సాగయ్యే బియ్యంలో నూనె శాతం అధికంగా ఉండి, తియ్యదనం ఉండడంతో ఈ ధాన్యానికి ఇతర రాష్ట్రాలతో పాటు విదేశాల్లోనూ డిమాండ్ ఉండడం ధరల పెరుగుదలకు కారణమైంది.

**పెరిగిన మిల్లింగ్ సామర్థ్యం..** బహిరంగ మార్కెట్‌లో బియ్యానికి మంచి డిమాండ్ ఉండడం, రానురానూ సాగు విస్తీర్ణం, దిగుబడులు పెరుగుతుండడంతో మిల్లర్లు వాటి సామర్థ్యాన్ని పెద్దస్థాయిలో పెంచారు. ఒక్క నల్లగొండ జిల్లాలోనే నిరుటితో పోలిస్తే మిల్లింగ్ సామర్థ్యాన్ని రోజుకు 5 వేల మెట్రిక్ టన్నుల మేర పెంచారు. ఫలితంగా సన్న ధాన్యానికి మద్దతు ధర సైతం భారీగా పెరిగింది. కోతల సమయంలో క్వింటాకు రూ.2,100 నుంచి రూ.2,200 వరకూ పలికిన ధాన్యం ఇప్పుడు రూ.3,100 వరకు పలుకుతోంది. ధాన్యం నిల్వ చేసుకునే సామర్థ్యం ఉన్న బడా రైతులు ప్రస్తుతం మంచి ధరకు ధాన్యం అమ్ముకుంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో సన్న బియ్యానికి మంచి డిమాండ్ ఉండడంతో మిల్లర్లు సన్న ధాన్యానికి ఎంత రేటైనా పెట్టేందుకు వెనుకాడడం లేదు. మిల్లుల సామర్థ్యం పెరిగినప్పటికీ.. అందుకు అనుగుణంగా నాణ్యమైన సన్నరకం ధాన్యం లేకపోవడంతో డిమాండ్ పెరిగింది. కొన్ని మిల్లుల్లో ఏప్రిల్‌లో కొనుగోలు చేసిన ధాన్యం మిల్లింగ్ మరో నెలలో పూర్తికానుంది. నవంబరు మిల్లింగ్ కోసం ఇప్పుడు మిల్లర్లకు ధాన్యం అవసరమైంది. ఫలితంగా మిల్లర్లు ధాన్యం వేటలో ఉన్నారు. ఇదే పరిస్థితి మరో మూడు నుంచి నాలుగు నెలల వరకు కొనసాగే అవకాశం ఉందని.. మార్కెట్‌లోకి కొత్త బియ్యం ఎక్కువ మొత్తంలో వస్తే ధరలు కొంతమేర తగ్గే అవకాశం ఉంటుందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

**కూర‘గాయాలు’...** బియ్యమే కాదు.. కూరగాయల ధరలూ భారీగా పెరిగిపోయి సామాన్యుల నడ్డి విరుస్తున్నాయి. మరీ ముఖ్యంగా.. టమాటా ధర చూస్తూచూస్తూండగానే రూ.140 దాకా చేరుకోవడంతో సామాన్యులు దాని వినియోగాన్ని బాగా తగ్గించేశారు. ఇక, పచ్చి మిర్చి రేటు వారాంతపు సంతలు, సూపర్‌మార్కెట్ల లో రూ.150కి దగ్గరగా ఉండడంతో కొనుగోలుదారులు హడలిపోతున్నారు. పొరుగు రాష్ట్రాల్లో వర్షాలు అధికంగా కురుస్తుండడంతో టమాటా పంటకు నష్టం వాటిల్లడంతో రైతులు నష్టాల్లో కూరుకుపోయారు. అయితే రైతుల వద్ద నుంచి ఎంతో కొంతకు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు మాత్రం డిమాండ్‌కు సరిపడా లేని ఆ టమాటాలను నగరానికి తీసుకొచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. రవాణా చార్జీల పేరుతో ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారు. అల్లం, వెల్లుల్లి రేట్లు కూడా సామాన్యలను హడలెత్తిస్తున్నాయి. నెలన్నర క్రితం హోల్‌సేల్‌లో అల్లం కిలో రూ.50 నుంచి 70 వరకు, వెల్లుల్లి రూ.65 నుంచి 80 వరకు ఉండగా, ప్రస్తుతం అదే హోల్‌సేల్‌లో కిలో అల్లం రూ. 150 దాటేసింది, వెల్లుల్లి కిలో రూ.120-140 వరకు పెరిగింది. రిటైల్‌లో వీటి ధరలు మరో 30 శాతం అదనంగా పెరిగాయి. బెండకాయ రూ.55 నుంచి రూ.75, దొండకాయ రూ.75-80, వంకాయ రూ.40-60, క్యారెట్ రూ.60-75, క్యాప్సికం రూ.65-80 దాకా పలుకుతున్నాయి. రాష్ట్రంలో కూరగాయల సాగు 3 లక్షల ఎకరాలకు మించి ఉండటంలేదు. వరి, పత్తితోపాటు వాణిజ్య పంటల సాగు మోజులో పడిన రైతులు... కూరగాయల సాగును గణనీయంగా తగ్గించడమూ ఈ పెరుగుదలకు మరో ప్రధాన కారణం. రాష్ట్రంలో ఏడాదికి సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయల వినియోగం ఉండగా.. 20 లక్షల టన్నులకు మించి కూరగాయలు ఉత్పత్తి కావటంలేదు. దీంతో మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు హైదరాబాద్ శివారు జిల్లాల్లో కూరగాయల సాగు విస్తీర్ణం లక్ష ఎకరాలకుపైగా ఉండేది. ఇప్పుడు గణనీయంగా తగ్గిపోయింది. ఫలితంగా హైదరాబాద్ మార్కెట్‌కు కూరగాయలు ఆశించినస్థాయిలో రావటంలేదు. మార్కెటింగ్ శాఖ అధికారులు ధరలు నియంత్రించేందుకు చేస్తున్న ప్రయత్నాలు కూడా విఫలం కావడం ఆందోళనకరం.

# సంపాదకీయం

## అగ్ర రాజ్యంతో చైనా చిప్ వార్!

కంప్యూటర్లు ల్యాప్టాపులు ట్యాబ్లు సెల్ ఫోన్లు పనిచేయాలంటే సెమీ కండక్టర్లు చిప్ లు అవసరం ఎంతో. అవి లేకుండా ఎలక్ట్రానిక్ వస్తువులు పనిచేయవు. అదే జరిగితే టెక్నాలజీపైనే ఆధారపడ్డ సంస్థలు తీవ్రంగా నష్టపోకతప్పదు. అంతేకాకుండా దీని ప్రభావం ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలపైన తీవ్రంగా ఉంటుంది. ప్రస్తుతం ప్రపంచంలో 70 నుంచి 80 శాతం సెమీకండక్టర్లు చిప్ ల అవసరాలను తైవాన్ తీరుస్తోంది. అయితే తైవాన్ తమలో భాగమని.. తైవాన్ ను తమ దేశంలో కలిపేసుకుంటామని చైనా హెచ్చరికలు జారీ చేస్తోంది. అదే జరిగితే సెమీకండక్టర్లు చిప్ ల ఎగుమతిని చైనా ఆపేస్తే ప్రపంచ దేశాల వ్యవస్థలు కుప్పకూలడం ఖాయం. ఈ నేపథ్యంలోనే అగ్ర రాజ్యం అమెరికా ముందు జాగ్రత్త చర్యగా భారత్ లో భారీ ఎత్తున సెమీ కండక్టర్లు చిప్ ల తయారీకి పెట్టుబడులు పెట్టనుంది. ఈ మేరకు ఇటీవల ప్రధాని మోదీ అమెరికా పర్యటనలో ఒప్పందాలు కుదిరాయి. తైవాన్ బయట భారత్ అయితేనే చిప్ లు సెమీ కండక్టర్ల అవసరాలను తీర్చగలదని అమెరికా దాని మిత్ర దేశాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చైనా చిప్ వార్ మొదలుపెట్టింది. కంప్యూటర్ చిప్స్లో వినియోగించే అరుదైన ఖనిజాల ఎగుమతులపై చైనా పట్టు బిగించింది. గాలియం జర్మేనియం వంటి ఖనిజాలను ప్రభుత్వ అనుమతి లేకుండా ఎగుమతి చేయడానికి వీల్లేదని ఆ దేశ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రపంచంలోనే ఈ ఖనిజాలు అత్యధికంగా చైనాలోనే లభిస్తున్నాయి. అమెరికా తయారు చేసే అత్యాధునిక మైక్రోప్రాసెసర్లను చైనాకు విక్రయించడంపై అమెరికా ఆంక్షలు విధించింది. దీనికి కౌంటర్ గా అన్నట్టు చిప్స్ తయారీ ఖనిజాల ఎగుమతులను చైనా ఆపేస్తోంది. మరికొన్ని రోజుల్లో అమెరికా ట్రెజరీ సెక్రటరీ జానెట్ యెల్లన్ చైనాలో పర్యటించనున్న నేపథ్యంలో ఆ దేశం ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే జాతీయ భద్రత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొనే ఈ నిర్ణయం తీసుకొన్నట్లు చైనా వాణిజ్యశాఖ చెబుతోంది. గాలియం జర్మేనియంను కమ్యూనికేషన్లు సెమీ కండెక్టర్లు సైనిక పరికరాల్లో అత్యధికంగా వినియోగిస్తారు. అలాగే సోలార్ ప్యానల్స్ తయారీలోనూ వీటిని ఉపయోగిస్తారు. ప్రస్తుతం సెమీకండెక్టర్లను ఫోన్ల నుంచి వాహనాలు ఆయుధాలు ఇలా ప్రతి ఒక్క ఎలక్ట్రానిక్ పరికరంలో ఉపయోగిస్తున్న సంగతి తెలిసిందే. కొద్ది రోజుల క్రితం అమెరికా మిత్ర దేశమైన నెదర్లాండ్స్ కొన్ని రకాల ప్రత్యేకమైన చిప్ లను చైనాకు ఎగుమతి చేయడంపై నిషేధం విధించింది. దీంతో చైనా పరిశ్రమలు ఇబ్బందుల్లో పడ్డాయి. తాజాగా ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య పోరాటానికి ఇవే కేంద్రంగా నిలిచాయి. చైనాకు సెమీకండెక్టర్లను దక్కనివ్వకుండా అమెరికా ప్రయత్నిస్తోంది. అయితే ఆ చిప్ ల తయారీకి కావలసిన ముడి ఖనిజాలు అమెరికాలో లేవు. చిప్ ల తయారీకి కీలకమైన రాగి నిక్షేపాలు దక్షిణ అమెరికా ఖండ దేశమైన చిలీలో అత్యధికంగా ఉన్నాయి. వీటిని ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్న దేశం చైనానే కావడం గమనార్హం. అలాగే అల్యూమినియం టంగ్స్టన్ వంటి ఉత్పత్తులు చైనా ఆధిపత్యంలోనే ఉన్నాయి. ఇక బ్యాటరీల తయారీకి అవసరమైన లిథియం నిక్షేపాలు కూడా దక్షిణ అమెరికా ఖండ దేశాల్లోనే ఉన్నాయి. ఇక కంప్యూటర్లు స్మార్ట్ ఫోన్ మదర్ బోర్డుల తయారీలో వాడే గాలియం లోహ నిక్షేపాల్లో 95 శాతం చైనాలోనే ఉండటం గమనార్హం. ఇలా చిప్ ల తయారీలో వాడే అన్ని లోహాలపై చైనాకే పట్టు ఉంది. అమెరికా దీన్ని ఛేదించడానికి కొత్త వ్యూహాలతో ముందుకురానుండటం ఆసక్తికరంగా మారింది. భవిష్యత్తులో చిప్ ల కోసం యుద్ధం జరిగే అవకాశాలున్నాయి. వీటన్నింటిని అదుపు చేయగలవారే భవిష్యత్తును శాసించగలుగుతారని నిపుణులు పేర్కొంటున్నారు. అమెరికా చైనాల చిప్ వార్ కూడా అందుకేనంటున్నారు.

## ఏకరూపం.. బహుదూరం..!



జనగామ : ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు కావస్తోంది. ఆరంభంలో అరకొర పుస్తకాలతో కొనసాగిన ప్రభుత్వ బడుల్లో ఇప్పుడా సమస్య తీరింది. విద్యార్థులకు అందించాల్సిన ఏకరూప దుస్తుల జాడలేదు. బడులు ప్రారంభం నాటికి విద్యార్థులకు అందించాల్సి ఉండగా, ఇంతవరకు 70 శాతం మందికి ఇంకా అందలేదు. చాలామంది రంగురంగుల దుస్తుల్లోనే పాఠశాలకు హాజరవుతుండగా కొందరు మాత్రం పాత వాటితోనే తరగతులకు వస్తున్నారు. మూడు నెలలైనా అందకపోవడానికి గల కారణాలపై 'న్యూస్‌టుడే' కథనం.

30 శాతం మాత్రమే పంపిణీ..

ఏటా ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల సౌకర్యార్థం ఒక్కొక్కరికీ రూ.600 విలువ చేసే దుస్తులు ఇస్తారు. బాలురకు చొక్కా, ప్యాంటు, నిక్కర్, బాలికలకు స్కర్ట్, పర్కిన్ ఇచ్చేవారు. జతకు రూ.50 చొప్పున రెండింటికి రూ.100 కుట్టు కూలీ కింద సర్వశిక్ష అభియాన్ నిధులు మంజూరు చేసేవారు. జిల్లా విద్యాశాఖ నుంచి ఎమ్మార్సీకి, అక్కడి నుంచి ప్రధానోపాధ్యాయులకు పంపేవారు. ఈ తతంగమంతా ఏటా బడుల ప్రారంభానికి ముందే పూర్తి చేసి జూన్‌లో విద్యార్థులకు అందించేవారు. రెండేళ్లుగా కరోనా కారణంగా విద్యావ్యవస్థ కుంటుపడగా, ఆ లోటు ఈ ఏడాది కనిపిస్తోంది. జిల్లాలో ఇప్పటివరకు కేవలం 30 శాతం మాత్రమే దుస్తులు పంపిణీ చేసినట్లు అధికారులు చెప్పారు.

కుట్టడంలో ఆలస్యం..

ప్రభుత్వం నుంచి ఏకరూప దుస్తులకు అవసరమైన వస్త్రం వస్తుండగా, స్థానిక దర్జీలతో కుట్టించి పాఠశాలలకు పంపిణీ చేసేవారు. ఈసారి తెలంగాణ హ్యాండ్‌లూమ్ వీవర్స్ సొసైటీ నుంచే అన్ని జిల్లాలకు వస్త్రాలను పంపిణీ చేసింది. వాటిని కుట్టే బాధ్యతను ఆయా జిల్లాలోని 70 శాతం మహిళా సంఘాలకు, 30 శాతం మేర వృత్తిదారులకు ఇవ్వాలని విద్యాశాఖ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఆ బాధ్యతను స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు. కానీ క్షేత్రస్థాయిలో నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయలేకపోతున్నారు. స్థానికంగా వ్యవసాయ పనుల్లో మహిళలు నిమగ్నమైనందున దుస్తులు కుట్టే ప్రక్రియ ఆలస్యమవుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో త్వరితగతిన కుట్టాలని ఆయా స్వయం సంఘాలను జిల్లా అధికారులు ఆదేశిస్తున్నారు.


ప్రభుత్వ విద్యాసంస్థల్లో

గతంలో ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, మైనారిటీ విద్యాసంస్థ, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలకు వేర్వేరుగా ఏకరూప దుస్తులను పంపిణీ చేసేవారు. పంపిణీలో జాప్యాన్ని నివారించడం, ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే వారందరికీ ఈ విద్యాసంవత్సరం నుంచి ఒకే రంగువి అందించాలని విద్యాశాఖ నిర్ణయించింది. విద్యార్థులకు ఈ ఏడాది ఎరుపు బూడిదరంగుల గళ్ల చొక్కాలు, రంగుప్యాంటు, నిక్కర్లు, అమ్మాయిలకూ అవే రంగుల్లో అందించనున్నారు. కొత్తగా ప్రవేశాలు పొందిన వారు సాధారణ దుస్తులు ధరిస్తున్నారు.

నెలాఖరులోగా అందజేసేలా.. – డీఈవో రాము

జిల్లాలో ఇప్పటివరకు 30 శాతం రెండు జతల దుస్తులను పంపిణీ చేశాం. మరో 50 శాతం నెలాఖరులోగా రానున్నాయి. రాగానే అందని వారికి అందిస్తాం. మహిళా సంఘాల సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్తుండడంతో కుట్టుట ఆలస్యమైంది. త్వరితగతిన అందించాలని వారిని ఆదేశించాం.

## ఈ 'యాప్'తో సత్వర పరిష్కారం




జనగామ : విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేలా టీఎస్ఎన్‌పీడీసీఎల్ (ఉత్తర తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ) మరో అడుగు ముందుకు వేసింది. పది రకాల సేవలు ఒకే దగ్గర లభించేలా ప్రత్యేకంగా ఎన్‌పీడీసీఎల్ బిల్ డెస్క్ అనే పేరుతో ఓ యాప్‌ను రూపొందించింది. విద్యుత్తు సరఫరాలో హెచ్చు తగ్గులు, ఒరిగిన స్తంభాలు, వీధుల్లో ఇళ్లకు తాకే విద్యుత్తు తీగల తొలగింపు, ప్రమాదకరంగా ఉన్న నియంత్రికలు, విద్యుత్తు సరఫరాలో నెలకొన్న అంతరాయాలు.. ఇలా ఒకటేమిటి సమస్య ఏదైనా ఇంటి వద్దే ఉండి చరవాణితో అధికారుల దృష్టికి తీసుకెళ్లొచ్చు. బిల్లుల చెల్లింపులతో పాటు పది రకాల సేవలు, ఫిర్యాదులు, సలహాలు సూచనలు వినియోగించుకోవచ్చు.

ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలంటే..

చరవాణిలో గూగుల్‌ప్లే స్టోర్‌లోకి వెళ్లి టీఎస్ఎన్‌పీడీసీఎల్ అని టైప్ చేయగానే టీఎస్ఎన్‌పీడీసీఎల్ బిల్‌డెస్క్ అనే అప్షన్ కనిపిస్తుంది. దాన్ని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. యాప్ డౌన్‌లోడ్ అయిన తర్వాత రిపోర్టు ఆన్ ఇన్సిడెంట్, కంప్లెయింట్, సెల్ఫ్‌రీడింగ్, పేబిల్స్, బిల్స్ హిస్టరీ, ఆన్‌లైన్ పేమెంట్స్ హిస్టరీ, లింక్ ఆధార్ అండ్ మొబైల్, టారీఫ్ డిటేల్స్, ఎనర్జీటిప్స్, సేఫ్టీ టిప్స్ అనే పది రకాల ఆప్షన్లు కనిపిస్తాయి. రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ఈ-మెయిల్ ఐడీతో పాటు చరవాణి నంబరును నమోదు చేయాలి. వినియోగదారుడి సర్వీసు నంబరును నమోదు చేసి, సబ్‌మిట్ చేయాలి. యాప్ ద్వారా చేసిన దరఖాస్తులను, ఫిర్యాదులను ఉన్నతాధికారులు సంబంధిత కార్యాలయానికి పంపించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. సమస్య పరిష్కారం అనంతరం వినియోగదారుడి చరవాణి నంబరకు తిరిగి సమాచారం వస్తుంది.

ఫొటో తీసి పంపొచ్చు..

యాప్‌లో వెళ్లక ముందు చరవాణిలో లొకేషన్ అనే ఆప్షన్ ఆన్ చేయాలి. ఆ తర్వాత రిపోర్టు ఆన్ ఇన్సిడెంట్ అనే ఆప్షన్‌ను టచ్ చేస్తే కెమెరా గుర్తు కనిపిస్తోంది. కెమెరా తెరచుకోగానే మనం ఉన్న లొకేషన్ స్మార్ట్ ఫోన్లోని కెమెరాకు అనుసంధానమవుతుంది. ఆ తర్వాత సమస్య కనిపించేలా ఫొటో తీయాలి. అనంతరం పేరు, చరవాణి సంఖ్య నమోదు చేసి సమస్యను వివరించాలి. చిత్రం తీసి వివరాలు నమోదు చేసిన తర్వాత సబ్‌మిట్ చేయాలి. ఈ సమాచారం నేరుగా విద్యుత్తు సంస్థ ఏర్పాటు చేసిన సర్వర్‌లోకి వెళ్తుంది. అందులో జీపీఎస్ కో ఆర్డినేషన్ వ్యవస్థ ఉండడంతో ఎక్కడి నుంచి చిత్రం పంపామో అధికారులకు తెలుస్తుంది. దీంతో వారు వెంటనే స్పందించే అవకాశం ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి

– వెంకటరమణ, విద్యుత్తు ఏఈ, భూపాలపల్లి విద్యుత్తు సంస్థ

ప్రవేశపెట్టిన యాప్‌ను వినియోగదారులంతా సద్వినియోగం చేసుకోవాలి. సమస్యలపై కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేసే అవసరం లేకుండా దీన్ని రూపొందించారు. యాప్ ద్వారా పంపించే ప్రతీ సమస్యకు తక్షణ పరిష్కారం లభిస్తుంది.

## ముగ్గురే వైద్యులు.. ఇక్కట్లు తీరేదెన్నడు..!

కరీంనగర్ : గ్రామీణ ప్రాంతాలకు అందుబాటులో ఉన్న జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో ముగ్గురు వైద్యులే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఓపీ వరకే వైద్య సేవలు అందుతున్నాయి. ఆసుపత్రిలో అసౌకర్యాలపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఇటీవలె వేర్వేరుగా పరిశీలించారు. వైద్యుల నియామకం, సౌకర్యాలు కల్పిస్తామని స్పష్టం చేసినా నేటికీ ఫలితం లేకుండా పోయింది. ఆసుపత్రిని వైద్య విధానపరిషత్‌లోకి చేర్చటంతో ఆసుపత్రిలోని ఐదుగురు వైద్యులు హెల్త్‌డైరెక్టర్ పరిధిలోకి వెళ్లారు. సిబ్బందిని బదిలీ చేశారు. నాటి నుంచి ఆసుపత్రి ఓపీ వైద్యానికే పరిమితమైంది. ఆసుపత్రిని వైద్య విధానపరిషత్‌లోకి మార్చిన తర్వాత మొదట్లో ఇద్దరు వైద్యులే విధులు నిర్వహించారు.

మూడు మాసాల క్రితం హుజూరాబాద్ ప్రాంతీయ ఆసుపత్రి వైద్యుడిని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి డిప్యుటేషన్‌పై పర్యవేక్షకుడిగా నియమించారు. రోజూ 200 మందికి ఓపీ సేవలను ముగ్గురు వైద్యులు అందిస్తున్నారు. నేర సంబంధిత మృతదేహాలకు శవపరీక్షలను నిర్వహిస్తున్నారు. గత ఎనిమిది నెలలుగా గైనకాలజిస్ట్ లేకపోవడంతో ప్రసవాలు చేయటం లేదు. ప్రసవానికి హుజూరాబాద్ ప్రాంతీయ ఆసుపత్రికి పంపిస్తున్నారు. ఆసుపత్రిలో డెంటిస్ట్, ఇద్దరు వైద్యులే సేవలు అందిస్తుండగా ఎనిమిది మాసాల్లో ఇద్దరికి సాధారణ ప్రసవాలు చేశామని ఆసుపత్రి పర్యవేక్షకులు చెప్పారు. గైనకాలజిస్ట్, అనస్తీషియా, పిల్లల వైద్యులు లేక పోవటంతో ప్రసవాలు చేయలేని పరిస్థితి నెలకొంది.

మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి అధికంగా డబ్బులు ఖర్చు చేస్తున్నామని స్థానికులు వాపోతున్నారు.

అన్ని వసతులున్నా...

జమ్మికుంట 30 పడకల ఆసుపత్రి భవనాన్ని రూ.5 కోట్ల వ్యయంతో అన్ని హంగులతో నిర్మించారు. వేర్వేరుగా వార్డులు, ఆపరేషన్ థియేటర్, గదులు నిర్మించారు. ల్యాబ్, అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఈసీజీ తదితర సౌకర్యాలున్నాయి. వైద్యులు లేక పోవటంతో ఫలితం లేకుండా పోయింది. ఇద్దరు స్టాఫ్ నర్సులు విధులు నిర్వహిస్తున్నారు. అత్యవసర వైద్యానికి హుజూరాబాద్ ప్రాంతీయ ఆసుపత్రి, లేదా వరంగల్‌కు పంపిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి అన్ని విభాగాల్లో వైద్యులను నియమించాలని జమ్మికుంట, పరిసర ప్రాంతాల వాసులు కోరుతున్నారు.

## ప్రధాన పంటలపై తెగుళ్ల పంజా..!

కరీంనగర్ : సాగుబడిలో అన్నదాతలకు ఆటుపోట్లు మొదలయ్యాయి. రెక్కలు ముక్కలు చేసుకొని సాగు చేసిన పంటలను తెగుళ్లు కాటేస్తున్నాయి. ఉధృతి పెరుగుతుండగా దిగుబడిపై ఆశలను ఆవిరి చేస్తున్నాయి. ప్రధాన పంటలైన పత్తి, వరిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా పత్తి పంటలో రసం పీల్చే పురుగులు, వరిపంటలో తాటాకు తెగులు, మొగిపురుగు వ్యాపిస్తుండటంతో రైతులు హడలెత్తిపోతున్నారు. అంతకంతకూ తెగుళ్ల విజృంభణ బెంబేలెత్తిస్తోంది. తెగులు అదుపులోకి రాకపోగా మరింత విస్తరిస్తుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పురుగు మందుల పిచికారీకి అధిక వ్యయం చేస్తూ చేతిచమురు వదలించుకుంటున్నారు. క్రిమిసంహారక మందుల కొనుగోళ్లతో సన్న, చిన్నకారు రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారు. మూడు నాలుగు పర్యాయాలు పురుగు మందులు వినియోగించినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు.

పలుచోట్ల ప్రభావం

మెట్ట ప్రాంతమైన జిల్లా 4,72,329 ఎకరాల భౌగోళిక విస్తీర్ణం కలిగి ఉంది. అందులో 2,90,380 ఎకరాల భూమి సాగుకు అనుకూలంగా ఉంది. గత మూడు, నాలుగేళ్లుగా వందశాతం పంటలు సాగవుతున్నాయి. సాగునీరు సమృద్ధిగా లభిస్తుండటంతో వరి, పత్తి పంటల సాగువిస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. ఈ సంవత్సరం వానాకాలంలో జిల్లా వ్యాప్తంగా అదనులో వర్షాలు కురవడం, నీటి వనరులు జలకళ సంతరించుకొని భూగర్భ జలమట్టాలు వృద్ధి చెందడంతో పంటల సాగుకు అనుకూలంగా మారింది. రాజరాజేశ్వర, అన్నపూర్ణ, ఎగువ మానేరు జలాశయాలు నీటితో నిండుకుండలా మారాయి. వంద ఎకరాల ఆయకట్టు పైబడిన నీటి వనరులు 105, వంద ఎకరాలలోపు ఆయకట్టు కలిగినవి 561 ఉండగా దాదాపు 80 శాతానికిపైగా జలకళ సంతరించుకున్నాయి. అనేక చెరువులు అలుగుపారుతున్నాయి. జిల్లాలో సాగునీరు సమృద్ధిగా లభించడంతో వరిసాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ప్రస్తుత వానాకాలం సాగు ప్రణాళికలో అన్ని రకాల పంటల సాగు విస్తీర్ణం మొత్తం 2,08,762 ఎకరాలకు చేరింది. ప్రధానంగా పత్తి 46,262 ఎకరాల్లో, వరి 1,59,796, మొక్కజొన్న 909, కంది 1,348, సోయా 4.05, జొన్న 4.03, అనుములు 5.18, మినుము 3.17, ఆముదం 10.02, బబ్బెర 19.07, పెసర 81.16, వేరుసెనగ 6.18, శనగ 5.2 కొర్రలు 0.19, చెరకు 48.06 ఎకరాల్లో సాగుచేస్తున్నారు. పంటల సాగు ఆశాజనకంగా ఉన్నా ఒక్కసారిగా తెగుళ్లు పంజా విసురుతుండటంతో



రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తిలో రసం పీల్చే తెల్లదోమ, పచ్చదోమ, పేనుబంక పురుగులు పీడిస్తుండగా జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో తెగులు ఉనికి బయటపడుతోంది. వరిపంటను తాటాకు తెగులు కాటేస్తుండటంతో రైతులు కుదేలవుతున్నారు. జిల్లాలో సాగైన వరిపంటలో సుమారు 25శాతం ఈ తాటాకు తెగులు విస్తరించినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లి, బోయినపల్లి, తంగళ్లపల్లి, చందుర్తి తదితర మండలాల్లో పంటలపై తెగుళ్ల తీవ్రత ఎక్కువగా ఉంది. వీటి నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు పాటించడంలో నిమగ్నమయ్యారు. క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్నా కొన్నిచోట్ల తెగుళ్లు అదుపులోకి రాకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఆకుపచ్చగా ఉండాల్సిన పత్తి పంట ఎరుపురంగులోకి మారుతుండగా వరిపైరు తెలుపు రంగును సంతరించుకుంటోంది. తెగుళ్ల నివారణ కోసం రైతులు ఇబ్బడిముబ్బడిగా పురుగు మందులు పిచికారీ చేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. తెగుళ్ల ఉధృతి తగ్గకపోతే దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నివారణ చర్యలు పాటించాలి – భూమిరెడ్డి, వ్యవసాయాధికారి, ఎల్లారెడ్డిపేట

పత్తిలో రసం పీల్చే పురుగుల నివారణకు ఇమిడాక్లోప్రిడ్ ఒక మిల్లీలీటర్ల మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును లీటరు నీటికి కలిపి, పత్తిమొక్కల మొదళ్లలో జల్లాలి. వరిలో తాటాకు తెగులు నివారణకు ప్రొఫినోపాస్ 2 మిల్లీలీటర్ల మందును లీటరు నీటికి కలిపి, పంటకు పిచికారీ చేయాలి. మొగిపురుగు నివారణకు 3జీ గుళికలు అయితే ఎకరానికి 10 కిలోలు, 4జీ(కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్) గుళికలు అయితే ఎకరానికి 8 కిలోలు, క్లోరాంత్రనిలిప్రోల్ 4 కిలోలు ఎకరానికి చల్లాలి. ఒకే విధమైన పంటను ప్రతిసారి వేయడం వల్ల తెగుళ్లు సోకుతాయి. పంట మార్పిడి విధానం పాటిస్తే మేలు.

పత్తి రైతు చిత్తు

జిల్లాలో పత్తి పంటకు రసంపీల్చే పురుగులు ఆశిస్తుండటంతో అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు. వందలాది ఎకరాల్లో పత్తి పంట తెగులు బారిన పడుతోంది. వాతావరణంలో వస్తున్న మార్పులు పత్తిపంటలో రసంపీల్చే పురుగు వ్యాప్తికి అనుకూలంగా మారుతోంది. లేత ఆకులకింద చేరుతున్న పురుగులు రసం పీల్చుతుండటంతో ఆకులు డొప్పలా మారి కిందిభాగానికి ముడుచుకొని క్రమంగా ఎర్రబారుతున్నాయి. దీంతో మొక్కలో ఎదుగుదల బాగా తగ్గిపోతోంది.

వరిలో పచ్చదనం హరీ

తాటాకు తెగులు సోకిన ప్రాంతాల్లో పురుగు వరిపైరు పచ్చదనాన్ని హరిస్తోంది. పత్రహరితాన్ని తినేయడం వల్ల ఆకులు సున్నంచారల మాదిరిగా మారిపోతున్నాయి. దూరం నుంచి చూస్తే పైరు తెల్లగా కనిపిస్తోంది. మొగిపురుగు ఉధృతి సైతం పెరుగుతోంది. తాటాకు తెగులు, మొగిపురుగు ప్రభావం తీవ్రంగా ఉన్నట్లు ఆయా ప్రాంతాలకు చెందిన రైతులు చెబుతున్నారు.

# ఇరుకుగా.. ఆపై ప్రమాదకరంగా..

హుజూరాబాద్ : కరీంనగర్– వరంగల్ జాతీయ రహదారి వెంట ప్రయాణం చేస్తున్న వాహనదారులు చాలా అప్రమత్తంగా ప్రయాణం చేయాల్సిన అవసరం తలెత్తింది. రహదారిపై ఇష్టారీతిన వెళితే ఇబ్బందులను కొని తెచ్చుకున్నవారవుతారు. కరీంనగర్ జిల్లా పరిధిలోని ఈదులగట్టెపల్లి, గట్టుదుద్దెనపల్లి, తుమ్మనపల్లి, హుజూరాబాద్ పట్టణ సమీపంలోని కొత్తపల్లి– ఇందిరానగర్ కాలనీ, కేసీక్యాంపు, హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని అనంతసాగర్, చింతగట్టు క్యాంపు తదితర ప్రాంతాల్లో ఎస్సారెస్పీ కాలువలపై వంతెనలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెనలు కావడంతో వాటి రెయిలింగ్‌లు సైతం దెబ్బతిన్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు.

అత్యంత రద్దీ రహదారిపై నిర్లక్ష్యమేలా?

కరీంనగర్ నుంచి హనుమకొండ జిల్లా వరకు సుమారు 70 కి.మీ.ల పొడవునా ఉన్న జాతీయ రహదారిలో ఏడు ప్రాంతాల్లో వంతెనలున్నాయి. ఏ ఒక్క వంతెనకు రెయిలింగ్‌లు రెండువైపులా సక్రమంగా లేవు. మూడు, నాలుగు దశాబ్దాలుగా వంతెనలు శిథిలావస్థలో ఉన్నా



వాటివైపు ఎవరూ చూడరు. నిత్యం వేలాదిగా చిన్న, పెద్ద, భారీ అంతకంటే అతిపెద్ద వాహనాలు కరీంనగర్– వరంగల్ జాతీయ ప్రధాన రహదారి వెంట ఇవే వంతెనలపై ప్రయాణం చేస్తుంటాయి. ఆయా వంతెనలపై పదేళ్లలో వందల సంఖ్యలో ప్రమాదాలు జరిగాయి. అయినప్పటికీ వాటికి కనీస మరమ్మతు చర్యలు చేపట్టడం లేదు. కనీస జాగ్రత్తల కోసం రహదారులు, భవనాలశాఖ అధికారులు ఆయా ప్రాంతాల్లో ఇరుకు వంతెనలున్నాయని తెలిపే బోర్డులను ఏర్పాటు చేయలేదు. సదరు వంతెనలపై రెయిలింగ్‌లు ఇప్పటికే సగానికిపైగా ప్రమాదాలతో ధ్వంసమై శిథిలావస్థకు చేరినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయని దుస్థితిలో సంబంధిత శాఖాధికారులున్నారు.

మచ్చుకు కొన్ని ప్రమాదాలు

హసన్‌పర్తి సమీపంలోని చింతగట్టు క్యాంపు వంతెనపై కొన్నేళ్ల క్రితం లారీ ఆటోను ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు మృతిచెందారు. ఆ వంతెనపై రాకపోకలకు కొన్ని గంటల పాటు తిప్పలుపడ్డారు.

హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్, ఫైర్ స్టేషన్ సమీపంలో మరో ఎస్సారెస్పీ వంతెన ఉండగా ఓ ద్విచక్రవాహనదారుడు తన వెనకవైపు కూర్చున్న వ్యక్తి కెనాల్‌లో వేగంగా పడిపోయి మృతిచెందారు. స్థానికుల్లో భయాందోళన తలెత్తింది. కొన్నేళ్ల క్రితం ఈదులగట్టెపల్లి వంతెనపై లారీలు ఢీకొట్టుకుని వంతెనపై నిలవగా రెండ్రోజుల పాటు ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. భారీ గ్రానైట్ లోడ్‌తో వస్తున్న లారీ అదుపుతప్పి పెద్ద బండరాయి అందులోనే పడింది. ఇప్పటికీ దాన్ని బయటికి తీసే ప్రయత్నాలు చేయలేదు.

ఇలా ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నా, ప్రయాణికులు, స్థానికులకు ప్రమాదాలు పొంచి ఉన్నాయని తెలిసినా పట్టించుకునే అధికారులు, ప్రజాప్రతినిధులు కరవయ్యారు. ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్న ప్రాంతాలను గుర్తించి కనిపించేలా గుర్తింపు బోర్డులు, చిహ్నాలు ఏర్పాటుచేస్తే బాగుంటుందని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

# సా..గుతున్న సమీకృత మార్కెట్ల పనులు

కరీంనగర్ : జనాభా పెరిగిపోతుండటంతో మార్కెట్ల అవసరాలు పెరిగాయి. దీంతో ప్రభుత్వం సమీకృత మార్కెట్లు నిర్మించాలని నిర్ణయించింది. కరీంనగర్ నగర పాలక సంస్థతోపాటు నాలుగు పురపాలికల పరిధిలో వాటి నిర్మాణాలు మొదలుపెట్టింది. కొన్ని చోట్ల త్వరగా, మరికొన్ని చోట్ల నత్తనడకన పనులు సాగుతున్నాయి.

ఒకే చోట అమ్మకాలుకొత్తగా నిర్మిస్తున్న సమీకృత మార్కెట్లలో కూరగాయలు, పండ్లు, పూలు, మాంసం ఒకే చోట లభించేలా నిర్మాణాలు ప్రారంభించారు. ప్రత్యేకంగా స్టాళ్లు, లోడింగ్, ఆన్‌లోడింగ్ ప్లాట్‌ఫాంలు, రెండు వేర్వేరుగా మరుగుదొడ్లు, విద్యుద్ధీకరణ, పచ్చదనం, కార్యాలయం, చుట్టూ ప్రహరీ వంటి పనులు చేసేలా డిజైన్లు తయారు చేశారు.

కరీంనగర్‌లో నాలుగు చోట్ల..పద్మనగర్‌లోని బుల్‌సెమన్ సెంటర్‌లో 2.08 ఎకరాల స్థలంలో మార్కెట్ పనులు చేస్తుండగా మొత్తం 239 దుకాణాలు నిర్మిస్తున్నారు. వచ్చే నెలాఖరులోగా పూర్తి చేసేలా లోపలి భాగంలో పనులు చేపడుతున్నారు. కిసాన్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌లో 1.88 ఎకరాల స్థలంలో 146 దుకాణాలు నిర్మిస్తున్నారు. జీ౦1 శ్లాబు వేశారు. దుకాణాల వారీగా గదులు నిర్మించారు. టైల్స్ వేస్తున్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఎదురుగా 2.31 ఎకరాల స్థలం ఉండగా ఇందులో 347 దుకాణాలు అందుబాటులోకి రానున్నాయి. శ్లాబు వేయగా పూర్తి కావడానికి మరో ఆరు నెలల సమయం పట్టనుంది. కశ్మీర్‌గడ్డలో 0.08 ఎకరాల రైతుబజారు స్థలంలోనే నిర్మించేందుకు గత నెల 21న పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. పార్కింగ్, కూరగాయల వ్యాపారులు కూర్చోవడానికి అనువైన స్థలం కేటాయిస్తారు. దీనిని తొమ్మిది నెలల్లో పూర్తి చేయాలని నిర్ణయించారు.

పూర్తి కాని పనులుహుజూరాబాద్‌లో గతేడాది మే నెలలో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభించారు. డిసెంబరులోగా పూర్తి చేయాల్సి ఉండగా, మళ్లీ మూడు నెలలు పొడిగించారు. 80 శాతం మేర పనులు పూర్తి కాగా మిగతావి చేసేందుకు గుత్తేదారు వెనుకడుగు వేస్తున్నారు. నిధులకు ఇబ్బంది ఉండటంతో రూ.2 కోట్లకు ప్రతిపాదనలు పంపించారు. ఎప్పటిలోగా ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తారో తెలియని గందరగోళం నెలకొంది. చొప్పదండి పురపాలికలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు 80 శాతం మేర పూర్తయ్యాయి. ఏడాది కిందట రాష్ట్ర పురపాలక మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. దుకాణాల నిర్మాణాలు పూర్తయ్యాయి. సులభ్ కాంప్లెక్స్, తాగునీటి ట్యాంకు, కరెంటు వంటి సౌకర్యాలు కల్పించాల్సి ఉంది.

నిధుల కొరతజమ్మికుంటలో రెండేళ్ల కిందట సమీకృత మార్కెట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఇప్పటివరకు 60 శాతం మేర పనులు పూర్తి చేయగా మిగతా 40 శాతం పనులకు నిధుల కొరత ఏర్పడింది. మరో రూ.2 కోట్లు కేటాయించాలని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. నిధులు కేటాయిస్తే తప్ప పనులు ముందుకు సాగేలా కనిపించడం లేదు.

ఏళ్ల తరబడి..జిల్లావ్యాప్తంగా నగర, పురపాలికల్లో ఎక్కడ కూడా పనులు పూర్తి కాలేదు. ఏళ్ల తరబడి కొనసాగుతుండటంతో అవి ఎప్పటిలోగా అందుబాటులోకి వస్తాయో తెలియని గందరగోళం నెలకొంది. కరీంనగర్ నగరపాలికలో వచ్చే నెలాఖరులోగా పద్మనగర్‌లో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ ప్రజలకు అందుబాటులో ఉండేలా కొనసాగుతున్నాయి. మిగతా ప్రాంతాల్లో ఆగుతూ, సాగుతూ అన్నట్లుగా మారింది.

# ఏళ్ల కల.. నిజమయ్యే వేళ!



వరంగల్ : హనుమకొండ జిల్లా కాజీపేట మండలం అయోధ్యపురంలో 160 ఎకరాల్లో కేంద్ర ప్రభుత్వం నిర్మించనున్న వ్యాగన్ పరిశ్రమ, పిరియాడికల్ ఓవర్‌హాలింగ్ షెడ్‌పై ప్రజల్లో ఆనందం వెల్లి విరుస్తోంది.. ఈనెల 8న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా వీటికి శంకు స్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో వీటి వల్ల కలిగే ప్రయోజనం, పనితనం గురించి ప్రత్యేక కథనం.

గత పదేళ్లుగా వ్యాగన్ పరిశ్రమ కోసం చర్చ జరుగుతోంది. 2010లో అప్పటి ప్రభుత్వం ముందుగా వ్యాగన్ రిపేర్ వర్క్‌షాపును సికింద్రాబాద్‌కు మంజూరు చేసింది. అనేక మార్పుల తర్వాత కాజీపేటకు మార్చారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వాలనే డిమాండ్ రావడంతో కేంద్రం పునరాలోచించి.. వ్యాగన్ రిపేర్ వర్క్‌షాపుతో పాటు, వ్యాగన్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వీటి నిర్మాణం కోసం ముందస్తుగా రూ.361.79 కోట్లను మంజూరు చేసింది. పవర్‌మెట్, టెకియా కంపెనీలు సివిల్ పనులు చేస్తున్నాయి. షెడ్ నిర్మాణం, పట్టాల నిర్మాణం జరగడానికి రెండేళ్లు పడుతుంది. ఈ పనుల తర్వాత యంత్రాల అమరిక, వ్యాగన్‌ల మరమ్మతు, తయారీ ప్రారంభమవుతుంది. ఒక్కో వ్యాగన్ తయారీకి సుమారు 9 నుంచి 10 రోజులు పడుతుంది.

దేశంలో ఎక్కడెక్కడ ఉన్నాయంటే..

దేశంలో బీడబ్ల్యూఈఎల్ (బిల్వారా), టాటాఘర్ (కోల్‌కతా)లో అతిపెద్ద వ్యాగన్ పరిశ్రమలు ఉన్నాయి. ఇంకా గజియాబాద్, భరత్‌పూర్, నోయిడా, హుగ్లీ, కొత్త దిల్లీ, జంషెడ్‌పూర్, నాసిక్, చండీగఢ్‌లో ఏర్పాటు చేశారు. మొదటిసారిగా తెలుగు రాష్ట్రాల్లో వ్యాగన్ పరిశ్రమ కాజీపేటలో నిర్మాణమవుతోంది.

ఏడాదికోసారి సర్వీసింగ్

పిరియాడికల్ ఓవరాహాలింగ్ షెడ్‌ను ఇక్కడే ఏర్పాటు చేస్తున్నారు. ఇది పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగితే వేల మంది కార్మికులు వస్తారని రైల్వే అధికారులు చెబుతున్నారు. ఈ షెడ్‌లో రైలు ఇంజన్‌లను సంవత్సరానికి ఒకసారి సర్వీసింగ్ చేస్తారు. ద్విచక్రవాహనాలకు మనం ఇంజనాయిల్ మార్చినట్టు రైళ్ల సర్వీసింగ్ చేస్తారు. రైళ్ల వేగం, సామర్థ్యం, బ్రేకులు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తారు. వీటికిగాను నిష్ణాతులైన ఇంజినీర్లను నియమిస్తారు. 'ప్రస్తుతం కాజీపేటలోని విద్యుత్తు లోకోషెడ్, డీజిల్ లోకోషెడ్‌లో 3000 మంది రైల్వే కార్మికులు పనిచేస్తున్నారు. కొత్తగా రానున్న వ్యాగన్, పీఓహెచ్‌లతో మరో 5 వేల మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.

ఇదీ తేడా

కోచ్ ఫ్యాక్టరీ అంటే ప్రయాణికులు వెళ్లే రైలు డబ్బాలు, వ్యాగన్‌లు అంటే సామగ్రి మోసే గూడ్సు డబ్బాలు. కోచ్‌కు, వ్యాగన్‌కు ఉన్న తేడా ఇది. దేశంలో వ్యాగన్లకు గిరాకీ బాగా ఉండడంతో కాజీపేటకు కేంద్రం వ్యాగన్ల పరిశ్రమ మంజూరు చేసింది.

దశాబ్దకాలంగా పోరాడాం

రైల్వే ఐకాస కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్

పరిశ్రమలో స్థానికంగా ఉన్న బడుగు బలహీన వర్గాలకు ఉద్యోగావకాశాలు కల్పించాలి. దశాబ్దకాలంగా పీఓహెచ్ కోసం పోరాటాలు చేస్తున్నాం. పరిశ్రమలు పూర్తి స్థాయిలో నిర్మాణం జరిగితే 10 వేల మందికి ఉపాధి లభించే అవకాశం ఉంది.

సంతోషంగా ఉంది : కాలువ శ్రీనివాసు, మజ్దూర్‌యూనియన్ జోనల్ అధ్యక్షుడు

ఆలస్యమైనా వ్యాగన్ పరిశ్రమ నిర్మాణం ప్రారంభం కావడం సంతోషంగా ఉంది. దీనికి కేటాయించిన స్థలంలో మరిన్ని యూనిట్లు తీసుకురావడానికి అవకాశం ఉంది. ఈ పరిశ్రమతో ఓరుగల్లుకు ప్రత్యేక గుర్తింపు వస్తుంది.


ఒక్కోచోట ఒక్కో పరిశ్రమ

భారతీయ రైల్వే వ్యవస్థ చాలా పెద్దది. 11 లక్షలకుపైగా ఉద్యోగులు పనిచేస్తారు. ప్రపంచ వ్యాప్తంగా నాలుగో అతిపెద్ద రైల్వేనెట్ వర్క్ మనదే. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా రైలింజిన్‌లు, కోచ్‌లు, బోగీలు, విడిభాగాలు తయారుచేసేందుకు అనేక పరిశ్రమలు ఉన్నాయి. ఇటీవల ప్రయివేటు పరిశ్రమలు కూడా పెరిగాయి.

తయారీ ఇలా..

ముందుగా బేస్‌మెంట్ నిర్మాణం చేస్తారు. తర్వాత రేకులను మలిచి వ్యాగన్ రూపం తీసుకొస్తారు. ఆ తర్వాత చక్రాలు, బ్రేకులను అమరుస్తారు. ఈ పనులకు ఐదు రకాల ప్లాటుఫారాలను ఏర్పాటు చేయనున్నారు. వ్యాగన్ పూర్తిగా తయారైన తర్వాత ట్రయల్ రన్ చేయడానికి ప్రత్యేకమైన రైల్వే ట్రాక్‌ను నిర్మిస్తారు. పరిసరాలు కాలుష్యం కాకుండా పచ్చని చెట్లను పెంచుతారు. వ్యాగన్‌ల మరమ్మతులు ఇక్కడే జరుగుతాయి. బొగ్గు, భారీ వస్తువులు, గ్రానైట్ రాళ్ల రవాణా వల్ల వ్యాగన్లు దెబ్బతింటాయి. వాటిని బాగు చేస్తారు. చక్రాల బిగింపు, కొత్త బ్రేకులు వేయడం లాంటివీ చేస్తారు.

# మురుగు మయం.. రోగాల భయం



వరంగల్ : 'నగరంలో డెంగీ, మలేరియా కేసులు మొదలయ్యాయి. కాలనీల్లో మురుగు, చెత్త పేరుకుపోవడంతో దోమల మోత ఎక్కువైంది. ఖాళీ స్థలాలు మురుగు కుంటలుగా మారాయి. దీంతో దోమలు పెరిగి, విష జ్వరాలు ప్రబలుతున్నాయి. గ్రేటర్ వరంగల్ పరిధిలో ఇప్పటికే 16 డెంగీ, 3 మలేరియా కేసులు నమోదయ్యాయి. అధికారుల దృష్టికి రానివి ఎన్నో. కాలనీల్లో పారిశుద్ధ్యం పనులు సరిగా నిర్వహించక పోవడం, అంతర్గత మురుగు కాల్వలు శుభ్రం చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. వరంగల్ మహా నగరపాలక సంస్థ ప్రజారోగ్యం, పట్టణ మలేరియా విభాగాలు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది. పారిశుద్ధ్య పనులు, దోమల నివారణ చర్యలు ముమ్మరం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

5 వేల ఖాళీ స్థలాలు

నగరంలోని 66 డివిజన్ల పరిధిలో సుమారు 5 వేలకుపైగా ప్రైవేటు ఖాళీ స్థలాలు ఉంటాయని ప్రజారోగ్య విభాగం ఉద్యోగుల పరిశీలనలో తేలింది. కాలనీల్లో ఇళ్ల మధ్య సంవత్సరాల తరబడి ఖాళీ స్థలాలుండటంతో చెత్త చెదారం పడేస్తున్నారు. వర్షపు నీరు సైతం చేరి మురుగు కుంటలుగా మారుతున్నాయి. వాటిలో దోమలు పెరుగుతున్నాయి.

ఇదీ నిబంధన : ఖాళీ స్థలంలో కంపచెట్లు పెరగకుండా, చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా ఉంచాలని సంబంధిత యజమానికి నోటీసు ఇవ్వాలి. వారం రోజుల్లో స్థలం చదును చేసి, శుభ్రం చేసుకోకుంటే గ్రేటర్ వరంగల్ ఆధ్వర్యంలో స్థలాన్ని శుభ్రం చేసి యజమాని నుంచి జరిమానా వసూలు చేయాలి.

అప్రమత్తంగా ఉన్నాం..: మాధవరెడ్డి, బయాలజిస్టు, గ్రేటర్ వరంగల్ వర్షాకాలంలో దోమలు పుట్టుకొస్తాయి. కాలనీల్లోని ఖాళీ స్థలాలతో సమస్య ఎక్కువగా ఉంది. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, దోమలు వ్యాప్తి పెరగకుండా ఉండేందుకు అప్రమత్తంగా ఉంటూ తగిన చర్యలు ముమ్మరం చేశాం. నగరంలోని 66 డివిజన్లలో ఉదయం వేళల్లో గ్యాంగ్ వర్కులు, సాయంత్రం ఫాగింగ్ చేసేందుకు షెడ్యూల్ రూపొందించాం. ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్, రసాయనాలు సిద్ధంగా ఉన్నాయి.

మురుగు కాల్వలు సరిగా లేవు..రంగరాజు విజయ, ఓఎస్‌నగర్

పాపయ్యపేట డివిజన్ ఓఎస్‌నగర్‌లో అంతర్గత మురుగు కాల్వలు సరిగా లేవు. రోడ్లపై, ఖాళీ స్థలాల్లో మురుగు నిలుస్తోంది. దోమల బెడద ఎక్కువగా ఉంది. పారిశుద్ధ్య పనులు అంతంత మాత్రంగానే చేపడుతున్నారు. ఇక్కడ ఎక్కువగా పేదలే నివాసం ఉంటున్నారు. అపరిశుభ్రత, దోమల కారణంగా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. వెంటనే దోమల నివారణ చర్యలు చేపట్టాలి.

దోమలు ఎక్కువయ్యాయి..నల్లరేణుక, పాపయ్యపేట

మేము పాపయ్యపేట డివిజన్‌లో ఉంటున్నాం. కుంటి భద్రయ్య గుడి నుంచి రామన్నపేట పెద్దమోరీ వరకు రోడ్డుపై మురుగు నిలిచింది. నెల రోజులుగా దోమలు ఎక్కువయ్యాయి. పారిశుద్ధ్యం గురించి పట్టించుకోవడం లేదు. వెంటనే మురుగు తొలగించాలి.

19వ డివిజన్ ఎనుమాముల శివారు సాయిగణేష్ కాలనీలో సుమారు 150 వరకు ఇళ్లు ఉన్నాయి. ఇక్కడ దోమల సమస్య ఎక్కువగా ఉంది. ప్రైవేటు ఖాళీ స్థలాల్లో వర్షంనీరు, చెత్తాచెదారం చేరి మురుగు కుంటలుగా మారాయి. అంతర్గత డ్రైనేజీల్లేక రోడ్లపైనే మురుగు పారుతోంది.

డ్రైనేజీ కాల్వలు అస్తవ్యస్తం..

వరంగల్ నగరం తరువాత జిల్లాలో పెద్ద పట్టణమైన నర్సంపేటలో డ్రైనేజీ కాల్వల పరిస్థితి అధ్వానంగా ఉంది. మేజర్ పంచాయతీ నుంచి పురపాలికగా ఏర్పడి 12 ఏళ్లైనా ప్రగతి అంతంత మాత్రంగా ఉంది. కాలువలు సరిగా లేక రోడ్లపై పారుతున్న మురుగుతో జనం ఇబ్బందులు పడుతున్నారు. నివాసాల మధ్య ఖాళీ స్థలాలు మురుగు కుంటలుగా మారాయి.

# ఫలితాల్లో ఆదర్శం

హుజూరాబాద్ :పదేళ్లుగా ఉత్తమ ఫలితాలతో పాటు విద్యార్థులు అధికంగా బాసర ట్రిపుల్ ఐటీ సీట్లు దక్కించుకొని తోటి పాఠశాలలకే ఆదర్శంగా నిలుస్తోంది కేశవపట్నం ఆదర్శ పాఠశాల. 2013–14లో ఆరంభమైన ఇది ఏటా పదోతరగతి ఫలితాలలో కచ్చితంగా పదికి పది పాయింట్లు సాధిస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా ఒక విద్యా సంవత్సరంలో 22 మంది విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఎనిమిదేళ్లలో పాఠశాలకు చెందిన 52 మంది విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందారు. ఇంటర్మీడియట్‌కు సంబంధించిన తొమ్మిది బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు వివిధ రంగాలలో ప్రతిభ చాటుతున్నారు. ఆర్మీ, డాక్టర్, సాఫ్ట్‌వేర్ ఇంజినీరు, న్యాయవాది రంగాలలో సత్తా చాటుతున్నారు. 2015–16 విద్యా సంవత్సరంలో 80 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా నూరుశాతం ఫలితాలు సాధించారు. ఒక్క విద్యార్థి 10జీపీఏ సాధించారు. నలుగురు ట్రిపుల్ ఐటీ సీట్లు పొందారు. 2016–17లో 98.8శాతం ఉత్తీర్ణతతో ఇద్దరు విద్యార్థులు 10జీపీఏ సాధించగా ఎనిమిది మందికి ట్రిపుల్ ఐటీ సీట్లు వచ్చాయి. 2017–18లో 97.8 శాతం ఫలితాలతో ఒక విద్యార్థి పదికి పది పాయింట్లు పొందగా అయిదుగురు ట్రిపుల్ ఐటీ సీట్లకు ఎంపికయ్యారు. 2018–19లో వందశాతం ఫలితాలు సాధించగా ఒక విద్యార్థికి పది జీపీఏ పొందగా నలుగురికి బాసర ట్రిపుల్ ఐటీ సీట్లు దక్కాయి. 2019–20లో నూరు శాతం ఫలితాలతో 21 మందికి పదికి పది పాయింట్లు సాధించారు. 2020–21లో పదో తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించారు.



51 మంది విద్యార్థులు 10జీపీఏ పొందారు. 2021–22లో వందశాతం ఫలితాలు పొందగా అయిదుగురికి 10జీపీఏ సాధించగా 21 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీ సీట్లకు ఎంపికయ్యారు. 2022–23 విద్యా సంవత్సరంలో 98శాతం ఉత్తీర్ణత సాధించగా ఆరుగురు విద్యార్థులు పదికి పది పాయింట్లు పొందగా పదిమంది విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందారు.

కార్పొరేట్ స్థాయిలో ప్రణాళికలు

– చిట్టా జ్యోతి, ప్రిన్సిపల్

కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలో బోధించే ప్రణాళికలు, విధానాలను పాఠశాలలో అమలు చేస్తూ మంచి ఫలితాలతో పాటు విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తుకు బాటలు చూపుతున్నాం. అటల్ టింకరింగ్, డిజిటల్ బోధన, సాహిత్య, సాంస్కృతిక, ఆటల పోటీలు నిర్వహిస్తున్నాం.

# దుకాణానికి రూ.1.25 లక్షలు!

హుజూరాబాద్ : హుజూరాబాద్ పురపాలికలోని పాలకవర్గ సభ్యుల్లో కొందరు వసూళ్లకు తెరలేపారు.. షాపింగ్ కాంప్లెక్స్‌లలోని దుకాణాలకు యాజమాన్య హక్కు కల్పిస్తామని ఒక్కొక్కరి వద్ద రూ.1.25 లక్షలు డిమాండ్ చేశారు.. నాలుగు రోజుల కిందట దుకాణదారులతో చర్చలు జరిపి తామడిగిన డబ్బులు ఇచ్చిన వారికే హక్కు పత్రం ఇస్తామని, లేదంటే ఇచ్చేది లేదని తేల్చి చెప్పినట్లు సమాచారం.

హుజూరాబాద్ పురపాలిక కార్యాలయం పక్కన, సైదాపూర్ రోడ్‌లో పురపాలిక ఆధ్వర్యంలో మూడు షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మించారు. మొత్తం 204 షాపింగ్ గదులను నిర్మించి 2016–17లో వ్యాపారులకు కేటాయించారు. నిర్మాణ సమయంలో ఒక్కో దుకాణానికి రూ.1.50 లక్షలు చెల్లించారు. వీటిలో కొందరు దుకాణాలు ఏర్పాటు చేసుకోగా మరికొందరు వేరేవారికి అద్దెకు ఇచ్చారు. ఇంకొందరు ఇతరులకు అమ్ముకున్నట్లు తెలిసింది. కాగా దుకాణాలు పొందిన వారితో ఎలాంటి ఒప్పంద పత్రం లేకపోవడంతో ఆరేళ్లుగా ఆస్తి పన్ను చెల్లించలేదు. దీంతో పురపాలిక రూ.లక్షల ఆదాయం కోల్పోవాల్సి వచ్చింది. రెండు నెలల క్రితం మున్సిపల్ కౌన్సిల్‌లో చర్చించి అవసరమైన చర్యలు చేపట్టి దుకాణదారుల వద్ద ఆస్తిపన్ను వసూలు చేసేలా తీర్మానించారు. దీన్ని ఆసరాగా తీసుకుని కొంతమంది కౌన్సిల్ సభ్యులు వసూళ్లపై దృష్టి పెట్టారు. నాలుగు రోజుల క్రితం సైదాపూర్ రోడ్‌లోని షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించిన దుకాణదారులతో చర్చలు జరిపారు. ఒక్కో దుకాణానికి రూ.1.25 లక్షలు ఇస్తే యాజమాన్య హక్కు కల్పిస్తామని పేర్కొన్నారు. అయితే కాంప్లెక్స్ నిర్మాణ సమయంలోనే డబ్బులు చెల్లించామని, ఇపుడు మళ్లీ డబ్బు ఇవ్వడం తమవల్ల కాదని దుకాణదారులు స్పష్టం చేసినట్లు తెలిసింది. తామడిగిన సొమ్ము ఇచ్చిన వారికే గదులపై హక్కు వస్తుందని, లేకుంటే ఇచ్చేది లేదని తేల్చిచెప్పడంతో దుకాణదారులు అయోమయంలో పడినట్లు సమాచారం. ఈ



వ్యవహారం ప్రస్తుతం చర్చల దశలోనే ఉండగా ఇప్పటివరకైతే ఎవరూ డబ్బులు ముట్టజెప్పనట్లు తెలిసింది. కాగా పురపాలిక నిబంధనల ప్రకారం యాజమాన్య హక్కు కల్పించడం సాధ్యం కాదని కొందరు వ్యాపారులు పేర్కొంటున్నారు. ఈ విషయమై మున్సిపల్ ఛైర్‌పర్సన్ గందె రాధికను వివరణ కోరగా దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారి వద్ద ఆస్తి పన్ను వసూలు చేసేలా నిర్ణయించామన్నారు. దుకాణాలు ఎవరికి కేటాయించారు.. ఎవరెవరు దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారనే వివరాలు లేవన్నారు. ప్రస్తుతం దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారికి ఇవ్వడంతోపాటు అద్దెకిచ్చిన గదులు, అమ్మిన గదులపై కౌన్సిల్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. డబ్బులకు డిమాండ్ విషయం తన దృష్టికి రాలేదన్నారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యతో మాట్లాడగా దుకాణాల విషయంలో ఎలాంటి హక్కు కల్పించడం అనే విషయం ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పారు.

# పెంపుడు జంతువులతో తస్మాత్ జాగ్రత్త

ఖమ్మం : ఏటా జులై 6న ప్రపంచ జూనోసిస్ దినోత్సవం నిర్వహిస్తారు. పెంపుడు జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే (జూనోటిక్) వ్యాధులనిర్మూలనపై అవగాహన కల్పించటం దీని ముఖ్య ఉద్దేశం.గ్రామాల్లోకి అడవి జంతువులు...

జంతువులు రకరకాల ఆహార ఉత్పత్తులతో పాటు ప్రజలకు ఆత్మీయ నేస్తాలు. ప్రకృతి, మనుషులు, జంతువుల మధ్య విడదీయరాని సంబంధం ఉంది. జనాభా విపరీతంగా పెరుగుతోంది. మరో వైపు అటవీ భూములను వ్యవసాయ క్షేత్రాలుగా చేసి సేద్యం చేయటం వల్ల అడవుల్లోని జంతువులు, పక్షులు జనారణ్యంలోకి వస్తున్నాయి. జంతువుల ద్వారా 70 శాతం రోగాలు మనుషులకు సంక్రమిస్తున్నాయి. ప్రజారోగ్య, పర్యావరణశాఖ, పశుసంవర్ధక శాఖలు సంయుక్తంగా పని చేయడం వల్ల పశువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులను చాలా వరకు అరికట్టవచ్చు.

సంక్రమించే వ్యాధులు...

పిచ్చికుక్క కాటు ద్వారా రేబిస్, పందులపై ఉండే దోమల కాటు వల్ల మెదడువాపు వ్యాధి, బ్యాక్టీరియా ద్వారా బ్రూసెల్లోసిస్, సాల్మోనెల్లోసిస్, క్షయ, దొమ్మ వంటి వ్యాధులు, ఎలుకలపై ఉండే కీటకాల ద్వారా లెప్టోస్పైరోసిస్, పరాన్న జీవుల ద్వారా అంకైలోస్టామియాసిస్, హైడారిటీయోసిస్, గజ్జి, అమీబియాసిస్, పందుల ద్వారా గాలికుంటు వ్యాధి సంక్రమిస్తుంది. కోళ్లు, పక్షుల ద్వారా ఇన్‌ఫ్లూయిజా, క్లమీడియోసిస్, లిస్టీరియోసిస్, సాల్మెనెల్లోసిస్, క్షయ, తామర, సిట్టకోసిస్ లాంటి వ్యాధులు మనుషులకు సోకుతాయి.

సన్నిహితంగా ఉండేవారికి ముప్పు




జూనోటిక్ వ్యాధులు పశువులు, జంతువులతో సన్నిహితంగా ఉండే వారికి త్వరగా సోకుతాయి. కుక్కలతో సన్నిహితంగా ఉండే వారికి రేబిస్, హైడ్రాటియోసిస్, కొమ్ములు, చర్మం, ఎముకలతో సంబంధం ఉండే పరిశ్రమల్లో పనిచేసే వారికి, కటిక పని చేసేవారికి దొమ్మ వ్యాధి, డెయిరీ ఫారాల్లో పని చేసే వారికి, పశువైద్యులకు బ్రూసెల్లోసిస్, కోళ్ల ఫారాల్లో పనిచేసే వారికి సిట్టకోసిస్, ధాన్యం గిడ్డంగుల్లో పనిచేసే వారికి లెఫ్టోస్పైరోసిస్, కలుషితమైన పాలు తాగే వారికి క్షయ వ్యాధి వ్యాపించే ప్రమాదం ఉంది. సుమారు 200కు పైగా జూనోటిక్ వ్యాధులు ఉన్నప్పటికీ ప్రాణాంతమైనవి కావు. రేబిస్, ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్ మాత్రం ప్రమాదకరమైనవే.జూనోటిక్ వ్యాధులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి. తగిన జాగ్రత్తలు తీసుకోకుండా అతి ప్రేమకు పోతే ప్రాణాంతక వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉంది. చట్ట ప్రకారం ప్రతి ఒక్కరు జీవులపై కరుణ కలిగి ఉండాలి. జీవహింస నివారణ(శునకాల జనన నియంత్రణ) చట్టం 2023 అనుసరించి వీధి శునకాలను చంపడం, హింసించటం నేరం.బి.వేణుమనోహర్‌రావు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి, ఖమ్మం

# మిల్లుల్లో గుట్టలుగా ధాన్యం

ఖమ్మం : జిల్లావ్యాప్తంగా రైస్ మిల్లుల్లో ధాన్యం గుట్టలుగా పేరుకుపోయాయి. గత ఖరీఫ్, రబీ సీజన్లలో పౌర సరఫరాల శాఖ రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించింది. మిల్లర్లు ధాన్యాన్ని మర పట్టి బియ్యంగా మార్చి ఎఫ్‌సీఐ గోదాములకు అప్పగించాల్సి ఉంది. సీఎంఆర్ (కస్టం మిల్లింగ్ రైస్) బియ్యం తీసుకునేందుకు తమ గోదాముల్లో ఖాళీ లేదని ఎఫ్‌సీఐ అధికారులు కొర్రీలు వేస్తూ ఇబ్బంది కలిగిస్తున్నారని మిల్లర్లు వాపోతున్నారు. దీంతో మిల్లుల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని మర పట్టడం లేదు. వర్షాకాలం ప్రారంభమైనందున మిల్లుల ఆవరణలో గుట్టలుగా నిల్వ చేసిన ధాన్యం బస్తాలు వాన నీటికి తడిసి ధాన్యం దెబ్బతింటుందని మిల్లర్లు చెబుతున్నారు. ఎక్కువ రోజులు నిల్వ చేయడం వల్ల ధాన్యం రంగు మారుతోంది. ఈ ధాన్యం మర పట్టగా వచ్చే బియ్యం సైతం పసుపు రంగులోకి మారతాయి. దీంతో ఎఫ్‌సీఐ అలాంటి బియ్యాన్ని నిరాకరిస్తోంది. ఆ సంస్థ వైఖరి వల్ల నష్టపోతున్నామని మిల్లర్లు చెబుతున్నారు. జిల్లాలో



57 రా రైస్ మిల్లులు, 7 పార్‌బాయిల్డ్ రైస్ మిల్లులు ఉన్నాయి. వీటికి గత ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం అప్పగించిన ధాన్యాన్ని మర పట్టించి బియ్యం తీసుకోవాల్సి ఉండగా పౌర సరఫరాల శాఖ, ఎఫ్‌సీఐ అధికారులు పట్టించుకోవడం లేదు.

గోదాముల్లో ఖాళీ లేదంటున్నారు

బొమ్మ రాజేశ్వరరావు, రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు

సీఎంఆర్ రైస్ తీసుకునేందుకు గోదాములు ఖాళీ లేవని ఎఫ్‌సీఐ అధికారులు లారీల నుంచి బియ్యం దిగుమతి చేసుకోవడం లేదు. దీంతో లారీలు రెండు, మూడు రోజులు గోదాముల వద్దే నిరీక్షించాల్సి వస్తోంది. జిల్లాలోని మిల్లుల్లో రోజుకు 3 వేల మెట్రిక్ టన్నుల బియ్యం ఉత్పత్తి అవుతుంది. ఎఫ్‌సీఐ అధికారులు రోజుకు ఒక వెయ్యి మెట్రిక్ టన్నులు మాత్రమే దిగుమతి చేస్తున్నారు. వర్షాలు కురిసి ధాన్యం రంగు మారితే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. ఎఫ్‌సీఐ త్వరగా సరకు దిగుమతి చేసుకోవాలి.

# 4 చోట్లా నవ్విపోయేలా..



అశ్వారావుపేట : 'ప్రతి చెరువూ హైదరాబాద్ ట్యాంకు బండ్‌ను తలపించేలా అందంగా తీర్చిదిద్దాలి. నిధులకు కొరతలేదు. మిషన్ కాకతీయ పథకంలో చెరువులు బాగు చేసుకుందాం. నియోజకవర్గంలో ఒక చెరువును ట్యాంకుబండ్‌గా అందంగా తీర్చిదిద్దాలి' మిషన్ కాకతీయ పథకం ప్రారంభంలో సీఎం కేసీఆర్ చెప్పిన మాటలివి. ఆచరణలో కాకతీయ చెరువుల్లో పూడిక తీశారు. ట్యాంకు బండ్ పనులు అరకొరగానే సాగి ప్రజలకు ఉపయోగం లేకుండా మారాయి. భద్రాద్రి జిల్లాలో అయిదు నియోజకవర్గాలకు నాలుగు చోట్ల మినీ ట్యాంకుబండ్‌లు మంజూరు చేశారు. ఏడేళ్ల కిందట పనులు ప్రారంభించారు. అశ్వారావుపేటలో వెంకమ్మ చెరువు, కొత్తగూడెంలో చుంచుపల్లి విజయనగర్ కాలనీ చెరువు, పినపాకలో మణుగూరులోని నాయుడుకుంట చెరువు, ఇల్లెందులో ఇల్లెందుపాడు చెరువులపై మినీ ట్యాంకుబండ్ పనులు నిర్వహించారు. ఒక్కో ట్యాంకుబండ్‌కు రూ.5కోట్ల చొప్పున ప్రభుత్వం నిధులు కేటాయించింది. ప్రతి ట్యాంకుబండ్‌పై కట్టను తీర్చిదిద్దడం, వాకింగ్ టైల్స్‌తో ప్రత్యేకంగా ట్రాక్ ఏర్పాటు, సోలార్ లైట్లు, మధ్య మధ్యలో కూర్చొనేందుకు వీలుగా బల్లలు, పిల్లలు ఆడేందుకు జారుడుబల్లలు, ఒక పక్క అందమైన మొక్కలతో గార్డెనింగ్ తయారు చేయాల్సి ఉంది.

చెరువు కట్టలపై మట్టిపనులు మాత్రం వేగంగా చేశారు. తరువాత పనుల్లో వేగం మందగించింది. వాకింగ్ ట్రాక్ కోసం మూడేళ్ల కిందట వేసిన టైల్స్ కొన్ని చోట్ల ఊడిపోతున్నాయి. సోలార్ లైట్లు, జారుడుబల్లలు, అందమైన మొక్కలు లేవు. చెరువు వైపు రెయిలింగ్ లేదు. కట్టలపై కనీసం కంకర రోడ్డూ వేయకపోవడంతో వర్షాకాలం వస్తే బురదలోనే వెళ్లాల్సి వస్తోంది. అసౌకర్యాలతోనే మినీ ట్యాంకు బండ్‌లు నేడు దర్శనమిస్తున్నాయి.ఇటీవలే ఇల్లెందు నియోజకవర్గంలో మినీట్యాంకు బండ్ పనులు మిగిలిన వాటికంటే ఎక్కువగా పూర్తి చేశారు. మణుగూరులో చెరువు కట్టపై మట్టిపోసి ట్రాక్ నిర్మించారు మినహా మిగిలిన పనులు ఏవీ చేయలేదు. కొత్తగూడెంలోని చుంచుపల్లి చెరువుపై వాకింగ్ ట్రాక్ మినహా మరే పని పూర్తికాలేదు. మొత్తం మీద జిల్లాలో మంజూరైన నాలుగు మినీట్యాంకు బండ్ పనులు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి.

అశ్వారావుపేటలో ట్రాక్‌పై రెయిలింగ్, సోలార్ లైట్లు, కట్టపై కంకర మార్గం అన్నీ నెల రోజుల్లో పూర్తి చేయనున్నాం. మధ్యలో గుత్తేదారు ఆలస్యం చేయడం, కట్ట బలపడుతుందని కొంతకాలం ఆపడం జరిగింది. మరో నెల రోజుల్లో అన్ని పనులు పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.ఐబీ డీఈఈ, బి.కృష్ణ

# రాగి జావ కారుతోంది..!



కొత్తగూడెం : ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుకునే వారికి పౌష్టికాహారం అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలు అమలు చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం సమస్యలు వీడటం లేదు. వయసుకు తగిన బరువు, ఎత్తు ఉండని విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఈ లోపాన్ని అధిగమించేందుకు మధ్యాహ్న భోజనంలో వారానికి మూడు రోజులు ఉడకబెట్టిన కోడిగుడ్డు, అల్పాహారంగా రాగిజావ అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. ఉదయాన్నే పిల్లలకు రాగిజావ అందిస్తే వారి ఎదుగుదలకు అవసరమైన స్థూల, సూక్ష్మ పోషకాలు సమృద్ధిగా అందుతాయి. కండరాలు, ఎముకల పుష్టికి ఇది చక్కని పోషకాహారం. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జిల్లాకు 17 చొప్పున పాఠశాలల్లో 5 వేల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరేలా గత నెల 20 నుంచి 'రాగిజావ' అందజేతను ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. వారంలో మూడు రోజులు (సోమ, బుధ, శుక్రవారం) అందజేయడానికి విద్యాశాఖ అధికారులు కార్యాచరణ రూపొందించారు. మిగిలిన మూడు రోజుల్లో ఉడకబెట్టిన కోడిగుడ్లు అందజేయాలి. జులై 1వ తేదీ నుంచి ఉమ్మడి ఖమ్మంలోని అన్ని పాఠశాలల్లో రాగిజావ అందించడానికి సన్నాహాలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. కానీ క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమం ఇంకా ప్రారంభంకాలేదు. చివరకు సాంబారు, నీళ్ల చారు దిక్కుగా మారింది.

ఉభయ జిల్లాల్లో ఇదీ పరిస్థితి

ఖమ్మం జిల్లాలోని 1,264 పాఠశాలల్లో 82,732, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,375 పాఠశాలల్లో 71,840 మంది విద్యార్థులకు రాగిజావ అందించాలి. హడావుడిగా కొన్ని పాఠశాలల్లోనే అల్పాహార కార్యక్రమం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ప్రతి విద్యార్థికి పది గ్రాముల రాగి పొడిని పది గ్రాముల బెల్లంపొడితో కలిపి చేసిన జావ అందజేయాల్సి ఉంది. మధ్యాహ్న భోజన నిర్వహణను పరిశీలిస్తే మండిపడుతున్న కూరగాయలు, నిత్యావసరాల ధరలు ప్రభావం చూపుతున్నాయి. నిర్దేశిత మెనూ అమలు చేసే పరిస్థితి లేదు. మరోవైపు గతేడాది 9, 10వ తరగతి విద్యార్థులకు భోజనం వండిపెట్టిన నిర్వాహకులకు ఆర్నెల్ల బకాయిలు ఇంకా ఖాతాలో జమ చేయలేదు. దీనివల్ల పథకం నిర్వహణ ఆర్థిక భారంగా మారిందని కార్మికులు వాపోతున్నారు. కోడిగుడ్లకు సంబంధించి రూ.2,57,60,434, కూరగాయల బిల్లులు మరో రూ.1,65,53,182 చెల్లించాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన గౌరవ వేతనం రూ.3 వేలు కూడా వెంటనే ఇవ్వాలని నిర్వాహకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నెల 10లోగా బకాయిలు చెల్లించకుంటే నిరవధిక సమ్మె తప్పదని ఇప్పటికే హెచ్చరించారు.పాల్వంచ పట్టణం బొల్లోరిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు 800 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇక్కడ మధ్యాహ్న భోజనంలో ఉడకబెట్టిన గుడ్లు వడ్డించడం లేదు. గతేడాది బిల్లులు ఇంకా అందకపోవడంతో అప్పు చేసి మరీ ఎలాగోలా విద్యార్థులకు భోజనం వండిపెడుతున్నట్లు నిర్వాహకులు వాపోతున్నారు. జిల్లాలోని పలు పాఠశాలలకు కోడిగుడ్లు అరకొరగా సరఫరా చేస్తున్నారు.

ఇది.. కొణిజర్ల మండలం కొండవనమాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల. ఒకటి నుంచి అయిదో తరగతి వరకు 44 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. దూరప్రాంతాల నుంచి ఉదయాన్నే పాఠశాలకు వచ్చే పిల్లలకు రాగిజావ అందించడం లేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

మెనూ అమలుకు చర్యలు

సోమశేఖర్‌శర్మ, డీఈఓఅన్ని పాఠశాలల్లో రాగిజావ అందజేస్తాం. రాగి, బెల్లంపొడులు ఉభయ జిల్లాల కేంద్రాలకు చేరుకున్నాయి. మధ్యాహ్న భోజన నిర్వాహకుల బకాయిలు వారం రోజుల్లో చెల్లించేలా చర్యలు తీసుకుంటాను. కోడిగుడ్లను నిబంధనల ప్రకారం అందించేలా చూస్తాను.

# సింగరేణి ఆసుపత్రుల్లో.. సేవల మెఎరుగునకు చర్యలు

కొత్తగూడెం : ఉద్యోగులకు తమ ఆసుపత్రుల్లోనే మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా సింగరేణి యాజమాన్యం అడుగులేస్తోంది. పైస్థాయి దవాఖానాలకు అత్యవసర కేసులు సిఫార్సు చేయాల్సిన అవసరం రాకుండా.. స్థానికంగానే వైద్యం అందించే దిశగా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా తొలుత వైద్య పోస్టులను ఒప్పంద పద్ధతిన భర్తీ చేసేందుకు సిద్ధమైంది. నెలకు రూ.1,25,000 వేతనం చెల్లిస్తారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఏడాది కాంట్రాక్టు పద్ధతిన 12 విభాగాల్లో 25 మంది వైద్యులను నియమించుకొనేందుకు యాజమాన్యం అవకాశాన్ని కల్పించినా.. ఆ తర్వాత ఏటేటా పనిచేసే గడువును పొడిగిస్తూ వస్తోంది. అనస్థీషియన్, ఈఎన్‌టీ సర్జన్, జనరల్ సర్జన్, గైనకాలజిస్ట్, ఆర్థోసర్జన్, ఫిజీషియన్లకు 10న, చెస్ట్ ఫిజీషియన్, హెల్త్ ఆఫీసర్, ఆప్తల్మాలజిస్ట్, పిడియాట్రీషియన్, సైకియాట్రిస్ట్, రేడియాలజిస్టులకు కొత్తగూడెంలోని డైరెక్టర్(పా) కార్యాలయంలో 11వ తేదీన ముఖాముఖిలను నిర్వహించనున్నారు.ఇదీ.. సంగతి సింగరేణిలో కొత్తగూడెం ప్రధాన వైద్యశాలతో పాటు ఆరు ఏరియా వైద్యశాలలున్నాయి. అవి.. శ్రీరాంపూర్, రామగుండం, బెల్లంపల్లి, భూపాలపల్లి, మణుగూరు, ఇల్లెందు ఏరియా వైద్యశాల.అన్ని ఏరియాల్లో మరో 21 డిస్పెన్సరీలు పనిచేస్తున్నాయి. రోజుకు ఐదు వేల మంది వరకు ఓపీలో వైద్య సదుపాయాన్ని పొందుతున్నారు. మరో 400 మంది ఇన్‌పేషంట్లుగా చేరుతున్నారు.సింగరేణి వ్యాప్తంగా 70 మంది స్పెషలిస్టు వైద్యులు, 115 మంది మెడికల్ ఆఫీసర్లు, 30 మంది ఒప్పంద వైద్యులు సేవలందిస్తున్నారు. రోజుకు సగటున 55 నుంచి 60 కేసులను మెరుగైన వైద్యం కోసం ఇతర వైద్యశాలలకు సిఫార్సు చేస్తున్నారు. రోగుల అత్యవసర వైద్యానికి ఏటా రూ.60 కోట్ల నుంచి రూ.70 కోట్లు వెచ్చిస్తున్నారు. సేవల అప్‌గ్రేడ్ ద్వారా ఈ భారాన్ని తగ్గించేందుకు, సకాలంలో అత్యవసర వైద్యం అందుబాటులోకి తెచ్చేందుకు ప్రత్యేక వైద్య నిపుణుల భర్తీకి చర్యలు చేపడుతోంది.

# జిల్లాలో త్వరలో కు.ని. శస్త్ర చికిత్సలు !

జనగామ : జిల్లాలో సుమారు ఏడేళ్లుగా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిలిచిపోయాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా ఉన్న సమయంలో జనగామలో కు.ని. శస్త్రచికిత్సల శిబిరాలు నిర్వహించేవారు. కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా జనగామ జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లా వ్యాప్తంగా కు.ని. శస్త్ర చికిత్సల శిబిరాలు నిర్వహించడం లేదు. దీంతో ప్రజలు కు.ని శస్త్ర చికిత్సల కోసం ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి వేలాది రూపాయలు ఖర్చు చేసుకుంటున్నారు.

ఏడేళ్ల తర్వాత..ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో పూర్తిస్థాయిలో కుటుంబ నియంత్రణ ల్యాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సలు, చేతితో చేసే కు.ని శస్త్ర చికిత్సలు చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా రానున్న నెల రోజుల్లో జనగామ జిల్లా ఆసుపత్రితో పాటు బచ్చన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, జఫర్‌గఢ్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో కు.ని శస్త్ర చికిత్సలు చేయాలని నిర్ణయించారు. వీటి తర్వాత రఘునాథపల్లి, నర్మెట్ట పీహెచ్‌సీల్లోనూ చేతితో చేసే శస్త్ర చికిత్సలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. నాలుగు



సీహెచ్‌సీల్లో ల్యాప్రోస్కోపిక్ కు.ని శస్త్ర చికిత్స చేయడానికి గాను త్వరలో జిల్లాకు రూ.12 లక్షల విలువైన మూడు యంత్రాలు రానున్నాయి. శస్త్ర చికిత్సలకు అవసరమైన మత్తు వైద్యుడు, సర్జన్ వైద్యుడు సిద్ధంగా ఉన్నారు. సంచార వాహనాన్ని సమకూర్చుకొని, ఇద్దరు వైద్యులు, స్టాఫ్ నర్సుల సహకారంతో జిల్లా వ్యాప్తంగా కు.ని శస్త్ర చికిత్సలు చేయడానికి జిల్లా వైద్యాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏడేళ్లుగా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో కు.ని శస్త్రచికిత్సలు నిలిచిపోవడంతో ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఒక్కో శస్త్ర చికిత్సకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు చెల్లిస్తున్నారు. చికిత్సల కోసం ప్రత్యేక సంచార వాహనం, యంత్రాలు అందుబాటులోకి రానుండటంతో ప్రజల ఇబ్బందులు తీరనున్నాయి.

నెల రోజుల్లో శిబిరాలు పారంభిస్తాం

ఎస్.ప్రశాంత్, జిల్లా వైద్యాధికారి

రానున్న నెల రోజుల్లో జిల్లా వ్యాప్తంగా కు.ని శస్త్రచికిత్సల కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నాం. ఇందుకోసం మూడు యంత్రాలు త్వరలో జిల్లాకు చేరనున్నాయి. జిల్లా ఆసుపత్రి, ఎంపిక చేసిన సీహెచ్‌సీల్లో ఒక్కో వారం చొప్పున కు.ని శస్త్ర చికిత్సలు చేస్తాం. ఒక్కో రోజు 30 మందికి శస్త్ర చికిత్సలు చేస్తాం.

# తుది సర్వేకు రంగం సిద్ధం..!

డోర్నకల్ : విజయవాడ-కాజీపేట సెక్షన్‌లోని పాపటపల్లి (ఖమ్మం జిల్లా), మోటమర్రి-విష్ణుపురం సెక్షన్‌లోని జాన్‌పహాడ్ (సూర్యాపేట జిల్లా) మధ్య కొత్త రైల్వే బ్రాడ్‌గేజ్ లైను నిర్మాణం కోసం తుది స్థాన (ఫైనల్ లోకేషన్) ఖరారు సర్వేకు రంగం సిద్ధమైంది. ప్రతిపాదిత మార్గం పొడవు 93.10 కిలోమీటర్లు ఉండగా దీనిని డోర్నకల్‌కు 8 కిలోమీటర్ల దూరంలో గల పాపటపల్లి రైల్వేస్టేషన్ వద్ద, నడికుడి మార్గంలోని మిర్యాలగూడ రైల్వేస్టేషన్ వద్ద అనుసంధానించనున్నారు. 2022, నవంబరు 24న కొత్త లైను సర్వేకు రైల్వే బోర్డు అనుమతించింది. ఇందుకోసం రూ.3 కోట్లు కూడా కేటాయించగా ఓ ప్రైవేటు సంస్థ ప్రాథమిక సర్వే చేపట్టింది. ప్రతిపాదిత అలైన్‌మెంట్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కొన్నిచోట్ల స్థానికులు సర్వేను అడ్డుకోవడంతో ప్రతిష్ఠంబన ఏర్పడింది. ఇప్పుడు మళ్లీ అధికారులు దక్షిణ మధ్య రైల్వేకు డీపీఆర్ సమర్పించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలోనే తుది స్థాన ఖరారు సర్వేకు పూనుకున్నారు. ప్రతిపాదిత లైను వెళ్లే మార్గంలో సమస్యాత్మక గ్రామాలకు తోడు ఈ కార్యాచరణ పూర్తి చేయడానికి అవసరమైన చేయూత అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

ప్రస్తుతం సింగిల్‌లైన్..డోర్నకల్-మిర్యాలగూడ రైల్వేలైనుకు ప్రతిపాదిత మార్గం: ఖమ్మం రూరల్ మండలం జాన్‌బాద్ తండా, బోడ వీర, దారేడు, గుండల తండా, గూడూరుపాడు, ఎం.వెంకటాయపాలెం, ఆరెకోడు, ఆరెంపుల, బూరుగూడెం, పొన్నెకల్లు, ముద్దులపల్లి, తెల్దారుపల్లి, ముదిగొండ మండలంలోని లక్ష్మీపురం, మేడేపల్లి, ధనియాగూడెం, కట్కూరు, నేలకొండపల్లి మండలం ఆరేగూడెం, అచర్లగూడెం, కొనాయిగూడెం, నేలకొండపల్లి, బొదులబండ, పైనంపల్లి గ్రామాలను కలుపుతూ కోదాడ, హుజుర్‌నగర్ మీదుగా కొనసాగనుంది. ప్రస్తుతానికి సింగిల్‌లైను కోసం 8 మీటర్ల భూమి సేకరించాలని నిర్దేశించారు. ఒకవేళ డబ్లింగ్ లైనుకు ఇప్పుడు భూమి సేకరించాలని భావించిన పక్షంలో 15 మీటర్ల మేరకు అవసరమవుతుంది. సూర్యాపేట జిల్లా పరిధిలో 50 కిలోమీటర్ల పొడవు రైల్వేలైను నిర్మాణానికి సర్వే ఇప్పటికే పూర్తయింది.బొగ్గు సరఫరా ముఖ్యోద్దేశం

లిదక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజినీర్(కన్‌స్ట్రక్షన్)-గుంటూరు ఫైనల్ లోకేషన్ సర్వేకు జూన్ ఒకటిన ఉత్తర్వులు వెలువరించారు. దీనిపై విస్తృత ప్రచారం కల్పించాలని ఖమ్మం జిల్లా యంత్రాంగానికి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యాదాద్రి థర్మల్ విద్యుచ్ఛక్తి ప్లాంట్‌కు బొగ్గు సరఫరా చేయడం ఈ కొత్త లైను ముఖ్యోద్దేశం. ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని బొగ్గు గనుల నుంచి డోర్నకల్ మీదుగా మోటమర్రి-విష్ణుపురం మార్గం నుంచి బొగ్గును సరఫరా చేయడానికి 150 కిలోమీటర్లు రవాణా చేస్తున్నారు. ఖమ్మం జిల్లా పరంగా పరిశీలిస్తే..కొత్త మార్గం నిర్మాణం పూర్తయితే 50 కిలోమీటర్ల దూర భారం తగ్గుతుంది. ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి, ముదిగొండ మండలాల్లో గల గ్రానైట్, ఇనుప ఖనిజం, చెరకు రవాణా అవసరాలకు ఈ కొత్త రైల్వేలైను ఉపయోగపడుతుంది. ఉమ్మడి వరంగల్ జిల్లా పరంగా.. సంగెం మండలం చింతలపల్లి వద్ద ఉన్న టెక్స్‌టైల్ పరిశ్రమ సమీప జిల్లాలవాసులకు చేరువ అవుతుంది. కార్పొరేట్ స్థాయి వైద్యం పొందేందుకు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి దగ్గరవుతుంది. నెక్కొండలోని లక్ష టన్నుల సామర్థ్యం కలిగిన పౌర సరఫరాల గోదాములకు ఇతర జిల్లాల నుంచి దిగుమతులకు మార్గం సుగమమం అవుతుంది.

నేపథ్యమిది2013-14లోనే డోర్నకల్ జంక్షన్-మిర్యాలగూడ రైలు మార్గం సర్వేకు రైల్వేశాఖ సంసిద్ధత వ్యక్తం చేసింది. 2017లో సర్వేకు శ్రీకారం చుట్టారు. 2021, అక్టోబరు 2న సికింద్రాబాద్ రైల్ నిలయంలో నిర్వహించిన సమావేశంలో నల్గొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డోర్నకల్-మిర్యాలగూడ మధ్య నిర్మించ తలపెట్టిన కొత్త రైలు మార్గం గురించి ప్రస్తావించారు.

# కొనుగోళ్ల జోరు.. నడిపేవారు లేరు

మంచిర్యాల : మంచిర్యాల పురపాలక సంఘంలో చెత్తాచెదారం తరలించే వాహనాలపై పర్యవేక్షణ లేక తుక్కు పాలవుతున్నాయి. కొత్త వాహనాలు రాగానే డ్రైవర్ల కొరత పేరుతో పాత వాహనాలు మూలనపడేశారు. ప్రభుత్వం పట్టణ ప్రగతి పథకం కింద ప్రతి నెలా నిధులు మంజూరు చేస్తుంటే.. అధికారులు వాహనాలు ఎక్కువ సంఖ్యలో కొనుగోలు చేశారు. అయితే వాటికి అవసరమైన స్థాయిలో డ్రైవర్లను నియమించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా రూ.లక్షల నిధులు ఖర్చు చేసి కొనుగోలు చేసిన 12 ఆటో ట్రాలీలు నిరుపయోగంగా మారాయి.

అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం తీరు..

మంచిర్యాల పట్టణంలో పారిశుద్ధ్య సమస్య అస్తవ్యస్తంగా మారినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. కమిషన్లకు కక్కుర్తిపడి ఆర్భాటంగా చెత్త తరలించడానికి వాహనాలు కొనుగోలు చేసి, పాత వాటిని మూలకు పడేశారు. వాటికి అవసరమైన డ్రైవర్లను నియమించడం లేదు. పట్టణంలోని 36 వార్డుల్లో రోజుకు సుమారు 45 మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతోంది. అయితే రోజుకు 43 మెట్రిక్ టన్నుల చెత్తను మాత్రమే తొలగిస్తున్నారు. మిగతా రెండు మెట్రిక్ టన్నుల చెత్తాచెదారం రహదారుల పక్కన, నివాస గృహాల



ముందే పేరుకుపోతోంది. ఇక్కడ పరిశుభ్రత పనులు చేయడానికి 33 మంది శాశ్వత కార్మికులు, 274 మంది ఒప్పంద కార్మికులు పనిచేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు నివాసం ఉండే వీధుల్లోనే జవాన్లు, కార్మికులతో పనులు చేయిస్తూ గల్లీ రోడ్లలో చెత్త తీయడం లేదని, మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదని ఆయా కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. సమయం ప్రకారం కార్మికులతో పనులు చేయించడానికి అధికారులు ఒత్తిడి చేస్తే కార్మిక సంఘం నాయకులు అడ్డుపడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. నిరుపయోగంగా ఉన్న 12 ఆటో ట్రాలీలను వినియోగంలోకి తెస్తే వాటిపై 24 మంది కార్మికులు పని చేయాల్సి ఉంది. వార్డుల్లో కార్మికులను తగ్గించవద్దని కౌన్సిలర్లు వాదిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి కార్మికులతో సమయం ప్రకారం పరిశుభ్రత పనులు చేయించి, నిరుపయోగంగా ఉన్న ఆటో ట్రాలీలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్భాటమేనా..?!

మంచిర్యాల పురపాలక అధికారులు ఏడాది కిందట మహిళల కోసం దాదాపు రూ.20 లక్షలతో రెండు బయో టాయిలెట్ బస్సులను కొనుగోలు చేశారు. వీటిని రద్దీ ప్రాంతాలు ఉన్న చోట, సభలు, సమావేశాలు నిర్వహించినప్పుడు, జాతర సమయంలో మహిళలు మలమూత్ర విసర్జన కోసం వినియోగిస్తారు. వాటిని ఆర్భాటంగా కొనుగోలు చేసిన అధికారులు డ్రైవర్లను నియమించడంలో మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారు. పారిశుద్ధ్య విభాగంలో పని చేసే ఒక కార్మికుడితో అప్పుడప్పుడు ఒక బస్సును నడిపిస్తున్నారు. మరో బస్సు నిరుపయోగంగా ఉంటోంది. ఇలా అయితే ఆ రెండు బస్సులు అనతికాలంలో తుక్కుపాలు అయ్యే ప్రమాదం ఉంది.

# అనుమతులు లభించి.. పనులు ప్రారంభించి

ఆసిఫాబాద్ : నిజామాబాద్ నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జగ్ధలపూర్ వరకు ఉన్న 63వ జాతీయ రహదారిలో కీలక ఘట్టం, చెన్నూరు ప్రాంత వాసులు దశాబ్దాల కష్టం తీరే మార్గానికి అడుగులు మొదలయ్యాయి. చెన్నూరు- భీమారం శివారు ప్రాంతంలో సరిహద్దులను వీడదీస్తూ ప్రవహిస్తున్న జోడువాగుల ప్రాంతంలో అటవీ అనుమతులకు లేక ఏళ్ల తరబడి ఈ ప్రాంత వాసులు ఒకే వరుసన ఉన్న గుంతల రహదారిపై ప్రమాదాలతో సహవాసం చేస్తూ ప్రయాణాలు సాగించారు. ఇటీవల వచ్చిన అటవీ అనుమతులతో సుమారు 2 కిలోమీటర్ల మేర నిలిచిన రహదారి పనులకు మోక్షం కలిగింది. అటవీశాఖ అనుమతులతో జాతీయ రహదారి శాఖ అధికారులు రహదారికి విస్తరణలో భాగంగా రహదారి పక్కన ఉన్న చెట్లను తొలగించడం ప్రారంభించారు. అటవీశాఖ అనుమతులు రావడం, పనులు ప్రారంభం కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ రహదారిలో కీలకం



జాతీయ రహదారి ఏర్పాటులో భాగంగా 2017 సంవత్సరంలో జిల్లాలోని జైపూర్ మండలం రసూల్‌పల్లి నుంచి కోటపల్లి మండలంలోని అర్జునగుట్ట వరకు సుమారు 40 కిలోమీటర్ల రహదారి (సుమారు రూ.163 కోట్లు) పనుల్లో కొన్ని వంతెనల నిర్మాణం తప్ప మిగిలిన రహదారి పనులను పూర్తి చేసినా.. జోడువాగుల ప్రాంతంలో 2 కి.మీ రహదారి వంతెన నిర్మాణం చేయాల్సి ఉంది. ప్రస్తుతం అటవీ అనుమతులు లభించడంతో ఇక్కడ నాలుగు వరుసల రహదారిని ఏర్పాటు చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

# వేలిముద్ర వేయాల్సిందే..



ఆసిఫాబాద్ : జిల్లాలో ఓ మారుమూల పాఠశాలకు ఉపాధ్యాయుడు నెలలో రెండు మూడుసార్ల కంటే ఎక్కువ హాజరుకాడనే ఆరోపణలు ఉన్నాయి. వాగు దాటరాదనే సాకుతో తనవంతుగా ఓ విద్యా వాలంటీరును నియమించి జీతం మాత్రం తీసుకుంటున్నాడు. జిల్లా కేంద్రంలో స్థిరాస్తి వ్యాపారం చేస్తూ గ్రామపెద్దలకు అప్పుడప్పుడు విందులు ఇస్తూ ఎవరూ ప్రశ్నించకుండా జాగ్రత్త పడుతున్నాడు. ఇపుడు ఇలాంటి ఉపాధ్యాయుడు కొత్త విధానంతో పాఠశాలకు తప్పక వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. చాలామంది ఉపాధ్యాయులు పాఠశాలకు రాకపోకల కోసం ఆర్టీసీ బస్సును వినియోగిస్తుంటారు. ఉదయం పూట సమయానికి వెళ్లే యత్నం చేస్తున్నా తిరుగుపయనంలో మాత్రం గంట ముందే ఇంటికి వెళ్లిపోతున్నారు. ఉదయం, సాయంత్రం రెండుసార్లు బడి సమయానికి అబాస్ యంత్రంపై వేలిముద్ర వేయాల్సి ఉండటంతో అలాంటి ఉపాధ్యాయులు నిర్ణీత పనివేళలు పాటించాల్సి ఉంటుంది.సర్కారు బడికి చెప్పాపెట్టకుండా బడికి హాజరుకాని ఉపాధ్యాయులకు ముకుతాడు వేసే చర్యలకు విద్యాశాఖ ఉపక్రమించింది.

పాఠశాలకు సమాయానికి వెళ్లకపోవడం.. ముందే ఇంటిదారి పట్టడం ఇకపై కుదరదు. అలాంటి చర్యలకు అడ్డుకట్ట వేసేలా ఆధార్ సహిత వేలిముద్ర విధానానికి తెరపైకి తీసుకొచ్చింది. త్వరలో కొత్త విధానంలో బోధన, బోధనేతర సిబ్బంది హాజరు తీసుకునే ప్రక్రియ మొదలుకానుంది.

జిల్లాలో మారుమూలన బడులు ఉండటం.. ఉపాధ్యాయులపై పర్యవేక్షణ కొరవడి విద్యావ్యవస్థ గాడితప్పుతోంది. ఫలితంగా పేద విద్యార్థులకు గుణాత్మక విద్య అందడం లేదు. ఉపాధ్యాయులు పాఠశాలకు సరిగ్గా వెళ్లకపోవడం.. వెళ్లినా సమయపాలన లేకపోవడం క్షేత్రస్థాయిలోని అధికారులు ఈ వ్యవహారాన్ని 'మామూలు'గా తీసుకుంటున్నారనే విమర్శలు లేకపోలేదు. కొంతమంది వంతుల వారీగా విధులకు వెళ్లడం.. బడికి వెళ్లని రోజున వెళ్లినట్లు హాజరు పట్టికతో సంతకాలు చేయడం పరిపాటిగా తయారైంది. ఇలాంటి అక్రమాలు అడ్డుకట్ట వేసేందుకుగాను విద్యాశాఖ ఆధార్ సహిత హాజరు విధానం (అబాస్-ఆధార్‌బేస్డ్ అటెండెన్స్ సిస్టం) అమలు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం రెండేళ్ల కిందటే జిల్లాను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినా కరోనా కారణంగా అబాస్ యంత్రాలు మూలనపడ్డాయి. ఇపుడు వాటికి మరమ్మతులు చేసి బయోమెట్రిక్ హాజరుకు అంతా సిద్ధం చేసిపెట్టారు. జిల్లాలోని జిల్లాపరిషత్, మండలపరిషత్, కస్తూర్బాలు, ఆదర్శపాఠశాలల్లోని బోధన, బోధనేతర సిబ్బంది హాజరు తీసుకోనున్నారు.

అబాస్ యంత్రం ఎలా పని చేస్తుందంటే?

అబాస్ యంత్రాన్ని పాఠశాలకు ఒకటి పంపిణీ చేశారు. వాటిలో ఉపాధ్యాయుడి పేరు, ఆధార్ సంఖ్యను నమోదు చేశారు. ఆ యంత్రం పాఠశాలలోనే పని చేసేలా లోకేషన్‌ను గూగుల్‌మ్యాప్‌లో నిక్షిప్తం చేశారు. ఉపాధ్యాయుడు ఏ సమయానికి వెళ్లాడు. తిరిగి ఎపుడు పాఠశాల నుంచి తిరుగుముఖం పట్టాడో అనేది వేలిముద్ర వేసినపుడు సమయం నమోదయ్యేలా.. అలా వేలిముద్ర వేసినపుడు ఆన్‌లైన్ విధానంలో విద్యాశాఖకు చేరేలా అబాస్ యంత్రాన్ని రూపొందించారు. ఉపాధ్యాయులు సమయసారిణి పాటించేలా.. డుమ్మా కొట్టకుండా ఉపయోగపడనుంది.

అంతా సిద్ధం చేశాం: నారాయణ, సెక్టోరల్ అధికారి

అబాస్ యంత్రాలను పనిచేసేలా ఇటీవలే మరమ్మతులు చేయించాం. ఉపాధ్యాయుల పేర్లు, ఆధార్ సంఖ్యను అందులో నమోదు చేయించాం. ఉపాధ్యాయులు సమయానికి వెళ్లేలా, నిర్ణీత సమయం వరకు పాఠశాలలో ఉండేలా ఉపాధ్యాయులపై అబాస్ యంత్రాలతో పర్యవేక్షణ పకడ్బందీగా జరగనుంది. ఈ యంత్రాలు వైఫై సాయంతోనూ పని చేయడంతో దాదాపు జిల్లాలో అన్ని పాఠశాలల్లో ఈ విధానం సమర్థవంతంగా అమలు చేయబోతున్నాం.

# ఖర్చవుతున్న నిధులు.. కనిపించని మొక్కలు



ఆసిఫాబాద్ : పచ్చదనం పెంపొందించడం కోసం ప్రవేశపెట్టిన హరితహారం పథకం జిల్లాలో మొక్కుబడిగా అమలవుతోంది. ప్రతి సంవత్సరం లక్ష్యం మేరకు హడావుడిగా మొక్కలు నాటుతున్న అధికారులు వాటి సంరక్షణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో స్వల్ప కాలంలోనే నాటిన మొక్కలన్నీ కనుమరుగవుతున్నాయి. రూ.కోట్ల నిధులు బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారుతున్నాయి. అన్నిశాఖల అధికారులు మొక్కలు నాటడంలో మాత్రమే ఉత్సాహాన్ని కనబరుస్తున్నారు. కంచెలు లేక, నీరు సక్రమంగా పట్టకపోవడంతో హరితహారం పథకం ఏటా అబాసుపాలవుతోంది. జిల్లాలో లక్ష్యం మేర మొక్కలు నాటుతున్నా.. పథకం ఉద్దేశం మాత్రం నెరవేరడం లేదు.పంచాయతీకో నర్సరీ స్థాపించగా జిల్లా వ్యాప్తంగా 39 లక్షల మొక్కలను నాటాలని అధికారులు సంకల్పించారు. రహదారుల పక్కన, ఖాళీ స్థలాల్లో, అడవుల్లో, చెరువులు, కాలువల గట్ల వెంబడి వివిధరకాల మొక్కలతో పాటు, ఉద్యానవన, యూకలిప్టస్ మొక్కలను సైతం నాటుతున్నారు. ఇందులో ఒక్కో మొక్క నాటేందుకు గుంతలు తీయడానికి రూ.20.41, మొక్కకు ఆధారంగా కర్ర పెట్టడానికి రూ.1.20, మొక్కను రవాణా చేయడానికి రూ.1.04, నీరు పోయడానికి రూ.1.80, రక్షణగా కంచె ఏర్పాటు చేయడానికి రూ.32.45, నెలకు నిర్వహణ ఖర్చులు రూ.3, మొక్క చనిపోతే మళ్లీ నాటడానికి రూ.14.79 ఇలా నిధులు విడుదలవుతున్నాయి. అంటే ఒక్కో మొక్క నాటడానికే రూ.74 చొప్పున ప్రతి ఏటా రూ.కోట్ల నిధులు కేటాయిస్తున్నారు.

ఈ సంవత్సరం రూ.15 కోట్ల ఖర్చు..

జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం 38 లక్షల మొక్కలను నాటాలనేది అధికారుల లక్ష్యం. ఇప్పటి వరకు 29.39 లక్షల మొక్కలు నాటామని అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన దాదాపు రూ.15 కోట్లు మొక్కలు నాటడానికి, నర్సరీల నిర్వహణకే వెచ్చించారు. ముఖ్యంగా రహదారుల పక్కన (అవెన్యూ ప్లాంటేషన్) నాటే మొక్కలను ప్రతి సంవత్సరం మళ్లీ, మళ్లీ అదే స్థలంలో అక్కడే నాటుతున్నారు. సరైన సంరక్షణ చర్యలు లేకపోవడంతో ఇవన్నీ పశువులపాలు అవుతున్నాయి. కొన్ని చోట్ల నీరందక ఎండిపోతున్నాయి.

2వేల మొక్కల్లో ఒక్కటీ దక్కలేదు

కెరమెరి మండలంలో జోడేఘాట్ వెళ్లే మార్గంలో 2021లో అటవీశాఖ అధికారులు 500 హెక్టార్ల పరిధిలో 2వేల నేరేడు, వెదురు మొక్కలు నాటారు. రహదారి పక్కనే ఉండటం, ఎలాంటి సంరక్షణ చర్యలు చేపట్టకపోవడంతో నేడు ఒక్క మొక్కా కనిపించడం లేదు. దీంతో రూ.2 లక్షల వ్యయం బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారింది. జిల్లా వ్యాప్తంగా అనేకచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది.

'హరితహారం'సంరక్షణ చర్యలేవి..

ఆసిఫాబాద్ మండలంలోని అడ నుంచి గోయగాం వరకు ప్రధాన రహదారిని అనుకుని 400 మొక్కలు నాటారు. గతేడాది, అంతకుముందు సంవత్సరం సైతం మొక్కలు నాటి, కంచెలను ఏర్పాటు చేశారు. ఇటీవలే నాటిన వాటికి కంచెలను ఏర్పాటు చేయలేదు. నీరు సైతం పట్టకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. ప్రధాన రహదారి పక్కనే మొక్కలు పెంపకం ఇలా ఉంటే ఇక పల్లెల్లో పెంచే విధానం ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

# ఖాళీ ప్లాట్లు.. తప్పని పాట్లు

ఆసిఫాబాద్ : కాగజ్‌నగర్‌లో పట్టణీకరణ దినదినాభివృద్ధి చెందుతోంది. పట్టణ సరిహద్దు ప్రాంతాల్లో ప్లాట్లు వెలుస్తున్నాయి. పలు ప్రాంతాలోని కాలనీ, గ్రామాల మధ్య ఖాళీ ప్లాట్లతో ఇబ్బందులు తప్పడం లేదు. అపరిశుభ్రతకు నిలయాలు, ఆకతాయిలకు అడ్డాగా మారుతున్నాయి. దీనికి తోడు వర్షం నీరు నిలిచి అపరిశుభ్రతతో అనారోగ్యానికి కారణం అవుతున్నాయి.

రోగాల బెడదకాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడ కాలనీలో పలు ఖాళీ ప్లాట్లు ఉన్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీరు నిలిచి, దోమలబెడద తీవ్రమైంది. అధికారులు, ప్లాట్ల యజమానులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.పారిశ్రామిక ప్రాంతమైన కాగజ్‌నగర్‌లో గ్రామీణులు, ఉద్యోగులు ఇళ్ల స్థలాల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ప్లాట్ల ధరలకు రెక్కలొచ్చాయి. దీనిని ఆసరాగా తీసుకొని పట్టణంలోని సరిహద్దు గ్రామాల్లోని పలువురు స్థిరాస్తి వ్యాపారులు పంట పొలాలను కొనుగోలు చేసి, పంచాయతీ అధికారులు, పాలకవర్గం సభ్యులతో కుమ్మక్కై లేఅవుట్ లేకుండానే ప్లాట్ల క్రయవిక్రయాలు చేపడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్ల అమ్మకాలు జరుపుతున్నారు. ఇలా కొనుగోలు చేసిన ప్లాట్లు చాలా వరకు ఖాళీగా ఉంటున్నాయి. నిర్వహణ లేక అపరిశుభ్రతకు నిలయాలుగా మారుతున్నాయి.

వందల సంఖ్యలో..పురపాలక పరిధిలోని కాపువాడ, బాలాజీనగర్, ఆర్ఆర్ఓ కాలనీ, రైల్వేగేటు ఏరియా, పెట్రోల్‌పంపు, కృష్ణాకాలనీ, సర్‌సిల్క్ ఏరియా, విజయబస్తీ తదితర కాలనీల్లోనూ వందల సంఖ్యలో ఖాళీ స్థలాలు(ప్లాట్లు) ఉన్నాయి. సదరు యజమానులు ఆ ప్లాట్లకు చదును చేయక పోవడంతో పిచ్చిమొక్కలు, మురుగునీరు నిలిచి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

స్పందన కరవు

కాగజ్‌నగర్ పట్టణంలోని ఆర్ఆర్ఓ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల, ఉపకేంద్రం భవనం ఎదుట వరద నీరు నిలిచింది. దీంతో ఆ భవనాల్లోకి వచ్చేందుకు విద్యార్థులు, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని బల్దియా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు.సర్వేలకే పరిమితం: నూతన పురపాలక చట్టం ప్రకారం ఖాళీ ప్లాట్లు స్థానికులకు ఇబ్బందిగా మారితే చర్యలు తీసుకోవాలి. అధికారులు సత్వరమే వాటిని గుర్తించి, సంబంధిత యజమానులకు శ్రీముఖాలను జారీ చేయాలి. గడువు లోగా స్పందించకుంటే అధికారులే ఆ ప్లాటును ఆపరిశుభ్రతను తొలగించి, చదును చేయాలి. అందుకు ఎంత ఖర్చు అవుతుందో సదరు యజమాని నుంచి వసూలు చేయాలి. కానీ అధికారులు కేవలం సర్వేలకే పరిమితం అవుతున్నారు. కాగజ్‌నగర్ పురపాలక పరిధిలోని వివిధ వార్డులు, సరిహద్దు గ్రామాల్లో రెండు వందలకుపైనే ఖాళీ స్థలాలు(ప్లాట్లు)ను అధికారులు గుర్తించారు. కానీ నోటీసులు మాత్రం జారీ చేయలేదు.

# రహదారులపై పోసి..అమ్మేసి..

నిర్మల్ : భారీ వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి వరద పోటెత్తడంతో కడెం ప్రాజెక్టు నిండుకుండను తలపించి గేట్లన్నీ ఎత్తేసే స్థాయికి చేరుకుంది. దీంతో పరివాహక ప్రాంతంలో, వాగులో పెద్ద మొత్తంలో ఇసుక వచ్చి చేరింది. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు దానిని అక్కడి నుంచి తరలిస్తూ ఎక్కడికక్కడ నిల్వలు చేస్తున్నారు. ఇదంతా బాహాటంగా సాగుతున్నా అధికారులు మాత్రం కట్టడి దిశగా చర్యలు తీసుకోవడం లేదు. జిల్లాలో ఏ ఒక్క ప్రాంతంలోనూ అధికారిక ఇసుక రీచ్‌లు లేవు. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం, పెద్దపల్లి జిల్లా మంథని, జయశంకర్ భూపాలపల్లి జిల్లా తదితర ప్రాంతాల్లో ఉన్న కాళేశ్వరంలోని రీచ్‌ల నుంచి ఇసుక తరలింపునకు అనుమతులున్నాయి. ఒక్కో టన్నుకు సుమారు రూ.350 చెల్లించాల్సి ఉంటుంది. అక్కడి నుంచి తీసుకొచ్చిన దానిని జిల్లాలో సన్నరకం టన్నుకు రూ.1,600, దొడ్డు రకానికి రూ.1,300లు, స్థానికంగా లభించే వాగులు, నదుల ఇసుకను రూ.వెయ్యి వరకు విక్రయిస్తున్నారు. రీచ్‌ల నుంచి తెచ్చిన దానిని సరాసరిగా సదరు కొనుగోలుదారుల వద్దకే వెళ్లి అమ్మాల్సి ఉంటుంది. కొందరు నిర్వాహకులు ఈ నిబంధనలు పక్కన పెట్టేసి తమకు తోచిన చోట్లలో లోకల్ ఇసుకను



సైతం నిల్వలు చేసుకుంటూ అమ్మకాలు జరుపుతున్నారు. ఇందుకోసం రోడ్ల పక్కనే అడ్డాలు ఏర్పాటు చేసుకున్నారు. మరికొందరు వివిధ పేర్లు పెట్టుకొని ప్రత్యేకంగా షెడ్లు నెలకొల్పి అమ్ముతున్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ ఈ తంతు సాగుతోంది. గ్రామాల్లో డంప్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత శాఖల అధికారులు అక్రమ ఇసుక దందా వ్యవహారంపై తగిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే భూగర్భ జలాలకు పెనుముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులే ఇసుక విక్రయాలకు అడ్డాలుగా మారాయి. అక్కడే జాలీ పడ్తూ అమ్ముతున్నారు. అడ్డుకోవాల్సిన జిల్లా స్థాయి అధికారుల కళ్లెదుటే ఈతంతు సాగుతున్నా పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఆదిలాబాద్, నిజామాబాద్, ఖానాపూర్, భైంసాకు వెళ్లే ప్రధాన రహదారుల పక్కనే ఈ వ్యవహారం యథేచ్ఛగా కొనసాగుతోంది.

తనిఖీలు చేస్తాం..- క్రాంతికుమార్, జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి, నిర్మల్‌జిల్లాలో ఎక్కడా ఇసుక రీచ్‌లకు అనుమతులు లేవు. నిల్వలుచేసి అమ్మకాలు జరిపేందుకు అవకాశం లేదు. దీనిపై పూర్తిస్థాయిలో తనిఖీలు చేపడ్తాం. అక్రమంగా విక్రయాలు జరిపే వారిపై చర్యలు తీసుకుంటాం.

# నగరంలో కబ్జా బృందాలు!

వరంగల్ : మహా నగర పరిధిలో ప్రైవేటు స్థలాల ఆక్రమణలకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. స్థానికేతరుల స్థలాలను ఆక్రమించేస్తున్నా రు.తప్పుడు సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు. హైదరాబాద్, బెంగళూరు, పుణెలో పనిచేసే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన విశ్రాంత అధికారులు, ఉద్యోగుల ప్లాట్లను లక్ష్యంగా చేసుకొని సొంతం చేసుకుంటున్నారు. ఈ బృందాల్లో కమలాపూర్, పరకాల, సంగెం, గీసుకొండ ప్రాంతాలకు చెందిన చోటా మోటా లీడర్ల పేర్లు వెలుగులోకి వచ్చాయి. చట్టసభలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పేరుతో ఖాళీ ప్లాట్లను కొట్టేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా టీఎస్-బీపాస్ ద్వారా భవన నిర్మాణ అనుమతులు పొందుతున్నారు.

78 ఫిర్యాదులు

ప్రైవేటు ప్లాట్ల పంచాయితీ మహా నగరపాలక సంస్థ ప్రణాళిక విభాగానికి తలనొప్పిగా మారింది. జనవరి నెల నుంచి పరిశీలిస్తే వివాదాస్పదమైన ప్రైవేటు స్థలాలపై 78 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో సగం వరకు హైకోర్టు, జిల్లా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్నాయి. మే, జూన్ నెలల్లో ప్రజావాణిలో కాజీపేట, కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయాల పరిధిలో ఎక్కువ అర్జీలు వచ్చాయి. చాలా వరకు ఒకే స్థలం(ప్లాటు) ఇద్దరు, ముగ్గురికి రిజిస్ట్రేషన్లు అయ్యాయి. వీటిని ఎలా పరిష్కరించాలో తెలియక పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పరేషానవుతున్నారు. కొందరు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, రాష్ట్ర ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్, డీటీసీపీకి ఫిర్యాదులు చేస్తున్నారు. కాజీపేట, సుబేదారి, కేయూసీ, హసన్‌పర్తి, మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్, మిల్స్ కాలనీ, మామునూరు పోలీసు స్టేషన్లలో వందల సంఖ్యలో ప్రైవేటు ప్లాట్లపై ఫిర్యాదులు వచ్చాయని తెలిసింది.

ఇవిగో ఉదాహరణలు

లి భీమారం ఎర్రగట్టు గుట్ట సమీపంలో టీఎస్పీడీసీఎల్ విశ్రాంత అధికారికి 450 గజాల ప్లాటు ఉంది. 20 ఏళ్ల క్రితం కొనుగోలు చేశాడు. కుటుంబంతో సహా హైదరాబాద్‌లో ఉంటున్నారు. పరకాల పట్టణానికి చెందిన ఓ నాయకుడు స్థలాన్ని ఆక్రమించాడు. చుట్టూ ప్రహరీ, షెడ్డు నిర్మించి నగరపాలక సంస్థ నుంచి ఇంటినంబరు పొందాడు. విశ్రాంత అధికారి వచ్చి అడిగితే స్థలం నాదేనంటూ బుకాయించారు. బల్దియా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. హనుమకొండ రెడ్డిపురంలో బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న యువకుడు 650 గజాల స్థలాన్ని నాలుగేళ్ల క్రితం కొన్నాడు. వృత్తి రీత్యా అక్కడే నివాసముంటున్నాడు. స్థానిక నాయకుడి అండతో ఒకరు ఈయన ప్లాటును ఆక్రమించారు. ఇతర సర్వేనంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకొని బల్దియా నుంచి బిల్డింగ్ పర్మిషన్ తీసుకున్నారు. దీనిపై సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఫిర్యాదు చేసినా, అధికారులు పట్టించుకోవడం లేదు. భవన నిర్మాణ అనుమతి రద్దు చేయడం లేదు. హంటర్‌రోడ్ ఎన్టీఆర్‌నగర్, సంతోషిమాత కాలనీలో మూడు ఖాళీ స్థలాలు వివాదాస్పదమయ్యాయి. ఒకే ప్లాటు ఇద్దరేసి వ్యక్తులకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. స్థలాల్లో ప్రహరీ కట్టడంతో గ్రేటర్‌కు ఫిర్యాదులు వచ్చాయి. దేశాయిపేట చిన్నవడ్డేపల్లి చెరువు శివారులో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి 350 గజాల ప్లాటును కాశీబుగ్గకు చెందిన ఓ కబ్జా బృందం ఆక్రమించేసింది. బల్దియా అనుమతి తీసుకోకుండానే నిర్మాణ పనులు మొదలుపెట్టారు. చర్యలు తీసుకోకుండా స్థానిక నాయకులు ఆక్రమణదారులకు సహకరిస్తున్నారు. ఉర్సు శివారులో తొర్రూరు పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు వ్యక్తులు పదేళ్ల క్రితం ప్లాట్లు కొన్నారు. ఈ స్థలాలపై ఆక్రమణదారులు కన్నేశారు. ఇతర సర్వేనంబర్లతో రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఈ విషయం జిల్లాకు చెందిన మంత్రి వద్దకెళ్లింది.

# వైఎస్సార్‌కు నివాళులర్పించిన వైఎస్ విజయమ్మ, షర్మిల



వైఎస్సార్ జిల్లా: దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 74వ జయంతి వేడుకలను ఇడుపులపాయలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్ విజయమ్మ, షర్మిల నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుటుంబసభ్యులు, బంధువులు, అభిమానులు పాల్గొన్నారు. పులివెందులలో వైఎస్సార్ విగ్రహానికి ఎంపీ అవినాష్‌రెడ్డి పూలమాల వేసి నివాళర్పించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా కళ్యాణదుర్గంలో అనంతపురం జిల్లా నిర్వహించే వైఎస్సార్ రైతు దినోత్సవంలో సీఎం జగన్ పాల్గొననున్నారు. 2022 ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులకు పంటల భీమా పరిహారాన్ని అందించనున్నారు. ఏపీ మోడల్ స్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన సభా వేదిక వద్దకు చేరుకుని డాక్టర్ వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌ను ప్రారంభిస్తారు. అనంతపురం జిల్లాలో కార్యక్రమం అనంతరం వైఎస్సార్ జిల్లా పర్యటనకు సీఎం జగన్ బయలుదేరనున్నారు. మధ్యాహ్నం ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌కు చేరుకుని మహానేత వైఎస్సార్‌కు నివాళులర్పిస్తారు. నేటి నుంచి 10వ తేదీ వరకు ఆ జిల్లాలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

# వైయస్ఆర్‌కు నివాళులర్పించిన సీఎం వైయస్ జగన్



వైయస్ఆర్ జిల్లా: దివంగత మహానేత వైయస్ రాజశేఖర్‌రెడ్డి 74వ జయంతి వేడుకలను ఇడుపులపాయలో ఘనంగా నిర్వహించారు. వైయస్ఆర్ ఘాట్ వద్ద తల్లి వైయస్ విజయమ్మతో కలిసి సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎం వైయస్ జగన్ సతీమణి వైయస్ భారతమ్మ, డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైయస్ఆర్ కుటుంబసభ్యులు, బంధువులు, అభిమానులు పాల్గొన్నారు.

# థ్యాంక్యూ రాహుల్ సర్.. వైఎస్సార్‌ను మీ గుండెల్లో పెట్టుకున్నందుకు: వైఎస్ షర్మిల

హైదరాబాద్: దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ నివాళులు అర్పించారు. వైఎస్సార్ దార్శనికత ఉన్న నాయకుడని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నేత అని కొనియాడారు. వైఎస్సార్ చిరస్మరణీయ నేత అని రాహుల్ గాంధీ ట్విటర్ వేదికగా పేర్కొన్నారు.

రాహుల్ గాంధీ చేసిన ట్వీట్‌పై వైఎస్సార్ కుమార్తె, వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ట్విటర్ వేదికగా స్పందించారు. "ప్రజాసేవ కోసం నిబద్ధతతో పనిచేసిన కాంగ్రెస్ నేత వైఎస్సార్. చివరి క్షణం వరకు ఆయన ప్రజాసేవలోనే గడిపారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశానికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వైఎస్సార్ విశ్వసించారు. నాడు వైఎస్ అమలు చేసిన పథకాలే ఈ రోజుకూ దేశవ్యాప్తంగా సంక్షేమ పాలనకు మార్గదర్శకాలుగా నిలుస్తున్నాయి. వైఎస్సార్ పట్ల ఎంతో ప్రేమాభిమానాలతో స్పందించిన రాహుల్ గాంధీకి నా కృతజ్ఞతలు.

వైఎస్సార్ జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకున్నందుకు ధన్యవాదాలు. ఆయనను ఇంకా మీ గుండెల్లో పెట్టుకున్నందుకు థాంక్యూ సర్" అని రాహుల్ గాంధీకి షర్మిల కృతజ్ఞతలు తెలిపారు.




దిల్లీ: ఏసీ ఛైర్ కార్, ఎగ్జిక్యూటివ్ క్లాస్ టికెట్ ధరలపై రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఆయా తరగతులు కలిగిన అన్ని రైళ్లలో టికెట్ ధరపై 25 శాతం వరకు డిస్కౌంట్ ఇచ్చేందుకు నిర్ణయించింది. వందేభారత్ సహా అనుభూతి, విస్టాడోమ్ కోచ్‌లు కలిగిన రైళ్లకూ ఇది వర్తిస్తుంది. ఆక్యుపెన్సీ ఆధారంగా టికెట్ ధరలపై ఈ డిస్కౌంట్ ఇవ్వనున్నారు. ఆక్యుపెన్సీ పెంచే లక్ష్యంతో రైల్వే బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. టికెట్ ధరలను నిర్ణయించే అధికారం ఆయా రైల్వే జోన్లలో ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌కు కట్టబెట్టింది. దేశవ్యాప్తంగా వందే భారత్ రైళ్లు విరివిగా అందుబాటులోకి వస్తున్నాయి. కొన్ని రూట్లలో ఆదరణ బాగానే ఉన్నప్పటికీ.. మరికొన్ని రూట్లలో మాత్రం టికెట్ ధరలు అధికంగా ఉన్న కారణంగా ఆక్యుపెన్సీ తక్కువగా ఉంటోంది. దీనికి తోడు ఎండలు తగ్గి వర్షాలు కూడా పడుతుండడంతో ఏసీ బోగీల్లో.. ముఖ్యంగా ఛైర్‌కార్లలో ప్రయాణానికి ఆశించిన మేర ప్రయాణికుల నుంచి డిమాండ్ ఉండకపోవచ్చు. ఈ నేపథ్యంలో రైల్వే బోర్డు కొత్త పథకంతో ముందుకొచ్చింది. అనుభూతి, విస్టాడోమ్ కోచ్‌లు కలిగిన రైళ్లు సహా ఏసీ ఛైర్ కార్, ఎగ్జిక్యూటివ్ తరగుతులు కలిగిన అన్ని రైళ్లకూ ఈ స్కీమ్ వర్తిస్తుందని రైల్వే బోర్డు తెలిపింది. డిస్కౌంట్ అనేది బేసిక్ ఫేర్‌లో గరిష్ఠంగా 25 శాతం వరకు ఇవ్వనున్నారు. రిజర్వేషన్, సూపర్ ఫాస్ట్ సర్‌ఛార్జి, జీఎస్టీ వంటి ఇతర ఛార్జీలు మాత్రం అదనంగా వర్తిస్తాయి. గడిచిన 30 రోజుల్లో 50 శాతం కన్నా తక్కువ ఆక్యుపెన్సీ కలిగిన రైళ్లను పరిగణనలోకి తీసుకోవచ్చని పేర్కొంది. డిస్కౌంట్ నిర్ణయించే ముందు ప్రత్యామ్నాయ రవాణా సదుపాయాలను సైతం పరిగణనలోకి తీసుకోనున్నారు. ఆక్యుపెన్సీని బట్టి రైలు ప్రయాణించే మొత్తం దూరానికి, లేదా ఎంపిక చేసిన స్టేషన్ల మధ్య కూడా ప్రయాణానికి డిస్కౌంట్ వర్తింపజేయొచ్చని తెలిపింది. డిస్కౌంట్ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని, ఇప్పటికే బుక్ చేసుకున్న వారికి ఇది వర్తించదని తెలిపింది. హాలిడే, ఫెస్టివల్ స్పెషల్ రైళ్లకు ఈ స్కీమ్ వర్తించదని రైల్వే బోర్డు స్పష్టంచేసింది.

# సీఎం జగన్‌పై కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు ఆసక్తికర వ్యాఖ్యలు

విజయనగరం: ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై టీడీపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టీడీపీ బస్సు యాత్రలో పాల్గొన్న అశోక్‌గజపతిరాజు జగన్ గురించి ప్రస్తావిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "చంచల్ గూడ జైలు నుంచి ఉత్తర కోస్తా జిల్లాలకు జగన్ రెడ్డి ట్రాన్స్‌ఫర్ పెట్టుకున్నారట.!. జైల్లో చిప్ప కూడున్న తిన్న దొంగను మనం ఆంధ్రాకు ముఖ్యమంత్రిని చేసేశాం. అభివృద్ధి చేసేశాం అని చెబుతున్న వైసీపీ నేతల చేష్టలు ఏంటో మనకు తెలియవా.!" అని అశోక్‌గజపతిరాజు విమర్శించారు. ఆర్థిక నేరాలకు పాల్పడి, పదహారు నెలలు జైల్లో మగ్గిన దొంగను ముఖ్యమంత్రి చేసిన రాష్ట్ర ప్రజలంతా నేడు నరకాన్ని చూస్తున్నారని కేంద్ర మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు పూసపాటి అశోక్‌గజపతిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క చాన్స్ అంటూ తండ్రి ఫొటోను అడ్డం పెట్టుకుని వచ్చిన ఆయన నేడు అన్నివర్గాల ప్రజలకు నరకం చూపిస్తున్నారని అన్నారు. భవిష్యత్‌కు గ్యారెంటీ బస్సుయాత్ర తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ సారథ్యంలో రాజాంలో శుక్రవారం మొదలైంది. కార్యక్రమంలో అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పైన, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపైనా నిప్పులు చెరిగారు. బెయిల్‌పై చంచల్‌గుడా జైలు నుంచి వచ్చిన ఆయన తిరిగి విశాఖ జైలుకు వెళ్లేందుకు సమయం ఆసన్నమైందన్నారు. కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తామన్న జగన్‌రెడ్డి మోదీ కాళ్లముందు మెడలు వంచడం ద్వారా తెలుగుజాతి గౌరవాన్ని మంటకలుపుతున్నారని విమర్శించారు. ప్రశ్నించే ధైర్యం ఆయనతో పాటు మంత్రులకూ లేదన్నారు. కేసులకు భయపడొద్దని, రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమేనని కార్యకర్తలు, నాయకులు, ప్రజలకు ధైర్యాన్నిచ్చారు.

# వారే బరిలో దిగితే.. ఓటమి ఖాయం.. వైసీపీ గేరు మారుస్తోందా?



అమరావతి : ఏపీ అధికార పార్టీ వైసీపీ గేరు మారుస్తోందా? ఇప్పటి వరకు జరిగింది.. ఒక ఎత్తయితే.. ఇక ఎన్నికల వేడి పెరిగిన నేపథ్యంలో మరింత జాగ్రత్తగా అడుగులు వేయాలని భావిస్తోందా? అంటే.. తాజాగా మారుతున్న పరిణామాలను గమనిస్తున్నవారు ఔననే అంటున్నారు. ఇప్పటి వరకు ఐప్యాక్.. ఇతరత్రా సంస్థలు అందించిన నివేదికల ఆధారంగా 15 నుంచి 20 మంది ఎమ్మెల్యేలను పక్కన పెట్టాలని వైసీపీ అధిష్టానం నిర్ణయించినట్టుగా వార్తలు వచ్చాయి. అయితే.. ఇప్పుడు మరింత మందిని పక్కన పెట్టాలనే వ్యూహాన్ని వైసీపీ తెరమీదికి తెచ్చిందని భావిస్తు న్నారు. టీడీపీ నుంచి పోటీ చేసి.. వరుస పరాజయాలు పొందుతున్న నియోజకవర్గాల్లో గెలిచిన వైసీపీ నేతలను కూడా కూడా పక్కన పెట్టాలని తాజాగా నిర్ణయించినట్టు చెబుతున్నారు. అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఉన్న నియోజకవర్గాలతో పాటు.. టీడీపీకి సింపతీ పెరిగిన నియోజకవర్గాల్లోనూ.. మార్పులు చేయాలని వైసీపీ నిర్ణయించినట్టు సమాచారం. ఉదాహరణకు.. కురుపాం పాలకొండ నెల్లూరు సిటీ సహా దాదాపు 20 నియోజకవర్గాల్లో వైసీపీ నాయకులు వరుస విజయాలు దక్కించుకుంటున్నారు. దీంతో సహజంగానేవారిపై కొంత వ్యతిరేకత ఉంది. దీనికి తోడు..ఇదే స్థానాల్లో వరుస ఓటములు చవిచూసిన.. టీడీపీ నేతలకు.. సింపతీ పెరిగింది. వీరంతా కూడా.. ఆయా నియోజకవర్గాల్లో తిరుగుతూ.. "ఇప్పటికి రెండు సార్లు వైసీపీ నేతలను గెలిపించారు. ఇప్పుడు ఒక్క ఛాన్స్ మాకివ్వండి" అంటూ.. ప్రజలను కోరుతున్నారు. దీంతో ప్రజల్లో టీడీపీ ఓటమి నేతలపై సింపతీ పెరిగింది. ఈ క్రమంలో వారికి ఒక్క ఛాన్స్ ఇచ్చే దిశగా ఆ యా నియోజకవర్గాల్లో పరిణామాలు మారుతున్నాయని గ్రహించిన టీడీపీ అధినేత చంద్రబాబు వారికే టికెట్లు కన్ఫర్మ్ చేస్తున్నారు. పాలకొండలో నిమ్మక జయకృష్ణ కురుపాంలో జగదీశ్వరి నెల్లూరు సిటీలో పొంగూరు నారాయణ వంటి వారికి టికెట్లు కన్ఫర్మ్ చేశారు. వీరంతా విజయం దక్కించుకుంటారని చంద్రబాబు కూడా విశ్వసిస్తున్నారు. ఈ పరిణామాలను గమనిస్తున్న వైసీపీ రెండు సార్లు వరుసగా విజయం దక్కించుకుని.. ప్రజల్లో సానుభూతి కొరవడిన నాయకులను కూడా తప్పించా లని.. టీడీపీకి ఛాన్స్ ఇవ్వకుండా.. వ్యూహం వేయాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. ఫలితంగా 20 నియోజకవర్గాల్లోకొత్త వారికి లేదా.. తొలిసారి పోటీ చేసేవారికి అవకాశం ఇచ్చే ఛాన్స్ ఉందని తెలుస్తోంది. మరి ఏం చేస్తారో చూడాలి.

# టార్గెట్ అనిల్.. టీడీపీకి లాభమెంత? నష్టమెంత?



నెల్లూరు : సిటీ నియోజకవర్గంలో మాజీ మంత్రి అనిల్కుమార్ యాదవ్ పై టీడీపీ యువనాయకుడు మాజీ మంత్రి నారా లోకేష్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. అనిల్ అవినీతికి పాల్పడ్డా రని.. నెల్లూరు జిల్లాలోనూ.. ఇతర ప్రాంతాల్లోనూ అక్రమ సొమ్ముతో మేడలు కట్టారంటూ.. కొన్ని రికార్డులు కూడా తన దగ్గర ఉన్నాయని నారా లోకేష్ చెప్పుకొచ్చారు. ఇక దీనికి కౌంటర్గా అనిల్కూడా రెచ్చిపోయా రు. దైవసాక్షిగా అంటూ.. తనకు నెల్లూరుకు ఆవల ఎక్కడా కూడా.. ఎలాంటి ఆస్తులు లేవన్నారు. ఈ క్రమంలో ఇరు పక్షాల మధ్యసవాళ్ల రాజకీయం కూడా సాగింది. అయితే.. ఇది టీడీపీకి ఎంత వరకు లా భం చేకూరుస్తుంది.. అనేది ఆసక్తిగా మారింది. నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్రలో అనేక మంది నాయకుల పై తీవ్రవిమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే అనిల్ పైనా చేశారు. అయితే.. ఇతర నేతలు.. ఎవరూ ఇలా ముందుకు వచ్చి ప్రతివిమర్శలు సవాళు చేసిన వారు పెద్దగా లేరుకానీ.. అనిల్ మాత్రం తీవ్రస్థాయిలో రియాక్ట్ అయ్యారు. అంటే.. ఒకరకంగా.. నెల్లూరు సిటీలో ఉన్న టాక్నే నారా లోకేష్ చెప్పినట్టుగా భావించాల్సి వస్తోందని టీడీపీ నాయకులు అంటున్నారు. ఈ క్రమంలోనే ఆయన వివరణ ఇచ్చారని చెబుతున్నారు. అయితే.. ఇప్పుడు ఎవరు అవినీతి చేశారు.. ఎవరు చేయలేదు.. అనేది పక్కన పెడితే.. నెల్లూరు సిటీలో టీడీపీ పుంజుకునే మార్గం పైనే ఎక్కువగా దృష్టి పెట్టాలని టీడీపీ నేతలు చెబుతున్నారు. తవ్వుకుంటూ పోతే.. ఇవి ఎక్కడా ఆగబోవని కూడా చెబుతున్నారు. అనిల్కుమార్ యాదవ్ ఇక్కడ నుంచి వరుస విజయాలు సాధించారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్నా.. నియోజకవర్గానికి ఒరిగింది ఏమీలేదు. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. వీటిని ప్రధానంగా నారా లోకేష్ ఎత్తి చూపి.. విమర్శలు చేసి ఉంటే బాగుండేదని.. మెజారిటీ నాయకులు అభిప్రాయపడుతున్నా రు. ఇక యూత్లో అనిల్ కు ఉన్న ఫాలోయింగ్ను తగ్గించే ప్రయత్నం చేసేందుకు ప్రయత్నించాలని కూడా చెబుతున్నారు. మధ్యతరగతి ప్రజల్లో అనిల్పై వ్యతిరేకత ఉందని.. దానిని తమకు అనుకూలంగా మార్చుకుంటే సరిపోతుందని మెజారిటీ నాయకులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో అవినీతి ని ఎత్తి చూపినా.. దానిని ఎంత మంది పట్టించుకుంటారనేది వారి సందేహం.

ఏదేమైనా.. నారాలోకేష్ చేసిన ప్రయత్నం బాగానే ఉన్నా.. ఓట్లరూపంలో మారాలంటే క్షేత్రస్థాయిలో బాగా కష్టపడాల్సిన అవసరం ఉందని సీనియర్లే చెబుతున్నారు.

# బీజేపీ కావాలి కానీ... ఒకే ఆలోచనలో వైసీపీ టీడీపీ ...?



అమరావతి : భారతీయ జనతా పార్టీకి ఏపీ లో పెద్దగా ఓట్ల బలం లేదు. అది నానాటికీ అడుగంటిపోతోంది. 2019 తరువాత వరసగా జరిగిన లోకల్ బాడీస్ ఎన్నికలు ఉప ఎన్నికల్లో కూడా పెద్దగా ఓట్లు వచ్చింది లేదు. ఈ రోజుకి కూడా ఏపీ లో బీజేపీ ఓటు షేర్ వన్ పెర్సెంట్ కి తక్కువ ఉంటుందా అన్నదే చర్చకు వస్తోంది. ఇక బీజేపీ అంటే నరేంద్ర మోడీ. ఆయన ఇమేజ్ కూడా తోడు గా ఉంటుంది. ఎక్కడైనా కానీ ఏపీ లో బీజేపీకి మోడీ ఇమేజ్ పని చేయదు సరికదా ఏపీ కి కేంద్రం అన్యాయం చేసింది అన్న కోపం అయితే జనాల్లో ఉంది. ఇక కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్ళుగా తీసుకున్న నిర్ణయాల లో కొన్నింటికి దేశం లోని ఇతర రాష్ట్రాల లో మాదిరిగా ఏపీ జనాలు పూర్తి వ్యతిరేకతతో ఉన్నారు. బీజేపీకి ఉన్న ఈ నెగిటివిటీ ని పొత్తు పార్టీలు కూడా మోయాల్సి ఉంటుందన్న భయం ఇపుడు ఉంది. ఇక వైసీపీ అయితే పొత్తులు లేవని తెలివి గా తప్పించుకుంది అంటున్నారు. ఇటీవల వైసీపీ పెద్దల ను ఎన్డీయే లో చేరాల ని కేంద్ర బీజేపీ పెద్దలు అడిగారు అని ప్రచారంలో ఉంది. దానికి సున్నితంగానే వైసీపీ నో చెప్పింది అని అంటున్నారు. తాము తెర వెనక మద్దతు ఇస్తామని ప్రత్యక్షంగా తాము పొత్తు కలపలేమని చెప్పినట్లుగా అంటున్నారు ఇక తెలుగుదేశం వైపు కూడా బీజేపీ చూస్తోంది అని మరో ప్రచారం. ఎన్డీయే లో పాత్ర మిత్రుడి గా టీడీపీ ఉంది. అయితే కర్నాటక ఎన్నికల ముందు వరకూ బీజేపీ తో పొత్తు అని ఉర్రూతలూగిన టీడీపీ లో ఇపుడు సడెన్ గా మార్పు కనిపిస్తోంది అని అంటున్నారు. డైరెక్ట్ గా పొత్తు పెట్టుకుంటే తమకు ఏపీ లో బిగ్ డ్యామేజ్ అవుతుంది అని కూడా భయపడుతున్నట్లుగా చెబుతున్నారు. ముఖ్యంగా ఎస్సీ ఎస్టీ మైనారిటీ ఓట్లు దెబ్బ తింటాయన్న కలవరం ఉందిట. అదే టైం లో మోడీ ఇమేజ్ కూడా కర్నాటక ఎన్నికల్లో పనిచేయలేదని ఇపుడు ఏపీ లో కూడా అదే జరిగితే పొత్తు ఉన్నా ఇబ్బంది తప్ప లాభం ఉండదన్న ఆలోచనలు కూడా పసుపు శిబిరం లో ఉన్నాయని అంటున్నారు. అయితే కేంద్రం లో బీజేపీ ఉంది. కాబట్టి ఎన్నికల వేళ ఎలక్షనీరింగ్ కి పోల్ మేనేజ్ మెంట్ కి ఆ పార్టీ అండ దన్ను కావాలన్న ఆశలు అయితే టీడీపీ లో ఉన్నాయని అంటున్నారు. కేంద్రం సహకారం ఉంటే తాము ఎన్నికల్లో దూసుకుపోవచ్చు అని ఫండింగ్ పెద్ద ఎత్తున పెట్టేందుకు వచ్చే వారిని కూడా కలుపుకుని పోవచ్చు అని భావిస్తోందిట. ఇలా మీతో మేము ఉంటామని తెర వెనక బంధాన్ని మాత్రమే ఉంచుకోవాల ని టీడీపీ కూడా ఆలోచిస్తుంది అని అంటున్నారు. అంటే వైసీపీ మాదిరిగా టీడీపీ కూడా బీజేపీ తో బాహాటంగా అంటకాగకుండా ఇండైరెక్ట్ గా సపోర్టుని కోరుకుంటోందని అంటున్నారు. మరి ఇలా రెండు బలమైన ప్రాంతీయ పార్టీలు బీజేపీ ని టచ్ మీ నాట్ అంటూ ఏపీ లో ఉంటే బీజేపీ చూస్తూ ఊరుకుంటుందా అన్నదే చర్చకు వస్తోంది. బీజేపీకి ఏపీ లో కాలూనాల్సిన అవసరం ఉంది. అందుకే ఆ పార్టీ జనసేన తో పొత్తు పెట్టుకుంది. ఇక వైసీపీ టీడీపీల లో ఒక పార్టీతో కలసి ఎన్నికలకు పోవాల ని చూస్తోందని అంటున్నారు. ఈ రెండు పార్టీలు నో అంటే బీజేపీ ప్లాన్స్ ఎలా ఉంటాయో అన్న చర్చ అయితే ఉంది. చూడాలి మరి కమలనాధులు ఏపీ మీద ఏ రకమైన స్ట్రాటజీని ఉపయోగిస్తారో ఏ విధంగా ముందుకు సాగుతారో.

# అశోక్‌గజపతిరాజు వ్యాఖ్యలకు బొత్స కౌంటర్

విజయనగరం: ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై కేంద్ర మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు పూసపాటి అశోక్‌గజపతిరాజు చేసిన వ్యాఖ్యలకు మంత్రి బొత్స సత్యనారాయణ కౌంటర్ ఇచ్చారు.

"అశోక్ వ్యాఖ్యలపై బొత్స తత్వ హితబోధలు చేశారు. సమాజానికే మేం అంకితం. సమాజం ఆలోచననే మేం అమలు చేస్తున్నాం. మాలో వ్యక్తిగతాలు ఉండవు. మాట్లాడేటప్పుడు వెనుకా ముందూ ఆలోచించి మాట్లాడాలి. మాకు వ్యక్తిగత ద్వేషాలు ఉండవు. మా ముఖ్యమంత్రిది కూడా ఇదే పద్ధతి." అని అశోక్‌గజపతిరాజు వ్యాఖ్యలకు మంత్రి బొత్స సత్యనారాయణ కౌంటర్ ఇచ్చారు.

**జగన్‌పై అశోక్‌గజపతిరాజు వ్యాఖ్యలు..** టీడీపీ బస్సు యాత్రలో పాల్గొన్న అశోక్‌గజపతిరాజు జగన్‌మోహన్ రెడ్డి గురించి ప్రస్తావిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "చంచల్ గూడ జైలు నుంచి ఉత్తర కోస్తా జిల్లాలకు జగన్ రెడ్డి ట్రాన్స్‌ఫర్ పెట్టుకున్నారట.!. జైల్లో చిప్ప కూడున్న తిన్న దొంగను మనం ఆంధ్రాకు ముఖ్యమంత్రిని చేసేశాం. అభివృద్ధి చేసేశాం అని చెబుతున్న వైసీపీ నేతల చేష్టలు ఏంటో మనకు తెలియవా.!" అని అశోక్‌గజపతిరాజు విమర్శించారు. ఆర్థిక నేరాలకు పాల్పడి, పదహారు నెలలు జైల్లో మగ్గిన దొంగను ముఖ్యమంత్రి చేసిన రాష్ట్ర ప్రజలంతా నేడు నరకాన్ని చూస్తున్నారని కేంద్ర మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు పూసపాటి అశోక్‌గజపతిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క చాన్స్ అంటూ తండ్రి ఫొటోను అడ్డం పెట్టుకుని వచ్చిన ఆయన నేడు అన్నివర్గాల ప్రజలకు నరకం చూపిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పైన, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపైనా నిప్పులు చెరిగారు. బెయిల్‌పై చంచల్‌గుడా జైలు నుంచి వచ్చిన ఆయన తిరిగి విశాఖ జైలుకు వెళ్లేందుకు సమయం ఆసన్నమైందన్నారు. కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తామన్న జగన్‌రెడ్డి మోదీ కాళ్లముందు మెడలు వంచడం ద్వారా తెలుగుజాతి గౌరవాన్ని మంటకలుపుతున్నారని విమర్శించారు. ప్రశ్నించే ధైర్యం ఆయనతో పాటు మంత్రులకూ లేదన్నారు. కేసులకు భయపడొద్దని, రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమేనని కార్యకర్తలు, నాయకులు, ప్రజలకు ధైర్యాన్నిచ్చారు.

## మిలమిల మెరిసే మగువా.. నువ్వు మేనక చెల్లెలివా..!

మలయాళ భామ కళ్యాణి ప్రియదర్శన్ సెలెక్టెడ్ సినిమాలు చేస్తూ ప్రేక్షకులను మెప్పిస్తుంది. హీరోయిన్స్ కి ఒక్కొక్కరికి ఒక్కో సెపరేట్ స్టైల్ ఉంటుంది. కొందరు కేవలం నటన మీద దృష్టి పెడితే ఆడియన్స్ మనసులు గెలిచేందుకు గ్లామర్ తో కూడా ప్రేక్షకులను మెప్పించే వారు కొందరు. సినిమాల సెలక్షన్ లో తన స్పెషాలిటీ చూపిస్తున్న కళ్యాణి ప్రియదర్శన్ సినిమాలతో పాటు ఫోటో షూట్స్ తో కూడా అలరిస్తుంది. తెలుగులో హలో చిత్రలహరి రెండు సినిమాలతో ఇక్కడ ఆడియన్స్ ని అలరించిన కళ్యాణి ప్రియదర్శన్ ఆ



తర్వాత మళ్లీ తెలుగులో మరో సినిమా చేయలేదు. సొంత భాష మలయాళంలో వరుస సినిమాలు చేస్తున్న అమ్మడు తమిళ్ లో శివకార్తికేయన్ హీరోగా వచ్చిన హీరో సినిమాలో నటించింది. ఆ తర్వాత యాంథాలజీగా వచ్చిన పుథుం పుదు కాలై వెబ్ సీరీస్ లో నటించింది కళ్యాణి ప్రియదర్శన్. శింబు హీరోగా వచ్చిన మానాడు సినిమాలో కూడా నటించింది కళ్యాణి ప్రియదర్శన్. ఆ తర్వాత 3 ఏళ్ల గ్యాప్ తో మరో తమిళ సినిమా ఓకే చేసింది కళ్యాణి ప్రియదర్శన్. జయం రవి హీరోగా వస్తున్న సినిమాలో కళ్యాణి ప్రియదర్శన్ హీరోయిన్ గా ఫిక్స్ అయ్యింది. ఈ సినిమాలో కృతి శెట్టి కూడా స్క్రీన్ షేర్ చేసుకుంటుంది. జినీ టైటిల్ తో వస్తున్న ఈ సినిమా ఓపెనింగ్ రోజు శారీ లుక్స్ తో సర్ ప్రైజ్ చేసింది కళ్యాణి ప్రియదర్శన్. తన క్యూట్ లుక్స్ తో ప్రేక్షకులను తన మాయలో పడేస్తున్న అమ్మడు శారీ లుక్స్ తో మరింత మెరిసిపోతుంది. కళ్యాణి ప్రియదర్శన్ లేటెస్ట్ శారీ ఫోటోలు తన సోషల్ మీడియాలో షేర్ చేసింది. లైట్ బ్లూ కలర్ శారీ.. మ్యాచింగ్ బ్లౌజ్ తో తన శారీ లుక్స్ తోనే సూపర్ అనిపించేస్తుంది కళ్యాణి. ఈ ఫోటోలు చూసిన ఆమె ఫాలోవర్స్ అంతా కూడా కళ్యాణి కేరాఫ్ క్యూట్ లుక్స్ అంటూ కామెంట్ చేస్తున్నారు. ఫోటో షూట్ అంటే శృతిమించిన గ్లామర్ షో చేయడం కామన్ కానీ కళ్యాణి మాత్రం తన బోర్డర్స్ ని క్రాస్ చేయకుండా మెప్పిస్తూ వస్తుంది. తనకు ఇచ్చిన పాత్రకు న్యాయం చేస్తూ ఆడియన్స్ హృదయాలను గెలిచేస్తున్న కళ్యాణి ప్రియదర్శన్ మలయాళంలో వరుస హిట్లతో దూసుకెళ్తుండగా అమ్మడికి మిగతా భాషల నుంచి కూడా మంచి అవకాశాలు వస్తున్నాయి. జయం రవి తో చేస్తున్న జినీ సినిమాను నూతన దర్శకుడు అర్జునన్ జె.ఆర్ డైరెక్ట్ చేస్తున్నారు. ఈ సినిమా లో తన పాత్ర చాలా స్పెషల్ గా ఉంటుందని చెబుతుంది కళ్యాణి.

## హీరోల వయసుతో సంబంధం లేదంటున్న శృతి హాసన్..!

కమల్ గారాల పట్టి శృతి హాసన్ ప్రస్తుతం తెలుగులో మళ్లీ ఫామ్ లోకి వచ్చింది. కెరీర్ మొదట్లో వరుస ప్లాపులతో ఐరన్ లెగ్ ముద్ర వేసుకున్న అమ్మడు పవన్ కళ్యాణ్ గబ్బర్ సింగ్ తో సూపర్ హిట్ అందుకుంది. ఇక అక్కడ నుంచి వరుస స్టార్ సినిమాలు చేస్తూ సూపర్ పాపులర్ అయ్యింది శృతి హాసన్. తనకు హీరోయిన్ గా స్టార్ ఇమేజ్ వచ్చింది తెలుగు సినిమాల వల్లే అంటూ రీసెంట్ ఓ స్పెషల్ చిట్ చాట్ లో చెప్పుకొచ్చింది శృతి హాసన్. అందుకే తెలుగు పరిశ్రమ మీద విశ్వాసంగా ఉంటానని అంటుంది శృతి హాసన్. అంతేకాదు కథ నచ్చితే హీరోల వయసు గురించి పట్టించుకోను.. చిరంజీవి గారితో చేసిన వాల్తేరు వీరయ్య బాలకృష్ణ గారితో చేసిన వీర సింహా రెడ్డి ఈ రెండు సినిమాలు కథ నచ్చబట్టే చేశానని అలాగే



ఆ రెండు సినిమాలు పెద్ద హిట్ అయ్యానని అన్నారు శృతి హాసన్. ప్రస్తుతం ది ఐ అనే హాలీవుడ్ సినిమాతో పాటుగా ప్రభాస్ తో సలార్ సినిమా చేస్తున్నానని చెప్పుకొచ్చారు. ప్రశాంత్ నీల్ టేకింగ్ ఒక లెవల్ లో ఉంటుంది. అయితే ఆ సినిమా గురించి తాను ఇప్పుడు ఎక్కువగా చెప్పలేనని అన్నారు శృతి హాసన్. తొలి సినిమా హిందీలో చేశా.. నాన్న కమల్ హాసన్ బ్యానర్ లో రాజ్ కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ లో హీరోయిన్ గా ఛాన్స్ ఇస్తే చేస్తానని అన్నారు. సినిమాల్లో ప్రత్యేకంగా జీవిత లక్ష్యమేమి లేదని.. సొంత కాళ్లపై ధైర్యంగా నిలబడటమే ముఖ్యమని అన్నారు. జీవితంలో పెళ్లి ఒక భాగం మాత్రమే అదే జీవితం కాదని అన్నారు శృతి హాసన్. డిప్రెషన్ తో బాధపడుతున్న వారికి కౌన్సిలింగ్ అనేది బాగా అవసరం.. అలాంటి బాధితులు కూడా తమ బాధలను బహిరంగంగా వ్యక్తపరచాలి.. వారి కోసం ఒక సంస్థను ఏర్పాటు చేస్తున్నానని అన్నారు శృతి హాసన్.




## తమన్నా హాటు అనిరుధ్ బీటు.. పాట పర్ఫెక్ట్!




కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన జైలర్ సినిమా ఆగస్టు లో విడుదల కాబోతోంది. బీస్ట్ దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో తెర పైకి రాబోతున్న ఈ సినిమా పై హై రేంజ్ లో అయితే అంచనాలు లేవు కానీ రజనీకాంత్ కాస్త కొత్తగా కనిపిస్తూ ఉండడంతో ఓ వర్గం ప్రేక్షకులు అయితే ఈ సినిమా సక్సెస్ అవుతుంది అని నమ్మకంతో ఉన్నారు. ఇక తలైవా బాక్సాఫీస్ వద్ద గట్టి సక్సెస్ చూసి చాలా కాలం అయింది. ఇక ఈ సినిమా తో ఎలాగైనా మంచి సక్సెస్ అందుకోవాలి అని ఎదురు చూస్తున్నాడు. ఇక జైలర్ సినిమా కు సంబంధించిన రెగ్యులర్ ప్రమోషన్స్ స్టార్ట్ చేసేసారు.

ఇప్పటికే ఫస్ట్ లుక్ పోస్టర్ మంచి పాజిటివ్ వైబ్రేషన్స్ అయితే క్రియేట్ చేశాయి. ఒక డిఫరెంట్ కథతో రజినీకాంత్ రాబోతున్నట్లు అర్థమవుతుంది. అయితే రీసెంట్ గా ఈ సినిమా లోని 'కావాలా' అనే పాట ను కూడా విడుదల చేశారు. ఇక అనిరుద్ స్వరపరచిన బాణీలు మరోసారి అబ్బుర పరిచాయి. దానికి తోడు పాట లో తమన్నా గ్లామరస్ లుక్స్ కూడా మరో లెవెల్ లో ఉన్నాయి. మిల్కీ బ్యూటీ తమన్నా స్టైలిష్ అందాల తో అదిరిపోయే స్టెప్పు లతో ఎంతగానో ఆకట్టుకుంది. ఒకవైపు అనిరుద్ మ్యూజిక్ తమన్నా ఘాటైన స్టెప్పులు కుర్రాళ్లను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇక టాలీవుడ్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ ఈ పాట కు కొరియోగ్రఫీ ని అందించారు. ఇక తలైవ రజనీకాంత్ మాత్రం ఇందు లో ఎక్కువగా హైలైట్ కాలేదు. కేవలం ఆయన తరదైన శైలి లో స్టిల్స్ ఇచ్చారు. కానీ అక్కడ ఎక్కువగా తమన్నా తన స్టెప్పు లతో ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. ఈ తమిళ పాట అయినప్పటికీ కూడా కాస్త తెలుగు పదాల కు దగ్గరగా ఉండేలా ఈ పాట అర్థం వస్తోంది. ఏది ఏమైనా కూడా సాంగ్ మాత్రం క్లిక్ అయ్యేలా కనిపిస్తోంది. ఇక ఈ సినిమా ను ఆగస్టు 10వ తేదీన గ్రాండ్ గా విడుదల చేయబోతున్నారు. సన్ పిక్చర్స్ నిర్మించిన ఈ సినిమా లో రజనీకాంత్ నెవ్వర్ బిఫోర్ అనే పాత్ర లో కనిపించబోతున్నట్లుగా తెలుస్తోంది. తప్పకుండా ఆయన కెరీర్ లో ఒక డిఫరెంట్ సినిమా మంచి సక్సెస్ అవుతుందని కూడా చెబుతున్నారు. మరి సినిమా ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.

## పిక్ టాక్ : 'ఓరి దేవుడా' ఏంటి ఈ అందం



విశ్వక్ సేన్ హీరోగా వెంకటేష్ కీలక పాత్రలో నటించిన ఓరి దేవుడా సినిమా లో మిథిలా పాల్కర్ హీరోయిన్ గా నటించి తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన విషయం తెల్సిందే. చూడడానికి క్యూట్ గా చిన్నగా అనిపిస్తున్న ఈ అమ్మడి అందాల ఆరబోత ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తూ వైరల్ అవుతున్నాయి. ఈ అమ్మడు సినిమాలు.. సిరీస్ లు ఇంకా టీవీ షో లు చేయడం ద్వారా ఉత్తర భారతంలో మంచి పాపులారిటీని సొంతం చేసుకుంది. ఈమె కమర్షియల్ యాడ్స్ లో కూడా కనిపించడం ద్వారా చాలా మందికి సుపరిచితురాలు అయ్యింది.

ఇప్పుడు ఇలా అందాల ఆరబోత చేయడం వల్ల మరింతగా ఆకట్టుకుంటుంది. ఈ అమ్మడి యొక్క క్లీవేజ్ షో మరియు నడుము అందం చూపిస్తున్న ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ రేంజ్ లో అందాల ఆరబోత చేస్తున్న మిథిలా పాల్కర్ ను తెలుగు లో మరిన్ని సినిమాల్లో చూడాలని కొందరు అనుకుంటూ ఉంటే.. స్టార్ హీరోయిన్ అయ్యే ఫీచర్స్ ఉన్నాయి అన్నట్లుగా కామెంట్స్ చేస్తున్నారు. 2014 లో మరాఠీ షార్ట్ ఫిల్మ్ తో అందరి దృష్టిని ఆకర్షించిన మిథిలా ఆ తర్వాత హిందీ సినిమా లు మరియు సిరీస్ లతో మెప్పించింది.

ఆ తర్వాత కమర్షియల్ యాడ్స్ తో అలరించింది. ఇప్పుడు తెలుగు సినిమాల్లో బిజీ అయ్యేందుకు ప్రయత్నిస్తోంది. ఇలాంటి అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తే కచ్చితంగా ముందు ముందు ఈ అమ్మడి కి బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

## అందంతో కట్టిపడేస్తున్న స్పై పిల్ల

టాలెంటెడ్ యంగ్ హీరో నిఖిల్ ఇటీవల స్పై మూవీ తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ మూవీ లో ఎక్కువ మంది సినిమా లో కంటెంట్ కన్నా కూడా హీరోయిన్ కి ఎక్కువ ఫిదా అయిపోయారు. మూవీ ఫలితం ఎలా ఉన్నా ఈ బ్యూటీకి మాత్రం ఫ్యాన్స్ పెరిగిపోయారు. ఆమే ఐశ్వర్యా మేనన్. తన అందంతో అందరనీ ఆకర్షించింది. ఈ బ్యూటీ డైరెక్ట్ తెలుగు సినిమా ఇదే అయినప్పటికీ గతం లోనూ ఓ సినిమా తో తెలుగు ప్రేక్షకుల ను పలకరించింది. లవ్ ఫెయిల్యూర్ అనే అనువాద చిత్రం తో ఆమె తెలుగు తెరకు పరిచయం అయ్యారు. అయితే ఆ మూవీ పెద్దగా



ఆకట్టుకోకపోవడంతో ఆమెకు మళ్లీ టాలీవుడ్ లో కనిపించలేదు. మళ్లీ చాలా కాలం తర్వాత స్పై లో మెరిసింది. అయితే ఆమెకు తెలుగు లో ఛాన్సులు రాకపోయినాతమిళం మళయాళ సినిమాల్లో బాగానే అవకాశాలు వచ్చాయి. ఇక ఈ బ్యూటీ సోషల్ మీడియా లోనూ చాలా చురుకుగా ఉంటుంది. ఎప్పటికప్పుడు తన ఫోటోలు షేర్ చేసి ఫ్యాన్స్ ని ఊరిస్తూ ఉంటుంది. తాజాగా ఎరుపు రంగు డ్రెస్ లో మెరిసింది. ఆ డ్రెస్ లో ఆమె చాలా హాట్ గా కనిపించడం విశేషం. స్లీవ్ లెస్ డ్రెస్ లో హొయలు పోయింది. తన థైస్ క్లియర్ గా కనిపించేలా షో చేసింది. ఇప్పుడు ఈ ఫోటోలు నెట్టింట ఫ్యాన్స్ ని విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఇదిలా ఉండగా ఈ బ్యూటీకి ఇటీవల మరో బంపర్ వచ్చింది. పవన్ ఓజీ లో ఆమెకు ఛాన్స్ దక్కింది. పవన్ కళ్యాణ్ హీరో గా సాహో ఫేమ్ సుజిత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న భారీ బడ్జెట్ మూవీ OG. ఈ సినిమా ను డివివి దానయ్య నిర్మిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ ను ప్రారంభించుకున్న ఈ చిత్రం 50 శాతం పూర్తయ్యింది. ఈ సినిమా లో కోలీవుడ్ హీరోయిన్ ప్రియాంక మోహన్ హీరోయిన్ గా నటిస్తున్నారు. మరో హీరోయిన్ గా ఐశ్వర్యను ఎంపిక చేశారు. ఈ ఏడాది డిసెంబర్ నెలలో OG సినిమా ను విడుదల చేయాలనేది మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తుంది.

## ఎద అందాలతో మెరిసిపోతున్న రాశిఖన్నా

టాలీవుడ్ హాట్ బ్యూటీ రాశిఖన్నా ఈ మధ్య గ్లామర్ డోస్ కాస్తా పెంచింది అని చెప్పాలి. టాలీవుడ్ లో సూపర్ సక్సెస్ అందుకున్న ఈ అమ్మడు ఫోకస్ అంతా ఇప్పుడు బాలీవుడ్ మీద ఉంది. హిందీలో రెండు సినిమాలు ఈమె చేతిలో ఉన్నాయి. ఇక ఇప్పటికే డిజిటల్ ఎంట్రీ కూడా ఇచ్చిన రాశిఖన్నా డిఫరెంట్ క్యారెక్టర్స్ తో దూసుకుపోతుంది. హీరోయిన్ గానే కాకుండా మంచి ప్రాధాన్యత ఉన్న పాత్రలకి కూడా ఒకే చెబుతుంది. రెగ్యులర్ కమర్షియల్ హీరోయిన్ ఇమేజ్ నుంచి బయటకి రావాలని ప్రయత్నం చేస్తున్న ఈ బ్యూటీ ఆ దిశగానే తన సినిమాల ఎంపిక కూడా చేసుకుంటూ ఉండటం విశేషం. రాశిఖన్నా చివరిగా తెలుగులో నాగ చైతన్య హీరోగా దిల్ రాజు ప్రొడక్షన్ లో వచ్చిన థాంక్యూ మూవీలో నటించింది. ఈ మూవీ డిజాస్టర్ అయ్యింది. తమిళంలో కార్తికి జోడీగా సర్దార్ సినిమాలో నటించింది.



ఇక ఫర్జీ అనే వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకి వచ్చింది. ఈ మూవీలో ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ గా రాశిఖన్నా నటించి మెప్పించింది. షాహిద్ కపూర్ కి జంటగా రొమాంటిక్ సన్నివేశాలలో కూడా ఈ అమ్మడు రెచ్చిపోవడం విశేషం. ఇదిలా ఉంటే హిందీలో యోద సినిమాలో ప్రస్తుతం నటిస్తుంది. ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. అలాగే తమిళంలో కూడా ఒక సినిమాలో నటిస్తుంది. ఇదిలా ఉంటే ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో రాశిఖన్నా యాక్టివ్ గా ఉంటుంది. హాట్ హాట్ ఫోటోలని రెగ్యులర్ గా ఇన్స్టాగ్రామ్ లో షేర్ చేస్తూ కుర్రాళ్ళకి చెమటలు పట్టిస్తుంది. తాజాగా ఈ అమ్మడు పింక్ విల్లా ఫ్యాషన్ ఈవెంట్ లో సందడి చేసింది. ఈ ఈవెంట్ లో పింక్ కలర్ మోడరన్ అవుట్ ఫిట్ తో మెరిసిపోయింది. ఈ కాస్ట్యూమ్స్ లో ఎద అందాలని చూపిస్తూ కుర్రాళ్ళని రాశిఖన్నా టెంప్ట్ చేస్తుంది. ఈ ఫోటోలు ప్రస్తుతం ఇన్స్టాగ్రామ్ లో వైరల్ గా మారాయి. వీటిని ఏకంగా2.30 లక్షల మంది లైక్ చేయడం విశేషం.




హైదరాబాద్: వరంగల్ పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్రమోదీ.. 9 ఏళ్లలో యువత కోసం చేసిన ఒక్క మంచిపనైనా ప్రజలకు చెప్పి ఉంటే బాగుండేదని మంత్రి కేటీఆర్ అన్నారు. వరంగల్ పర్యటనలో భాగంగా హనుమకొండ ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన విజయ సంకల్ప సభ వేదికగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ప్రధాని మోదీ తీవ్ర విమర్శలు చేశారు. ప్రధాని ప్రసంగంపై కేటీఆర్ స్పందిస్తూ ప్రతివిమర్శలు చేశారు "కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ రాష్ట్ర ప్రజల 45 ఏళ్ల కల. గుజరాత్‌కు ప్రధాని రూ. 20వేల కోట్లతో లోకోమోటివ్ ఫ్యాక్టరీ ఇచ్చారు. ఇక్కడ రూ. 520 కోట్లతో రైల్వే వ్యాగన్ రిపేర్ షాప్ పెట్టడం రాష్ట్ర ప్రజలను అవమానించడమే అవుతుంది. దేశ చరిత్రలోకే అత్యధిక నిరుద్యోగం సృష్టించిన విఫల ప్రధాని మోదీ. కేంద్రం పరిధిలో 16 లక్షల ఖాళీలను ప్రధాని మోదీ భర్తీ చేయలేదు. తెలంగాణలో 2.20 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను నింపిన మాపై విమర్శలు చేస్తున్నారు. బిల్లులను ఆమోదించకుండా వర్సిటీల్లో ఖాళీల భర్తీని గవర్నర్ ఆపుతున్నారు. బిల్లులను అడ్డుకుంటున్న గవర్నర్‌కు ప్రధాని మోదీ ఒక మాట చెబితే బాగుండేది. అడవి బిడ్డలపై ప్రధాని కపట ప్రేమ చూపిస్తున్నారు. గిరిజన విశ్వవిద్యాలయాన్ని అడ్డుకొని, అడవి బిడ్డల గురించి మాట్లాడటం ప్రధాని కపటప్రేమకు నిదర్శనం. 15 వేల మంది స్థానికులకు ఉద్యోగాలిచ్చే బయ్యారం ఫ్యాక్టరీ గురించి ఒక్క మాట కూడా ప్రధాని మాట్లాడలేదు. నల్ల చట్టాలతో 700 మంది రైతులను పొట్టనబెట్టుకున్న ప్రధాని వ్యవసాయం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది. సమగ్ర వ్యవసాయ అభివృద్ధి, రైతు సంక్షేమంలో దేశానికి ఆదర్శం, దిక్సూచి తెలంగాణ. తెలంగాణ మా కుటుంబం. రాష్ట్ర ప్రజలు మా కుటుంబ సభ్యులు. వారి అభివృద్ధికి పాటుపడుతోన్న తెలంగాణ కుటుంబ పార్టీ మాది. కేంద్ర ఏజెన్సీల బూచి చూపించి ప్రధాని చేసిన హెచ్చరికలకు మేం భయపడం. తెలంగాణకు వచ్చి ఇక్కడి ప్రభుత్వం పైన విమర్శలు చేయడం, అసత్యాలు మాట్లాడటం మోదీకి అలవాటుగా మారింది" అని కేటీఆర్ విమర్శించారు.

**సరైన సమయంలో భాజపాకు గుణపాఠం చెప్పడం ఖాయం :** "ప్రధాని మాదిరిగా అబద్ధాలు చెప్పాలంటే చాలా ధైర్యం కావాలి. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న మోదీ మాటలు ఏమయ్యాయో చెప్పాలి. తెలంగాణ వ్యవసాయ రంగం ఆహార ధాన్యాల ఉత్పత్తి నుంచి మొదలుకొని పెరిగిన విస్తీర్ణం, సాగునీటి విప్లవం, రైతు సంక్షేమ పథకాల వరకు ప్రతి అంశంలోనూ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. ఈ విషయాన్ని ప్రధాని తెలుసుకుంటే బాగుంటుంది. కార్పొరేట్ మిత్రులకు 12.5 లక్షల కోట్లు రుణాలు మాఫీ చేసిన మోదీ.. దేశంలోని రైతుల రుణాలన్నింటినీ మాఫీ చేసే అవకాశం ఉన్నా, ఎందుకని ఇప్పటిదాకా ఆ దిశగా నిర్ణయం తీసుకోలేదో చెప్పాలి. తెలంగాణలోని జాతీయ రహదారి ప్రాజెక్టులు, నూతన రైల్వే లైన్ల ఏర్పాటు, రైల్వే లైన్ల బలోపేతం వంటి అన్ని రకాల డిమాండ్లను మోదీ పక్కన పెట్టారు. తెలంగాణ పట్ల ఆయన ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యాన్ని, వివక్షను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు. సరైన సమయంలో భాజపాకు గుణపాఠం చెప్పడం ఖాయం" అని కేటీఆర్ హెచ్చరించారు.

# విధివైచిత్రి.. ఖమ్మంలో అటో పొంగులేటి.. ఇటో పొంగులేటి



రాజకీయాలు బహుచిత్రమైనవి. అందుకే రాజకీయాల్లో శాశ్వత మిత్రులు శాశ్వత శత్రువులు ఉండరు అని సామెత చెబుతారు. అంతేకాదు రాజకీయాల్లో హత్యలు ఉండవు.. ఆత్మహత్యలే ఉంటాయి అని కూడా అంటారు. ఈ రెండు ఉదాహరణలను ఆయా సందర్భాలను బట్టి ఉపయోగిస్తుంటారు. అందులోనూ ఏ పార్టీ ఎప్పుడు ఏ పార్టీతో అవగాహన చేసుకుంటుందో తెలియని కాలం ఇది. ప్రాధామ్యాలు వెంటవెంటనే మారిపోతున్న పరిస్థితుల్లో రాజకీయాలను అంచనా వేయడం కూడా కష్టమైపోతోంది.

**ఆయన అలా..** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 30 ఏళ్ల కిందటే పొంగులేటి సుధాకర్ రెడ్డి అంటే పెద్ద పేరు. కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా ఆయన హవా సాగేది. ప్రత్యక్ష ఎన్నికల్లో గెలవకున్నా సుధాకర్ రెడ్డి అంటే అదో క్రేజ్. కాంగ్రెస్ అధిష్ఠానంతో నేరుగా సంబంధాలు ఉండడమే దీనికి కారణం. కొత్తగూడెంలో జరిగిన కాంగ్రెస్ సభలో రాజీవ్ గాంధీ ఫోకస్ లో పడిన సుధాకర్ రెడ్డికి అక్కడినుంచి తిరుగులేకుండా పోయింది. ఓ దశలో ఆయనకు టికెట్ దక్కనందుకు గాంధీభవన్ లో పెద్దఎత్తున అనచరులు విధ్వంసమే రేపారు. అంతేగాక సుధాకర్ రెడ్డి గతంలో ప్రత్యక్ష ఎన్నికల్లో ఎంపీ ఎమ్మెల్యేగా పోటీచేసినా విజయం సాధించలేకపోయారు. దీంతో చట్టసభల్లో ప్రవేశించ లేక పోయారు. ఆ కోరిక 2007లో ఎమ్మెల్సీ కావడం ద్వారా తీరింది. ఆ టర్మ్ తర్వాత ఆయనకు మళ్లీ ఎన్నికల్లో పోటీ అవకాశం రాలేదు. అయితే అనూహ్యంగా సుధాకర్ రెడ్డి 2014లో బీజేపీలో చేరారు. కాంగ్రెస్ అధిష్ఠానంలో మంచి పలుకుబడి ఉన్న ఆయన అలా చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. బీజేపీలో చేరాక కూడా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ అవకాశం రాలేదు. ప్రస్తుతం తమిళనాడు పార్టీ బాధ్యతలు చూస్తున్నారు.

**ఈయన ఇలా..** పొంగులేటి సుధాకర్ రెడ్డి బంధువే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. సరిగ్గా సుధాకర్ రెడ్డి కాంగ్రెస్ కు దూరమవడానికి కొన్ని సంవత్సరాల ముందుగా శ్రీనివాస్ రెడ్డి రాజకీయ అరంగేట్రం చేశారు. అయితే కాంగ్రెస్ నుంచి కాకుండా వైఎస్సార్ కాంగ్రెస్ నుంచి రాజకీయాల్లోకి వచ్చారు. అలా తొలి ప్రయత్నంలోనే 2014లోనే ఖమ్మం ఎంపీ అయ్యారు. ఆ తర్వాత బీఆర్ఎస్ లోకి వెళ్లారు. అక్కడా సముచిత ప్రాధాన్యం దక్కడం లేదంటూ ఇటీవల కాంగ్రెస్ లో చేరారు.

**చిత్రమేమంటే..** ఒకప్పుడు ఎప్పుడంటే అప్పుడు కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలను కలిసేవారు సుధాకర్ రెడ్డి. అలాంటి వ్యక్తి బీజేపీలో చేరారు. ఇప్పుడు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అదే కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలను కలిసి పార్టీలో చేరికను ఖాయం చేసుకున్నారు. అదీ కాకుండా సొంతగడ్డ ఖమ్మంకు కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీని రప్పించి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. తద్వారా తన స్థాయి ఏమిటో చాటారు. ఒకప్పుడు ఏ ఖమ్మం జిల్లా సభలో అయితే అగ్ర నాయకుల సమక్షంలో సుధాకర్ రెడ్డి వెలుగులోకి వచ్చారో అదే ఖమ్మం జిల్లా సభలో శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ లో చేరి తన ప్రాధాన్యం చాటడం విధి వైచిత్రి.

# తెలంగాణ ఎదుగుతుంటే బీజేపీ ఓర్వలేకపోతోంది

మెదక్: తెలంగాణ ఎదుగుతుంటే బీజేపీ ఓర్వలేకపోతోందని మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. నర్సాపూర్‌లో గిరిజనులకు పోడు భూముల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజనులకు పోడు పట్టాలను హరీష్ రావు అందజేశారు. మెదక్ జిల్లాలో మొత్తం 517 ఎకరాలకు గాను 610 మంది గిరిజనులకి పోడు పట్టాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వరంగల్ సభలో ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. "కేసీఆర్ కిసాన్ అజెండాతో కాంగ్రెస్, బీజేపీలకు భయం పట్టుకుంది. తెలంగాణలో ఏమీ అభివృద్ధి చేయకపోతే అవార్డులు ఎందుకు ఇస్తున్నారు. ఢిల్లీలో అవార్డులు ఇచ్చి గల్లీ వచ్చి మోదీ తిట్టిపోతారు. తెలంగాణ సంక్షేమ పథకాలను కేంద్రం నకలు కొడుతోంది. మేం మంచి చేయకపోతే అవార్డులు ఎందుకు ఇస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీలు బీఆర్ఎస్‌పై బురద చల్లుతున్నారు. తెలంగాణకు పెట్టుబడులు వస్తున్నాయంటే మోదీ గొప్పతనం ఏమీ లేదు. కేసీఆర్ వల్లే పెట్టుబడులు వస్తున్నాయి. తెలంగాణ అభివృద్ధికి మోదీ మోకాలడ్డుతున్నారు. తెలంగాణ ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే.. రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన లక్ష కోట్ల బకాయిలు విడుదల చేయాలి. మోదీ వచ్చినప్పుడల్లా పాత చింతకాయే. కోచ్ ఫ్యాక్టరీ అని మాటల్లో చెప్పి.. వ్యాగన్ ఫ్యాక్టరీ ఇచ్చి మోదీ మోసం చేశారు. లడ్డు ఇవ్వాల్సిన చోట పిప్పర్ మెంట్ ఇచ్చి వెళ్లారు మోదీ. బీజేపీకి సీబీఐ, ఈడీ వంటి వంద




ఏజెన్సీలు ఉన్నా.. న్యాయం, ధర్మం బీఆర్ఎస్ వైపు ఉన్నాయి." అని హరీశ్‌రావు తెలిపారు. "తెలంగాణలో 7 లక్షల ఎకరాలకు పోడు పట్టాలు ఇస్తున్నాం. దేశంలో అత్యధికంగా పోడు పట్టాలు ఇచ్చిన రాష్ట్రం తెలంగాణ. రాష్ట్ర అటవీ విస్తీర్ణంలో 10 శాతం పోడు పట్టాలు ఇచ్చాం. పోడు పట్టాతో పది రకాల ప్రయోజనాలు కల్పిస్తున్నాం. పోడు పట్టాదారులకు రెండు, మూడు రోజుల్లో రైతు బంధు ఇస్తాం. 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తాం. కాంగ్రెస్, టీడీపీలు గిరిజనులను ఓటు బ్యాంకుగా వాడుకున్నారు తప్ప ఏమీ చేయలేదు." అని మంత్రి విమర్శించారు.

# కేంద్రం తెలంగాణ పథకాలను కాపీ కొడుతుంది



వరంగల్: దేశంలో బీఆర్ఎస్‌కు వస్తున్న ఆదరణ తట్టుకోలేక ఓటమి భయంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అసత్యాలు మాట్లాడుతున్నారని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. శనివారం మంత్రి సత్యవతి రాథోడ్ మీడియాతో మాట్లాడుతూ.. ఈరోజు మోదీ ప్రసంగం అయోమయం అందోళన కరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో ఇతర రాష్ట్రాల్లో వరాల జల్లు కురిపించే మోదీ ఇక్కడ ఎలాగూ ఓడిపోతామని తెలిసి అభివృద్ధి గురించి ప్రస్తవించకుండా కేవలం రాజకీయ విమర్శలు చేశారన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు పెట్టుబడులు వస్తున్నాయంటే అది కేసీఆర్ గొప్పతనం మాత్రమేనని స్పష్టం చేశారు.తెలంగాణ రాష్ట్ర పథకాలు కాపీ కొడుతుంది మీరు కాదా...? అని ప్రశ్నించారు. మీకు నిజంగా తెలంగాణపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న విభజన హామీల అమలపై మాట్లాడేవారని చెప్పారు. కోచ్ ఫ్యాక్టరీ అడిగితే వ్యాగన్ యూనిట్ ఇచ్చారన్నారు. గిరిజన విశ్వవిద్యాలయాన్ని అడ్డుకొని, అడవి బిడ్డల గురించి మాట్లాడటం ప్రధాని కపటప్రేమకు నిదర్శనమని సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు.




# భూ గోస.. ఏదీ భరోసా!

జయశంకర్ భూపాలపల్లి : రాష్ట్ర ప్రభుత్వం భూ సంబంధిత వ్యవహారాలను ధరణి పోర్టల్ నుంచి నిర్వహిస్తోంది. రిజిస్ట్రేషన్లతో పాటు, వివిధ మార్పులు చేర్పులను ధరణి ద్వారానే చేసుకోవాలి.. అయితే కొన్ని భూ సంబంధిత సమస్యలు ధరణిలో పరిష్కారం కాక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మీ సేవ ద్వారా చలాన్లు కట్టి దరఖాస్తు చేసుకుని, పత్రాలు, నివేదికలు సమర్పించినా పనులు కావడం లేదని వాపోతున్నారు. అలాగే రద్దు చేసుకున్న, తిరస్కరణకు గురైన దరఖాస్తులకు సంబంధించిన డబ్బులు తిరిగి వారి ఖాతాల్లో జమకావాల్సి ఉన్నా, అవి రాకపోవడంతో రైతులు నిరీక్షించాల్సి వస్తోంది. ధరణిలో డీఎస్ పెండింగ్, పేరు, ఇతర తప్పులు సరిదిద్దుకోవడం, విస్తీర్ణంలో హెచ్చుతగ్గుల మార్పులు, ఇతరుల పేరిట తప్పుగా నమోదైతే సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించి సరి చేసుకోవడం, తదితర మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. కొన్ని సమస్యలు పరిష్కారమవుతున్నా, మరికొన్ని సమస్యలు కొలిక్కిరావడం లేదని వాపోతున్నారు. మీ సేవలో దరఖాస్తు చేసుకొని అధికారులకు విన్నవించుకున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదని చెబుతున్నారు. దీంతో రైతులు నిరాశకు లోనవుతున్నారు. ధరణిలో నమోదైతే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు, రైతుబంధు లాంటి ప్రయోజనాలు కలుగుతాయని భావిస్తున్న రైతులకు నిరాశే మిగులుతోంది.

**రద్దయితే సొమ్ము గోవిందా! :** వ్యవసాయ రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్ సమయంలో అక్కడి భూముల విలువ ప్రకారం రుసుము చెల్లించి, కేటాయించిన తేదీ రోజున తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్తారు. అక్కడ ఇరువర్గాల సమక్షంలో రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. కొన్నిసార్లు కొనుగోలు, విక్రయదారుల్లో సయోధ్య కుదరకపోవడం, దస్త్రాల్లో సమస్యలు, తదితర కారణాలతో రైతులు రిజిస్ట్రేషన్లను రద్దు చేసుకుంటున్నారు. వారు చెల్లించిన రుసుమును తిరిగి ఖాతాల్లో జమ చేయాలని మీ సేవలో వివరాలను నమోదు చేస్తున్నారు. కానీ, రుసుములు మాత్రం తిరిగి రావడం లేదు. వాటి కోసం రైతులు తహసీల్దార్ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికైనా రైతుల భూ సమస్యలను పరిష్కరించాలని, రద్దు చేసుకున్న దరఖాస్తులకు చలాన్ల డబ్బులు చెల్లించాలని రైతులు కోరుతున్నారు. సంబంధిత రైతులు సరైన పత్రాలు, నివేదికలు సమర్పిస్తే భూ సమస్యలు పరిష్కారం అవుతాయని అధికారులు చెబుతున్నారు.

# ఈ నియోజకవర్గంపైనే కాసాని కన్ను!

రంగారెడ్డి జిల్లా : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ లో తన సత్తా చాటుకోవాల ని భావిస్తోంది.. టీడీపీ. కొన్ని నియోజకవర్గాల్లో కమ్మ సామాజికవర్గం బలంగా ఉండటంతో అక్కడ పోటీ చేయాలని ఆశిస్తోంది. అలాగే బీజేపీ తో పొత్తు కుదిరితే మరికొన్ని సీట్లలో పోటీ చేయడానికి ప్రణాళికలు రచించుకుంటోంది. ఇందు లో భాగంగా తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా లోని పరిగి అసెంబ్లీ సీటు పై దృష్టి సారించారని తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో పరిగి నుంచి తన తనయుడు కాసాని వీరేష్ ను పోటీ చేయించే ఉద్దేశం లో కాసాని జ్ఞానేశ్వర్ ఉన్నట్టు చెబుతున్నారు. గతం లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కు కాసాని జ్ఞానేశ్వర్ జిల్లా పరిషత్ చైర్మన్ గా పనిచేశారు. ఈ నేపథ్యం లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయన కు పలువురు నేతలు కార్యకర్తలతో మంచి సంబంధాలు ఉన్నాయి. అంతేకాకుండా పరిగి నియోజకవర్గం లో బీసీలు ఎక్కువ. అందులోనూ ముదిరాజ్ లు ఎక్కువ మంది ఉన్నారు. కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ కమ్యూనిటీకి చెందినవారే. ఈ నేపథ్యంలో పరిగి లో తన కుమారుడిని పోటీ చేయిస్తే విజయం ఖాయమని ఆయన భావిస్తున్నట్టు సమాచారం. గతం లో పరిగి లో టీడీపీ తరపున కొప్పుల హరీశ్వర్ రెడ్డి ఏకంగా ఐదుసార్లు గెలిచారు. పరిగి నియోజకవర్గం గతం లో టీడీపీ కి పెట్టనికోటలా ఉండేది. ప్రస్తుతం కాసాని టీడీపీ తెలంగాణ అధ్యక్షుడిగా ఉండటంతో తన పట్టు నిలుపుకోవాల ని ఆశిస్తున్నారు. అందులో భాగంగానే టీడీపీ కి పట్టు ఉన్న నియోజకవర్గం కావడం బీసీలు ఎక్కువ ఉండటం తన కమ్యూనిటీ అయిన ముదిరాజ్ లు ఎక్కువ ఉండటంతో కాసాని జ్ఞానేశ్వర్ పరిగి పై దృష్టి సారించారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కాసాని గతం లో టీడీపీ లో ఉన్న పాత లీడర్లు క్యాడర్ ను సొంత గూటికి రప్పించే ప్రయత్నాల్లో భాగంగా ఫోన్లు చేయడం కలవడం చేస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటికే నియోజకవర్గం పరిధి లో ప్రతి మండలంలో గ్రామాల్లో టీడీపీ కార్యాలయాలు ఏర్పాటు చేసే పని లో ఉన్నారని అంటున్నారు. అంతేకాకుండా



పరిగి లో టీడీపీ మినీ మహానాడు ను విజయవంతంగా నిర్వహించారు. ఇప్పటికే కాసాని కుమారుడు వీరేష్ టీడీపీ జాతీయ కార్యదర్శిగా ఉన్నారు. అంతేకాకుండా పరిగి టీడీపీ ఇంచార్జిగా కూడా ఆయననే నియమించారు. వీరేష్ కూడా విజయం సాధించడానికి గట్టి పట్టుదలతో ఉన్నారని చెబుతున్నారు. నియోజకవర్గం పరిధిలోనే నివాసం ఉండటానికి వీలుగా ఇంటిని అన్వేషిస్తున్నారు. అంతేకాకుండా నియోజకవర్గం లో ముమ్మరంగా పర్యటిస్తూ ఆలయ నిర్మాణాల కు కల్యాణ మండపాల కు ఆర్థిక చేయూతనందిస్తున్నారు. ఎవరైనా చనిపోతే వారి కుటుంబాల ను పరామర్శిస్తున్నారు. పాత టీడీపీ నేతల ను కలిసి తనకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు. మరోవైపు టీడీపీ-బీజేపీ మధ్య పొత్తు ఉన్నా పరిగిని టీడీపీకే కేటాయించేలా కాసాని జ్ఞానేశ్వర్ చక్రం తిప్పుతున్నార ని టాక్ నడుస్తోంది. ప్రస్తుతం పరిగికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి ఉన్నారు. కాంగ్రెస్ తరపున మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి బరి లో దిగే చాన్సు ఉంది. పరిగికి కాసాని వీరేష్ వస్తే త్రిముఖ పోటీ నెలకొననుంది.

# తెలంగాణ బీజేపీ ఎన్నికల ఇన్చార్జిగా ప్రకాష్ జవదేకర్!



హైదరాబాద్ : ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నాలుగు రాష్ట్రాల్లో బీజేపీ దూకుడు పెంచింది. ఆయా రాష్ట్రాల కు ఎన్నికల ఇన్చార్జుల ను నియమించింది. తాజాగా ఈ నియామకాల ప్రకటన చేసింది. ఇప్పటికే పలురాష్ట్రాల్లో అధ్యక్షుల ను మార్పు చేయడంతోపాటు పార్టీ మారుతార ని భావించిన నాయకుల కు కూడ పదవులు ఇచ్చి.. బంధం వేసిన బీజేపీ పెద్దలు తాజాగా ఎన్నికల ఇన్చార్జుల ను కూడా నియమించడంతో అసెంబ్లీ ఎన్నికలను ఎంత ప్రతిష్టాత్మకంగా భావిస్తోందో అర్థం చేసుకోవచ్చని పరిశీలకులు చెబుతున్నారు. తెలంగాణ విషయానికి వస్తే.. ఈ రాష్ట్రం లో ఎన్నికల ఇన్చార్జిగా ప్రకాష్ జవదేకర్ ను నియమించారు. ఈయన గతం లో కేంద్ర మంత్రిగా పనిచేశారు. మహారాష్ట్ర లోని పుణే లో జన్మించిన ఆయన సుదీర్ఘ కాలంగా రాజకీయాల్లో ఉన్నారు. ప్రస్తుతం బీజేపీ అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు. అందరినీ కలుపుకొని పోయే నాయకుడిగా పేరున్న జవదేకర్ కు.. తెలంగాణ బాధ్యతలు అప్పగించడం విశేషం. మరి ఆయన ఏమేర కు ఇక్కడి పరిస్థితుల ను చక్కదిద్దుతారో చూడాలి. రాజస్థాన్ ఎన్నికల ఇన్చార్జి బాధ్యతల ను ప్రహ్లాద్ జోషికి బీజేపీ అధిష్టానం అప్పగించింది. ప్రస్తుతం ఈయన కేంద్ర బొగ్గు గనులు ఇంకా పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రహ్లాద్ జోషి 2004 నుంచి కర్ణాటక లోని ధార్వాడ్ నుంచి లోక్సభ ఎంపీ గా ఉన్నాడు. ఆయన ఇప్పటి వరకు 4 సార్లు ఎంపీ గా ఎన్నికయ్యారు. రాజకీయాల్లో మంచి చతురత ఉన్న నాయకుడిగా పేరుతెచ్చుకున్నారు. ప్రస్తుతం రాజస్థాన్ లో కాంగ్రెస్ సర్కారు ఉంది. ఇక్కడ ఎలాగైనాపాగా వేయాల ని బీజేపీ భావిస్తోంది. ఛత్తీస్గఢ్ ఎన్నికల ఇన్చార్జి బాధ్యతలను ఓం ప్రకాష్ మాథుర్ కు అప్పగించింది. మధ్యప్రదేశ్ ఎన్నికల ఇన్చార్జిగా భూపేంద్ర యాదవ్ ను బీజేపీ అధిష్టానం నియమించింది. తెలంగాణ లో ప్రకాష్ జవదేకర్ కు కో-ఇన్చార్జిగా సునీల్ బన్సాల్ వ్యవహరిస్తారు. రాజస్థాన్ లో నితిన్ పటేల్ కుల్దీప్ బిష్ణోయ్ కో-ఎలక్షన్ ఇన్చార్జులు గా ఛత్తీస్గఢ్ కు డాక్టర్ మన్సుఖ్ మాండవీయ కో-ఇన్చార్జిగా వ్యవహరిస్తారు. మధ్యప్రదేశ్ లో అశ్విన్ వైష్ణవ్ కో-ఇన్చార్జిగా ఉంటారు. వీరంతా బీజేపీ ని వచ్చే ఎన్నికల్లో గెలిపించడమే ధ్యేయంగా పనిచేయనున్నారు.

# తెలంగాణపై మోడీ విషం కక్కారు



హైదరాబాద్: తెలంగాణపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విషం కక్కారని మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు విభజన హామీలు నెరవేరుస్తారని ప్రజలంతా ఆశించారని.. తెలంగాణ ఉద్యమంలో అసలు బీజేపీ పాత్ర ఏంటని ప్రశ్నించారు. విశ్వాస ఘాతకుడు మోడీ అంటూ విరుచుకుపడ్డారు. అద్వానీ లాంటి నాయకున్ని అణగదొక్కిన చరిత్ర మోడీది అని విమర్శించారు. కోచ్ ఫ్యాక్టరీ పెట్టకుండా ఒక చిన్న రిపేర్ కంపెనీ పెట్టారన్నారు. తెలంగాణ ప్రజలకు నమ్మకద్రోహం చేశారని మండిపడ్డారు. ఏపీలో ఏడు మండలాలు కలిపి తెలంగాణకు మోసం చేశారన్నారు. దేశానికి కరువొచ్చినా.. దేశానికి అన్నం పెట్టగలిగే స్థాయిలో తెలంగాణ ఉందని చెప్పుకొచ్చారు. తమర పేర్లు మార్చి పెట్టుకున్న పథకాలు అన్నింటికీ తెలంగాణే కేంద్ర బిందువన్నారు. కర్ణాటకలో అత్యంత అవినీతి చేసింది బీజేపీ ప్రభుత్వమే అని అన్నారు. 80 కోట్ల బీసీలు మీరు ప్రధాని అయితే సంతోష పడ్డారని.. కానీ బీసీ మంత్రిత్వ శాఖ లేని ప్రభుత్వం బీజేపీదన్నారు. అవినీతి జరిగి ఉంటే ఇన్ని అద్భుత పథకాలు ఎలా వస్తాయని మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com